# నాకు తెలిసిన
# జాషువా

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ : 1996

వెల : రూ. 24/-

హక్కులు : రచయితవి

ప్రతులకు :

**భీమన్న సాహితీ నిధి**

ఇర్రం మంజిల్ కాలనీ, ఐ.సి. 85,

హైదరాబాదు - 82.

ముద్రణ :

**పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,**

1-1-517/బి/1, న్యూ బాకారం,

గాంధీనగర్, హైదరాబాద్ - 500 380.

ఫోన్లు : 7611413.

# స్మృతి

సృష్టిలోని ప్రతిజీవిలోనూ, ముఖ్యంగా ప్రతి మానవుడిలోనూ త్రిగుణాలు వలెనే, ఆరు ఉద్రేకాలు వలెనే, నవరసాలు కూడా ఉంటై.

ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క గుణం, ఒక్కొక్క ఉద్రేకం, ఒక్కొక్క రసం సమయ సందర్భాలను బట్టి అతిశయిస్తూ ఉంటుంది. అవనతిస్తూ ఉంటుంది.

కవిలోని భావం ఆవేశం పొందేకొలదీ, పదునెక్కే కొలదీ వచనం నుంచి గేయంగా, పద్యంగా రూపొందుతూ ఉంటుంది. ఆ విధంగా తన ప్రతి భావమూ ఉప్పొంగి, ఊపందుకొని పద్యంగా రూపుదిద్దుకున్న పరమ కవితా శిల్పం జాషువా గారిది.

నిజానికి జాషువాగారి గురించి ఇలాంటి రచన చేస్తానని నేనెప్పుడూ అనుకోలేదు. ఆయన సన్నిధిలో ఏదో సంతృప్తిని అనుభవించడం, ఆయన పద్యాలు వింటూ, చదువుతూ ఆనందించడం మాత్రమే ఆయన బ్రతికి ఉండగా నేను చేసిన పని.

ఒక్క జాషువా గారి గురించే కాదు, ఏ ఒక్కరి గురించీ ప్రత్యేకంగా నేనేమీ వ్రాయలేదు. సాహిత్యోపన్యాసాలు సైతం ఇవ్వలేదు.

కాలేజీల నుంచి, యూనివర్సిటీల నుంచి సాహిత్యోపన్యాసాల కోసం వచ్చిన ఎన్నో ఆహ్వానాలను నేను ఉపేక్షించడం జరిగింది కూడ.

సాహిత్యాన్ని సృష్టించాలే కాని, కవి అయినవాడు సాహిత్యం గురించి ఉపన్యాసా లివ్వగూడదనేది నా సిద్ధాంతం. అట్టి ఉపన్యాసాలు ఇవ్వవలసింది పండితులు. అట్టివారిలో ఆనాడు ఆచార్య దివాకర్ల వేంకటవధాని, ఈనాడు ఆచార్య సి.నా.రె. ప్రధానులు. విషయ వివరణ వైదుష్యంలో ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగార్నీ, ఆచార్య గోపీగార్నీ చెప్పుకోవచ్చు.

నేను కవినే గాని పండితుణ్ణి కాదు.

అయితే – ఇప్పుడీ రచన ఎందుకు చేశాను?

రెండు సంవత్సరాల క్రితం, 1994 మార్చి ప్రాంతంలో ఒక రోజున, కవితా వాహినిలో ఏదో కవితను రికార్డు చేయడం కోసం నేను రేడియో స్టేషనుకు

వెళ్ళినప్పుడు, రికార్డింగ్ అయిపోయిన తర్వాత, ఏవో కబుర్ల సందర్భంగా, సాహిత్య కార్యక్రమాల ప్రొడ్యూసరు చేవెంౡ చలపతిరావుగారు అడిగారు ''గుర్రం జాషువా గారిని గురించి ఒక నాలుగు నిమిషాలపాటు ఏమైనా చెప్పగలరా?'' అని.

''నాలుగు నిముషాలే కాదు, ఆయన గురించి నాలుగు రోజులపాటు మాట్లాడమన్నా ఏకధాటిగా మాట్లాడగలను'' అన్నాను నేను.

''మరేమీ లేదు. జాషువాను గురించిన ప్రోగ్రాం ఒకటి రేపు ప్రసారం అవుతున్నది. అందులో పాల్గొంటున్న వారి పేర్లలో మీ పేరు లేదని నాకిప్పుడే తెలిసింది. మీరు లేకుండా జాషువాపై ప్రోగ్రామా అనిపించి అడిగాను. ఇప్పుడైనా, మీరు నాలుగు మాటలు చెపుతానంటే, రికార్డు చేసుకుంటాను'' అన్నారు ఆయన – తనకు సహజమైన చిరునవ్వును కొంచెం పెంచుతూ.

చలపతిరావుగారి ముఖం మీద ఒక రకమైన చిరునవ్వు ఎప్పుడూ మెరుస్తూనే ఉంటుంది. అలాంటి చిరునవ్వంటే చాలా ఇష్టం నాకు. కవితా గానం చేసేటప్పటి జాషువాగారి ముఖం జ్ఞాపకం వచ్చిందా క్షణంలో.

'నాకు తెలిసిన జాషువా' అనే శీర్షికతో, ఆయనతో నాకు గల పరిచయాన్ని క్లుప్తంగా నేను చెబితే, చలపతిరావుగారు రికార్డు చేసుకున్నారు.

నాపట్ల చలపతిరావుగారు కనబరచిన అవ్యాజాభిమానం, సహృదయతా, విషయంపట్ల ఔచిత్యం, అభిజ్ఞత ఆవిధంగా ఈ రచనకు మూల కారణాలయినై.

ప్రతిధ్వనే తప్ప ధ్వని వినిపించే అవకాశంలేని కులపర్వతారణ్యంలో, నూరేళ్ళ క్రితం పుట్టి, అక్కడి నుంచి నిరంతర కృషిద్వారా నెత్తుటితో, చెమ్మటతో, కన్నీటితో ఈ అభారతీయ కుల వ్యవస్థా యెడారిని భారతీయం చేయడానికి ముప్పాతిక యేండ్లపాటు సాగుచేసుకుంటూ వచ్చిన మానవతా మహాకర్షకుడు జాషువా.

ఒక నలభై ఏళ్ళపాటు ఆయన పరిచయాన్ని పంచుకున్న సహ కర్షకుణ్ణి నేను.

అప్పటి పరిచయ సమైశ్వర్యాన్ని స్మృతిక్షేత్రం త్రవ్వకం ద్వారా ఇప్పుడు మళ్ళీ అనుభవించే మహదవకాశం కలిగిందంటే, అందుకు చలపతి రావుగారికి కృతజ్ఞతాభి వందనాలు చెప్పక తప్పదు కదా!

నా కెవరైనా అపకారం చేస్తే, అది శివార్పణమైపోతుంది. నాకు జ్ఞాపకం ఉండే అవకాశం లేదు. నాకు ఎవరైనా చిన్న ఉపకారమో, సహాయమో చేసినా

అది సారస్వతమై, చిరస్థాయిగా జ్ఞాపకం ఉంటుంది. ఇది నా స్వభావం.

దేశంలో అనేక ఆకాశవాణి కేంద్రాలలో పనిచేస్తూ, విజయవాడమీదుగా ఈ మధ్యనే హైదరాబాద్ కేంద్రానికి వచ్చారు చలపతిరావుగారు. అంతవరకు ఆయనెవరో నాకు తెలియదు. జాషువాను గురించి నేను రమారమి అరవై సంవత్సరాలు వెనక్కి వెళ్ళి మరపు పొదల్ని చీల్చుకొంటూ, జ్ఞాపకాల వెలుగు నీడలలో తడబడుతూ, ఈ రచనను ఆవిష్కరించా నంటే అందుకు కారణం చలపతిరావుగారి సహృదయ సూచనే.

ఆ తర్వాత చాలా కాలానికి నరసాపురంలోని "మహాకవి జాషువా శతజయంతి ఉత్సవ సమితి" వారి నుంచి ఏదైనా ఒక వ్యాసం పంపించవలసిందిగా ఒక లేఖ అందింది. ఉత్సవ ప్రత్యేక సంచిక సంపాదకులు డా. అరిపిరాల నారాయణ రావుగారు వ్రాసిన లేఖ అది. అందుకోసం ఆనాటి రేడియో ప్రసంగం జ్ఞాపకం తెచ్చుకోవడం తప్పలేదు.

జాషువా శత జయంతి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయనీ, ఆ సందర్భంలో జాషువా గురించి మీరేదైనా వ్రాయవచ్చు కదా అనీ, మిత్రుడు గనుమల జ్ఞానేశ్వర్ ఒక సూచన చేసినప్పుడు, అంత శ్రమపడే శక్తి నాకిప్పుడు లేదని చెప్పాను.

నాకు ఒక పాతికేళ్ళుగా ఆత్మీయుడిగా ఉన్న యువమిత్రుడు జ్ఞానేశ్వర్. బాలాపురం వీరాంబేడ్కరీయుడీయన. సమయజ్ఞత కలవాడు. సంస్కారవంతుడు. చక్కని సలహాలిస్తుంటాడు. బాగా చదువుకున్న విద్యాధికుడు, జర్నలిస్టు, సొంతలాభం కొంతకాదు, మొత్తము మానుకొని, పొరుగు వాళ్ళకు తోడ్పడుతున్న త్యాగి. సంఘారామ సార్థక బిరుదాంకితుడు.

అయితే, ఆ తర్వాత జాషువా గురించిన సభలను, సాహిత్య వ్యాసాలను చూస్తూ ఉంటే, జాషువా కవితా మహా సముద్రాన్ని లోతుకి వెళ్ళి సమగ్ర పరిశీలన జరిపే ప్రయత్నం ఎవరూ చేయడంలేదనే అసంతృప్తి నాలో నెలకొనసాగింది. అందుకే వణుకుతున్న చేతులలోకి మళ్ళీ కలాన్ని అందుకున్నాను.

వణికే చేతులతో లోకాన్ని వణికిస్తున్న విశిష్ఠ కవినంటూ నన్ను తరచూ నారాయణ రెడ్డిగారు పేర్కొంటూ వుండడంతో, నా చేతుల వణుకు సాహితీ లోకంలో ఒక క్లాసిక్కు (పురాణం) అయి కూర్చుంది కూడా.

అప్పటికి ఒక సంవత్సరంగా నాకు సయాటికాతో ఎడమకాలు, డయాబెటీస్‌తో కుడికన్నూ సమ్మెకు దిగి ఉన్నై. అయినా, తిరుగుతూనే ఉన్నాను. సభల్లో పాల్గొంటూనే ఉన్నాను. నేనంటే ఇష్టం ఉన్నవాళ్ళూ లేనివాళ్ళూ కూడా ఈ నా జీవలక్షణ వైరుధ్యాన్ని యధేచ్ఛగా వాడుకొంటూనూ ఉన్నారు.

కొందరైతే, నా పేరును నాకు చెప్పకుండానే తమ ప్రోగ్రాంలలో వేసుకొని, ఆ తర్వాత కూడా చెప్పకుండా ప్రోగ్రాంలు జరుపుకొని, ఎవరైనా అడిగినపుడు ''ఆయన మంచంపట్టి లేవడంలే''దనే ప్రచారం చేస్తున్నారు కూడ!

''ఆత్మాత్వం, గిరిజా మతిః, పరిజనా ప్రాణాః, శరీరం గృహం, పూజాతే విషయోప భోగ రచనా –'' అనే ఆదిశంకరుల వారి శ్లోకం పురాసారాయంలా తలకెక్కిన నేను, ఏదీ పట్టించుకోలేదు.

ఈ కారణంగానే, నేనంటే ఎంతో శ్రద్ధ తీసుకునే డాక్టర్ల సలహాలను కూడా పట్టించుకోక పోవడంవల్ల – వాళ్ళలో చాలా మంది నాకు ఇతర మిత్రుల వలెనే దూరమైపోవడం జరిగింది. ఇప్పుడు, నా మాట కాదనలేక రాజవైద్యం చేసే మా అబ్బాయి డాక్టర్ వర్మ ఒక్కడే నాకు ఏకైక డాక్టరుగా మిగిలాడు. అతడ్ని కూడా నా దగ్గర లేకుండా కర్నూలుకు ట్రాన్స్‌ఫర్ చేసింది ప్రభుత్వం. అదీ నా ప్రస్తుత పరపతీ, పలుకుబడీ, పరిస్థితీ.

ఎడమకాలి సయాటికా నుంచి, కుడికన్ను నిర్వ్యాపారత నుంచి విముక్తి కలుగుతున్న సమయంలో, పూర్తి విశ్రాంతి తీసుకొమ్మని బంధుమిత్ర డాక్టర్లంతా సలహాలిస్తున్న తరుణంలో, ఏదో ఆవేశించిన ఉద్రేకంతో ఈ రచన మొదలుపెట్టాను. పగలనక రాత్రనక స్వహస్తంతో రచన ప్రారంభించాను.

జ్ఞాపకాలు, పురావస్తు త్రవ్వకాలలోవలె, తవ్వే కొలదీ ఊరసాగినై. ఎంతో శిథిల సంపద బయటపడసాగింది. ఒక నెల రోజులపాటు వ్రాసి ముగించేటప్పటికి చేయి ఇక వ్రాయలేనని మొండికేసింది. బుర్ర వేడెక్కిపోయింది. అది తలనిండా పొక్కులుగా తేలి సర్పిగా పడగెత్తింది.

అలా బాధపడుతూనే ఈ రచనను పూర్తిచేసి, మిత్రులు జస్టిస్ పున్నయ్య గారికి చదివి విన్పించాను. ఆయన ఎంతో శ్రద్ధగా విని, వెంటనే ముద్రించమన్నారు. ఆయనకు ఎన్ని వేల కృతజ్ఞతలు చెప్పినా తక్కువే అవుతాయి.

అలాగే, బిట్లు, బిట్లుగా వ్రాసినా ఈ మొత్తం రచనను కొంత ఎడిట్ చేసుకుంటూ శుద్ధ ప్రతిని డిక్టేటు చేశాను. తన సొంత పనులు కూడా మానుకొని,

ఈ డిక్టేషను తీసుకున్న ఇంగువ శ్రీకరుణకు కూడా ఋణపడి ఉన్నాను. అలాగే మా ఆవిడ హైమవతికీ, మా అమ్మాయిలు విజయపల్లవీ, విజయేందిరలకూ కూడ.

నేను ఈ రచనను చేస్తున్న సమయంలో నా దగ్గర జాషువాగారి రచనలేవీ లేవు, ఈ విషయం తెలుసుకొన్న జస్టిస్ పున్నయ్యగారు తనవద్దగల గ్రంథాలను తీసుకువస్తానన్నారు గాని, నేను వద్దన్నాను. అందుకు కారణం నా స్మృతి క్షేత్రపు ప్రత్యేకతనూ, స్వచ్ఛతనూ నిలుపుకోవాలనేది.

అయితే, సంగారెడ్డిలో ఉద్యోగం చేసుకుంటున్న ఒక యువకవి మిత్రుడు, నక్కా అమ్మయ్యగారు ఒకసారి నా వద్దకు వచ్చినపుడు, నాకు అస్పష్టంగా జ్ఞాపకం ఉన్న కొన్ని పద్యాల గురించి చెబితే, ఆయన వాటిని స్పష్టంగా వ్రాసి ఇచ్చాడు. అందుకు అమ్మయ్యగారికి కూడా నేను కృతజ్ఞతలు చెప్పవలసి ఉంది.

ఈ రచనను ముద్రణకు ఇచ్చేముందు, వ్రాత ప్రతి దశలో జస్టిస్ పున్నయ్యగారు విన్నట్టే తాము కూడా వినడానికి సహృదయ మిత్రులు, సాహితీవేత్తలు అయిన బొజ్జా తారకం, పి.వి.రావు, బిళ్ళ వేదయ్య, జొన్నకూటి నాగేశ్వరరావు వంటి వారు సుముఖత వెల్లడించాడు. అయితే, వారెవరికీ అందుకు తగు సమయం దొరికినట్టు లేదు. వారి సహృదయతను కూడా నేను ఇక్కడ అభినందించక తప్పదు.

నేను ఎన్ని రచనలు చేసినా, ఎన్ని గౌరవాలు, సన్మానాలు, పురస్కారాలు, అవార్డులు అందుకున్నా నాకు ఆర్థికంగా తోడ్పడిన ఉదార చరిత్రులు చాల కొద్దిమందే. అట్టివారిలో అగ్రగణ్యుడు జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారు.

భోజరాజో, శ్రీకృష్ణదేవరాయలో అన్నట్టుగా పున్నయ్యగారు నా సాహిత్యానికి నిత్య రాజపోషకుడిగా ప్రసిద్ధి కెక్కిన వారు. ఈ రచనను ఆలకించి, ఆస్వాదించి, ఆనందించిన వారు. కాగా, ఈ కృతిని ఆయనకే అంకితం ఇస్తున్నాను.

చాల సంవత్సరాల క్రితం ''అంబేడ్కరిజం'' అనే నా గ్రంథాన్ని పున్నయ్యగారికి అంకితం యిచ్చి ఉన్నాను. నేటి భారత ప్రెసిడెంటు శంకరదయాళు శర్మగారు ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా ఉన్నప్పుడు, ఆయన ముఖ్య అతిథిగా రవీంద్రభారతిలో ఏర్పాటైన ఒక మహాసభలో ఆ గ్రంథాన్ని పున్నయ్యగారికి అంకితం ఇవ్వడం జరిగింది.

నేను ఎన్నో గ్రంథాలను ఎందరికో అంకితం యిచ్చాను గాని, రెండేసి గ్రంథాలను అంకితం ఇచ్చినవారు ఇద్దరే. ఆనాడు దామోదరం సంజీవయ్యగారికి ''మధుబాల'' కావ్యాన్ని, ''పైరుపాట'' సంగీత నృత్యరూపకాన్నీ ఇచ్చాను.

ఈనాడు జస్టిస్ పున్నయ్యగారికి రెండో అంకితంగా ఈ "నాకు తెలిసిన జాషువా" రచనను ఇస్తున్నాను. స్వీకరిస్తున్నందుకు ఆయనకు ఎన్నో కృతజ్ఞతాభివందనాలు చెల్లిస్తున్నాను.

జస్టిసు పున్నయ్యగారి గురించి క్లుప్తంగా అయినా చెప్పాలంటే కొన్ని వందల పేజీలైనా అవుతుంది. "అంబేద్కరిజం" గ్రంథం అంకితంలో ఆయన గురించి కొన్ని వివరాలు ఇచ్చాను. ఆయన జీవితంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని గురించిన, అస్పృశ్యతా నివారణ గురించిన పోరాట సన్నివేశాలూ, ఆసక్తికర సంఘటనలూ ఎన్నో ఉన్నై.

విద్యార్థిగా, కాంగ్రెసు యువజన నాయకుడిగా, యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా, అసెంబ్లీ మెంబరుగా, మంత్రివర్గపు అభ్యర్థిగా, జిల్లా జడ్జిగా, హైకోర్టు న్యాయమూర్తిగా పున్నయ్యగారి అనుభవాలు ఇన్నీ అన్నీ కావు. వాటిని గురించి ఆయన మిత్రగోష్ఠులలో చెబుతుంటే, ఎన్ని గంటలైనా అలా కూర్చుని వింటూనే ఉండాలనిపిస్తుంది.

ఆంధ్ర యూనివర్సిటీ ఈయనకు గౌరవ డాక్టరేటును ఇచ్చి తనను తను గౌరవించు కొంది.

ఆయనకు గల మిత్రకోటి గురించి, సన్నిహిత వర్గాల గురించి, చెప్పాలంటే అదొక ప్రత్యేక గ్రంథమే అవుతుంది. బహుశా ఈ విషయాలన్నిటినీ ఆయన తన "అనుభవాలు, జ్ఞాపకాలు" గ్రంథంగా వ్రాస్తున్నారనుకుంటా. అది బయటికి వస్తే తెలుగు సారస్వతానికి ఒక అమూల్య రత్నాభరణం లభించినట్లవుతుంది.

ఈ నా రచనను పున్నయ్యగారికి అంకిత మివ్వడంలో మరొక విశేషం ఉంది. జాషువా తన జీవితంలో పొందిన నిస్పృహల వంటివి కొన్ని పున్నయ్యగారి జీవితంలో కూడా కనిపిస్తాయి. అందులో–

బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పున్నయ్యగారిని మంత్రి వర్గంలోకి తీసుకోవలసి ఉంది. అది ఆలస్యం అవుతున్నప్పుడు, వెంటనే తీసుకోవాలంటూ గోవాడ నిరీక్షణరావుగారు ధర్నా చేశారు కూడ. అయితే, అప్పుడది మరొకరికి చిక్కింది. అప్పుడే పున్నయ్యగారు జిల్లా జడ్జి అయ్యారు.

ఆయన హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఏర్పడింది. సుప్రీంకోర్టు జడ్జీగా నియామకం కూడా జరిగి రద్దయింది. న్యాయం జరగలేదు. ఇలాంటివెన్నో ఉదంతాలు జాషువాతో పోల్చదగినవి వున్నై.

ఏది ఏమైనా ఒక వ్యక్తిగా పున్నయ్యగారు విశ్వమానవుడు, ఆదర్శ

పురుషుడు. కులవ్యవస్థా సమాజంలో ఆయన హరిజన కులంలో పుట్టడం హరిజనులకే కాదు, మొత్తం హైందవానికే, భారత జాతీయతకే గర్వకారణం.

పున్నయ్యగారు ప్రతిభా భారతికి జనకుడు. పౌరాణిక జనకుడి కంటే ఈ జనకుడు గొప్పవాడంటాను నేను. ఎందుకంటే, ప్రతిభా భారతి తెలుగు దేశపు వీరమహిళ. శ్రీకాకుళం జిల్లా నుంచి ఓటమిలేని శాసన సభ్యురాలు. కార్యదక్షత, దేశ సేవా దీక్షగల మంత్రి. అంతటి సుప్రసిద్ధ తనయకు జనకుడు పున్నయ్యగారు.

ఇంతవరకు నేను నా రచనలను ఎంతో మంది ఆత్మీయులకు అంకితాలిచ్చి వున్నాను.

ఇంతవరకూ ఇవ్వలేకపోయిన ఆత్మీయులు చాలామందే ఉన్నారు. అందులో కళా వెంకట్రావుగారు, నార్ల వెంకటేశ్వరరావుగారు, ఆలపాటి సూర్యనారాయణగారు, మంగళగిరి పరవస్తు దాసుగారు, నయునాల గణేశ్వరరావుగారు, మల్లు అనంతరాములుగారు, కొండవీటి వెంకట కవిగారు కొందరు.

ఇప్పటి నా శ్రేయోభిలాషులలో ఆచార్య నారాయణరెడ్డిగారు, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు, ఎమ్.ఎస్.రెడ్డిగారు, ఊట్ల కొండయ్యగారు, నెల్లూరి శ్రీరామమూర్తి గారు, పోతుకూచి సాంబశివరావుగారు, ఆచార్య సింహాద్రి, డా. అచ్యుత రామరాజు, కొత్తూరి లలితా సోమయాజులు దంపతులు, దరువూరి వీరయ్యగారు, వాసిరెడ్డి సీతాదేవిగారు, బిళ్ళ వేదయ్యగారు, ఆచార్య ఆపదరావుగారు, తిరుమల రామచంద్రగారు – ఇలా చాల మందే ఉన్నారు. ఇంకా కొందరు రాజకీయ, ఉన్నతాధికార ప్రముఖులు కూడా నా మానసాకాశంలో ప్రకాశిస్తూ ఉన్నారు.

ఈ అందరికీ చాలినన్ని అముద్రిత గ్రంథాలు నా బీరువాలలో ఉన్నై, వాటికి వెలుగు చూపి ఆత్మీయులకు అంకితాలివ్వాలనే నా ఆకాంక్ష ఎప్పటికి నెరవేరుతుందో మరి.

నేను ఇలా చెప్పడం కొంచెం విపరీతంగా కనిపించవచ్చు. అయితే, ఈ 85 వత్సరాల పరిపక్వ దశలో, ఇంతదూరం నేను పురోగమించడానికి చేదోడుగానో వాదోడుగానో తోడ్పడిన, ఇంకా తోడ్పడుతున్న ఆత్మీయులకు కనీసం కృతజ్ఞతలైనా చెప్పుకోడానికి నాకింత కంటె మరో మార్గం ఏముంది? సత్సంకల్పానికి శక్తి వుండడం నిజమైతే, అదెప్పటికైనా ఫలించక తప్పదు కదా?

ఈ గ్రంథానికి ముఖచిత్రం సమకూర్చిన ప్రసిద్ధ చిత్రశిల్పి ఏలే లక్ష్మణ్ గారికి, అడిగిన వెంటనే ముద్రించి యిచ్చిన పద్మావతీ ప్రెస్సు యజమాని శ్రీనివాసు గారికి హార్ధికాభినందనలు.

ప్రకృతి పురుష నిత్యరమణమ్ము ఈ సృష్టి,
రసమయమ్ము, రాగరంజితమ్ము!
సృష్టి లక్ష్య మెపుడు జీవితానందమే,
విశ్వభోగధామ వినుర భీమ!

ఇక్కడ మరొకసారి చెపుతున్నాను. అస్పృశ్యత, కుల వ్యవస్థ, ఆర్థిక దోపిడి, సాంఘిక అసమానత వంటివి సామాజిక సమస్యలు. మతానికీ, దేవుడికీ సంబంధించినట్టివి కావు. ఎటువంటి అన్యాయాలనైనా ప్రతిఘటించి, పోరాడి వాటిని పరిష్కరించుకోవాలే తప్ప, వాటి నుంచి పారిపోకూడదు. పారిపోతే వెంటపడి పీడిస్తూనే వుంటాయని.

జీవితంపట్ల నా వైఖరి వంటిదే జాషువాగారి వైఖరి కూడా. ఈ సందర్భంలో నా భీమన శతకం నుంచి ఒక మూడు పద్యాలిక్కడ ఇస్తున్నాను:

హైందవమున గర్హ్య మస్పృశ్యతయు, కుల
కావరమును; సాంఘికమ్ము లవ్వి,
మతము లందు రాజ మకుటమ్ము ఋగ్వేద
వీర మానుషమ్ము, వినుర భీమ!

శక్తి కలుగు వాడె శాసించు జగమును,
కలము హలములకును కత్తె రక్ష;
ప్రకృతి నైజ మొకటె ప్రత్యక్ష దైవము,
విశ్వ యోగ ధామ వినుర భీమ!

జన సమాజ మందు సర్పాలు తల లెత్త
తలలు పగుల గొట్ట దగును నరుడు,
మతము లేమి చేయు మగటిమి లేకున్న?
విశ్వ భోగధామ వినుర భీమ!

-బోయి భీమన్న

## జస్టిసు కొత్తపల్లి పున్నయ్యగారికి

ప్రియతమ మిత్రు, డాత్మబల
విఘ్నుడు, జస్టిసు కొత్తపల్లి పు
న్నయ; నయశీల ధార్మిక మ
నస్కు, డుదార పరోపకార ధీ
మయుడు; మదీయమైన కృతి
మాలను దీని ధరించి, వాగ్ధవుం
డయి వెలుగొందు గావుత శ
తాబ్దము లక్షర జాషువా మధు
ప్రియ ప్రియ శారదా హృదయ
హృద్య వసంత రసాంకిత ప్రభన్.

స్వాదు చిత్తుడు, స్వాతంత్ర్య సమర యోధు,
డు త్తమాదర్శ ఘనుడు, సమున్నతుండు,
భారతికి తండ్రి, ప్రతిభకు పరమశిల్పి,
భోజుడే నాకు సాహితీ పోషణమున!

యుగమున కొక్కరో, ఇరువు
రో జనియింతురు జాతి సంస్కృతీ
ప్రగతిని పెంచు శ్రీచరణ
పద్మజ మూర్తులు; అట్టి మూర్తులన్

అగణిత పుణ్యావారధి, ద
యానిధి జస్టిసు పున్నయార్యు; డి
జ్జగము నుతింప నొందు సుఖ
శాంతు, లితోధిక భాగ్య భోగ్యముల్.

నిరు పేదలు, నిరుపాయులు,
నిరాధారులైన దళిత నిర్ప్రాణుల కీ
శ్వర తేజ మొసగు హరిజన
గురుదేవుడ వీవు, అందుకో నా రచనన్!

ఎపుడో ఇచ్చితి అంబేడ్కరిజము, దాని
ప్రతులు లే విప్పు; ఇపుడు నా స్వగత జాషు
వా ప్రహేళిక నీ కిచ్చువాడ నయ్య!
అందుకొను మయ్య! పున్నయ్య! అమృతమయ్య!

–భీమన్న

# నాకు తెలిసిన జాషువా

"కావ్య శిల్పమున కన్న అభిప్రాయ ప్రకటనయే నా పరమావధి" అంటూ తన కవితా లక్ష్యాన్ని ప్రకటించాడు మహాకవి జాషువా.

జాషువా గారి ఈ కావ్య పరమావధి మన పూర్వ దార్శనికుల లక్షణ లక్షితానుగుణంగానే వుంది.

కాంతా సమ్మిత ఉపదేశమే కావ్య ప్రయోజనం. అట్టి ఉపదేశం సరస సుందర పద లాలిత్యంతో స్పష్టంగా వుంటుంది. హృదయాన్ని రంజించి, ఆలోచనా సరళిని ఆమోదయోగ్యంగా తీర్చి దిద్దుతుంది. అదే జాషువా గారి కావ్య రచనా పరమావధి. ఏది చెప్పినా రసోచిత రీతీ రమణీయంగా, స్పష్టమైన అభిప్రాయాన్ని సూటిగా చెపుతాడు జాషువా.

## 2

సమోహం సర్వ భూతేషు,
నమే ద్వేష్యోస్తి, న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా
మయితే తేషు చా వ్యహం !

అన్నాడు కృష్ణుడు భగవద్గీతలో. తాను సర్వేశ్వరుడి స్థానంలో నిలబడి చెప్పిన మాటలవి. కవి స్థానం కూడా అదే అంటాను నేను.

స్వచ్ఛమైన కవి ఎలా వుండాలి అంటే ఈ శ్లోకంలో చెప్పబడిన విధంగా వుండాలి. కవికి నిర్వచనం ఈ శ్లోకం.

కవి సర్వ మానవుల పట్లా, సర్వ భూతాల పట్లా సముడై వుండాలి. మిత్ర శత్రు పక్ష పాతాలకు అతీతుడై వుండాలి. ప్రకృతి పురుష చైతన్య సమన్వయమైన సర్వ సృష్టికి ఆత్మీయుడై వుండాలి. జీవ స్వభావ గుణ ప్రవర్తనల లోని వైవిధ్యాన్ని అవగాహన చేసుకొని, అట్టి వైవిధ్యంతో కలిసి మెలిసి సహ జీవనం చెయ్యాలి.

అట్టి వాడు కవి. అట్టి కవి జాషువా.

కష్ట సుఖాలంటాం. సుఖ దుఃఖా లంటాం. ఈ జంటల కోలాహలమే కదా జీవితమంటే ! సుఖం అనేది ఒక్కటే. కష్టం, దుఃఖం అనేవి దాని నీడలు. వాటి ప్రభావానికి మానవులే కాదు, సర్వ జీవరాశులూ స్పందిస్తై.

అయితే, లోక స్వభావం తెలిసిన కవీ, వేదాంతీ స్పందిస్తూనే ముందుకు సాగిపోతారు. ఇద్దరికీ తేడా ఏమిటంటే - వేదాంతి నిరాసక్త ప్రేక్షకుడైతే, కవి నిరంతర వైతాళికుడు. అట్టి వైతాళికుడు జాషువా.

## 3

నగ్న సత్యం వేదాంతం
అలంకృత సత్యం కవిత్వం

అనేది నా సిద్ధాంతం. ఈ సిద్ధాంతంలోని వేదాంతం నా కవిత్వానికి పునాది. నా కవిత్వం సుఖ శాంతి సంతోషాలతో కూడిన ఒక సమగ్ర సుందర జీవితానికి మార్గదర్శి.

నా సాహిత్యానికి పునాదిగా రసాద్వైత తత్వాన్ని కల్పించుకోవడంలోని నా అంతర్యం ఇదే. ప్రకృతి పురుష ప్రధానమైన సృష్టిలో ఎంత సౌందర్యమూ, శిల్పమూ, వైవిధ్యమూ వుంటుందో, అంతా నా సాహిత్యంలోనూ వుంటుంది. ఈనాటి సాహిత్య విమర్శకులలో చాలా మందికి నేను అర్థం కావడం లేదంటే అందుకు కారణం ఇదే.

ఈ కారణంగానే నాదొక ప్రత్యేక బాణీగా, నాదొక ప్రత్యేక స్కూలుగా స్థిరపడడం జరిగింది. నా జోలికి రాదలచిన ఎవరైనా గాని గుర్తుంచుకోవలసిన వాస్తవం ఇది.

నాకు జాషువా గారితో గల ప్రత్యక్ష పరిచయం గురించి నేనిక్కడ చెపుతున్నానంటే, దీన్ని నా వ్యక్తిత్వం ద్వారా సహృదయులు అవగాహన చేసుకోవలసి వుంది. నా గుణ స్వభావాల కోణాల నుంచి జాషువా గారిని అవలోకించవలసి వుంది.

జాషువా గారిని నేను ఎలా చూచానో అలాగే సహృదయులకు చూపుతున్నాను. తేడా ఏమీ వుండదు.

## 4

ఆధునిక తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధులైన కవులందరూ కూడా చాలావరకు జాషువాకు సమకాలీనులే.

సాహిత్యాకాశంలో జాషువా మధ్యందిన సూర్యుడిలా ప్రకాశిస్తున్నప్పుడు, భావ కవితా వల్లికలు సంపూర్ణ వసంతాన్ని అనుభవిస్తూ వున్నై. ప్రబంధ సాహితీ వాసనలు ఎప్పుడూ వుండేవే. అభ్యుదయ కవితా స్వేదంతో తడిసిన యువతరం చేస్తున్న నినాదాలలో వసంత శుక పిక సంగీతాలు, మధ్యాహ్నపు పైరగాలుల విలాసాలు సమస్తమూ మునిగి తేలుతూ వున్న కాలమది.

ఎండగానీ, వెన్నెల గానీ, వసంతంగానీ, హేమంతం గానీ - దేనికీ లెక్క చేయకుండా తాను చెప్పదలచింది తనదైన రీతిలో గొంతెత్తి చెప్పినవాడు మహాకవి జాషువా ఒక్కడే. ఈ విషయంలో జాషువా స్థిత ప్రజ్ఞుడు.

**ఒక్కడె చాలు నిశ్చల బలోన్నతు,**
**డెంతటి కార్యమైన దా జక్క నొనర్ప**

జాషువా వంటి కొందరు కొందరు మహా పురుషులు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా ఈ పూర్వ పద్యం జ్ఞాపకం వస్తుంది నాకు.

ఆ కాలంలో ఎంతటి కవులైనా, పాత పద్ధతిలో వ్రాసేవాళ్లు, భావ కవిత్వం చెప్పేవాళ్ళు, మార్క్సిస్టు భావాలను ప్రచారం చేసేవాళ్ళు - మూడు విధాలుగా వుండేవాళ్ళు. ఈ మూడు తరహాల వాళ్ళూ కూడా గతానుగతికంగా పోతున్న వాళ్లే. కవికి వుండవలసిన సృజనాత్మక శక్తి వాళ్ళలో ఏ ఒక్కడికీ వున్నట్టు లేదు. ఆనాడు కవిగా చెప్పుకోదగిన వ్యక్తి ఎవరైనా వున్నారంటే ఆయన ఒక్క జాషువాయే.

తాను పుట్టిన పరిసరాలూ, తన చుట్టూ వుండే ప్రజల అవసరాలూ గుర్తించిన వాడు, మానవ జీవితం ఎలా వుండాలో ఊహించిన వాడు, దాని కనుగుణంగా ప్రజల బాగోగులను మలచాలను కొన్నవాడు, హెచ్చరించిన వాడు, ప్రబోధించిన వాడు, పర్యవసానంగా తనను చుట్టు ముట్టిన వైర శక్తులను ప్రతిఘటించి విజయుడై, విశ్వ నరుడై నిలిచిన వాడు ఒక్క జాషువాయే. నాకు తెలిసిన జాషువా ఆయనే.

## 5

దేశ కాల పరిస్థితులకు సంబంధించి కూడా అదొక పాత కొత్తల యుగ సంధి.

పాత కుల వ్యవస్థ సడలిపోతూ వుంది. కొత్త సమ సమాజానికి పునాదులు పడుతూ వున్నై. చావగొడుతున్నా, అంటరానితనం ఇంకా చూరుపట్టుకొని వ్రేలాడుతూనే వుంది. స్వతంత్ర భారత్‌లో న్యాయమైన తమ హక్కుల కోసం తుది పోరాటం జరపడానికి షెడ్యూల్డు కులాల ప్రజలు సంఘటితులవుతున్నారు.

కులాల వారీగా చూసుకుంటే, అస్పృశ్యులు అనబడుతున్న వారే మెజారిటీ కులం. వీళ్లు అది నుంచీ హిందువులే. అస్పృశ్యత, వెలి, పేదరికం, కట్టు బానిసత్వం, అవమాన దైన్యం మొదలైన ఎన్ని అమానుష హింసలకు గురి చెయ్యబడుతున్నా లెక్క చెయ్యకుండా ఈ నిర్భాగ్యులు హిందువులుగానే వుంటున్న వాళ్లు.

అయితే, ఈ అస్పృశ్యుల లోని కొందరు గడుసు వాళ్లు దేశంలోకి ఏ మతం చొచ్చుకు వస్తే ఆ మతంలోకి పారిపోతూ వుండడం కూడా వుంది. ముస్లిం పరిపాలనా కాలంలో ముస్లింలైనవాళ్లు, క్రైస్తవ పరిపాలనా కాలంలో క్రైస్తవులైన వాళ్లు ఎక్కువగా వాళ్లే. హిందూ మత వ్యవస్థలోని బాధల నుంచి విముక్తి పొందడం కోసమే వాళ్లు అలా మతాంతరులయ్యారు.

జాషువా కాలం నాటి పరిస్థితి ఏమిటంటే - గతంలో హిందువులపై ముస్లింలు చేసిన దౌర్జన్యాలకు స్పష్టమైన చిహ్నాలు ఇంకా మిగిలే వున్నై. ఇక, క్రైస్తవ మత విషయానికి వస్తే, క్రైస్తవ మతంలోచేరిన అస్పృశ్యులు హిందూమతం లోని అస్పృశ్యుల కంటే భిన్నంగా జీవించడం లేదు.

అస్పృశ్యులలో ఎన్ని శాఖలూ, ఉప శాఖలూ వున్నప్పటికీ, తెలుగు పరిభాషలో 'మాల మాదిగలు' ముఖ్యులు. మాలలు, మాదిగలు రెండు బలమైన ఉపశాఖలు. వృత్తి రీత్యా వీళ్ళను నూలువాళ్లూ, తోలు వాళ్ళూ అనడం వుంది. ఈ రెండు వర్గాల మధ్య జ్ఞాతివైరమూ వుంది, వృత్తివైరమూ వుంది. కొంచెం అస్పృశ్యత కూడా వుంది. ఈ మాల మాదిగలు క్రైస్తవ మతంలో చేరినా, పరిస్థితిలో మార్పు రాలేదు.

ఒక ప్రక్క క్రైస్తవపాలకులూ, కాంగ్రెస్ వాళ్ళూ, ఉదారులైన ఇతర కులాల మేధావులూ, రచయితలూ, జమీందారులూ అస్పృశ్యతా నిర్మూలనకూ, సంస్కృతీ పునరుజ్జీవనకూ కృషి చేస్తూ వుండగా, మరొక ప్రక్క మార్క్సిస్టు భావాలు దేశంలో ప్రచారమై, సర్వజన సమతా సమాజ నిర్మాణం కోసం అన్ని కులాల యువకులూ కలిసిన కమ్యూనిస్టు పార్టీ ఉద్యమిస్తూ ఉంది.

జాషువా తల్లిగారి కులం అందరికీ తెలిసిందే. జాషువా అక్కడే పుట్టి పెరగడం వల్ల ఆయన తమవాడే అని మాదిగలు (తోలువారు) భావించారు. ఆయన తండ్రిగారి కులం ఏది? తమ కులమే అయి వుండవచ్చునని మాలలు (నూలువారు) భావించారు. జాషువా పుట్టేనాటికి ఆయన తండ్రిగారు క్రైస్తవ మతంలో చేరివుండడం జరిగింది. అక్కడ కూడా ఈ మాల మాదిగ కుల గొడవలు కొనసాగుతూనే వున్నై.

జాషువాగారి జీవితాన్నీ, సాహిత్యాన్నీ, ఆయన పడ్డ బాధలనూ, పొందిన అవమానాలనూ, అనుభవించిన మనోవేదనలనూ అర్థం చేసుకోవాలంటే అప్పటి ఈ యధాస్థితిని గుర్తుంచుకోవలసి వుంది.

## 6

అప్పటికి ప్రచారంలోవున్న మూడు సాహిత్య శాఖలకు ముగ్గురు కవులు ప్రాతినిధ్యం వహించి వున్నారు. పురాణ సాహిత్యానికి విశ్వనాధ సత్యనారాయణ, భావ కవిత్వానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి. అభ్యుదయ సాహిత్యానికి శ్రీరంగం శ్రీనివాసరావు. ఈ మూడు శాఖలను తనలో ఇముడ్చుకొని ఏకైక మహా సాహిత్య మూర్తిగా ఎదిగిన వాడు, సర్వ జనామోదాన్ని పొందిన వాడు ఒక్క జాషువాయే అనవచ్చు.

పురాతన వర్గానికి చెందిన వాడుగా విశ్వనాథను, కార్మిక వర్గానికి చెందిన వాడుగా శ్రీశ్రీని, భగ్న ప్రేమిక భా ష్ప విలాప వర్గంగా భావ కవిత్వాన్ని నిరాకరించి పక్కకు పెట్టేస్తే ఈ సమస్త సాహిత్యానికీ ఒక్క జాషువాయే ప్రాతినిధ్యం వహించి, నిష్కల నిర్మత నిర్వర్గ విశ్వమానవ శ్రేయస్సును సాహితీకరించి, తన యుగానికి ఏకైక సాహితీలోక బాంధవుడై ప్రకాశించాడాయన.

తెలుగు సాహితీ క్షేత్రంలో అన్ని బాలారిష్టాలనూ అధిగమించి, బాగా ఎదగి, సాహితీ చక్రవర్తిత్వం కోసం పోటాపోటీగా, ఎదురుబొదురుగా నిలబడ్డ మహాకవులు ఇద్దరు : విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా.

ఇందులో సాంప్రదాయక శక్తీ, అగ్రకులాతిశయ రాజసమూ, విశ్వ విద్యాలయ శిష్య కోట్ల బలమూ కలవాడు విశ్వనాథ. ఇవేమీ లేకుండా, పైగా సాంప్రదాయకమైన ప్రతికూలత లన్నీ పీడిస్తూ వుండికూడా కేవల ప్రజాభిమాన ధర్మ శారద మాత్రమే చేదోడు వాదోడుగా మీసం దువ్వినవాడు జాషువా.

విశ్వనాథకు మీసాలు వుండేవి కావు. జాషువా చాలా అందమైన మీసాలు కలవాడు. ఆయన చిరునవ్వు నవ్వినప్పుడు నల్లని చిరు మబ్బుల వెనక నుంచి తొంగిచూచే పండు వెన్నెలలా అలరించేదది. మీసాలు లేని చిరునవ్వుకు నిజంగా అంత అందం రాదు.

"జాషువా కవి, నేను శిల్పిని" అనేవాడు విశ్వనాథ, సాహిత్య సభలలో మాట్లాడుతున్నపుడు.

ఆ మాట సత్యమే. ఎందుకంటే, కవిత్వం అందరికీ ఆనందాన్ని ఇచ్చే అమృతం. శిల్పం కొద్ది మంది పండితులకు మాత్రమే అర్థమయ్యే కళ.

*నగ్న యైనను, కన్య ఆనంద మొసగు*
*ప్రతిమ కే భూషలున్న స్వారస్య మేమి?*

అన్నా నందుకే నేను ఏదో సందర్భంలో.

విశ్వనాథ అభిప్రాయం కూడా నిజమే అనడానికి వీలు లేదు. విశ్వనాథ సాహిత్యం శిల్ప ప్రధానమే అయినా, నారికేళ పాకంలో నడిచినా, చాలా భాగం రుచిగా, రసవంతంగా వుండేదే. నారికేళం వెంటనే కొరుక్కు తినడానికి పనికి

రాకపోవచ్చు. కొంచెం కష్టపడితే అది చాలా ఫల పాకాల కంటే కూడా తుష్టిని, పుష్టిని కలిగించ గలదు కదా!

మరొక విశేష మేమిటంటే – జాషువా కవిత్వం రస ప్రధానమే అయినా శిల్పంలో ఆయన విశ్వనాథ కంటే తక్కువ వాడేం కాదు. జాషువా తన కవితా ద్రాక్షపాకాన్ని ముగ్ధ సుందర శిల్ప చషకాలలో జన సామాన్యానికి అందించిన వాడు. అందుకే ఆయన ప్రజలకు అర్థమయ్యాడు.

అప్పటికి ఆంధ్ర ప్రభుత్వ ఆస్థాన కవిగా వున్న కాశీ కృష్ణాచార్యుల మృతి తర్వాత, ఆ పదవి ఖాళీ అయినప్పుడు, అందుకు అర్హులైనవారు ఇద్దరే వున్నారు – జాషువా, విశ్వనాథ. ఆ ఇద్దరిలో అన్ని విధాలా అర్హుడిగా భావించబడినవాడు జాషువా.

జాషువా ప్రజాకవి. ప్రజాస్వామిక ప్రభుత్వంలో ఒక ప్రజా కవే ఆస్థాన కవి కావల్సినవాడు. పైగా, అంతవరకూ ఆస్థాన కవులైన వాళ్ళంతా బ్రాహ్మణ పండితులే. అందువల్ల ఈసారైనా అన్ని విధాలా అర్హుడైవున్న జాషువానే ఆ పదవి వర్తిస్తుందని అనుకొన్నారందరూ.

కానీ, అలా జరగలేదు. జాషువా ఉపేక్షించబడ్డాడు. ఆశాభంగం చెందాడు. అది ఆయన ఆరోగ్యాన్ని దెబ్బ తీసింది.

తాను విశ్వ మానవుణ్ణని ప్రకటించి, సర్వ మానవ శ్రేయస్సును కోరి కవిత్వం వ్రాస్తూ, సంఘ మిత్రుడిగా భాసిస్తున్న జాషువా అంతటి వాడికి కూడా న్యాయం జరగలేదు. న్యాయం చేయగల పైవాడెవడూ ఆయనకు లేకపోయాడనుకొందాం! కనీసం, జరిగిన అన్యాయాన్ని నిరసించగల, ఎదిరించగల అనుచరులు, అభిమానులు కూడా ముందుకు రాలేకపోయారంటే ఏమనాలి? ఏమనుకోవాలి?

అయితే, జాషువా అభిమాన వర్గం వాళ్ళ అజ్ఞానాన్నీ, అసమర్థతనూ, అసహాయతనూ, అకర్మణ్యత్వాన్నీ స్వప్రయోజనానికి వినియోగించుకోగల ధైర్యం అప్పట్లో విశ్వనాథ వర్గం వాళ్ళకు కూడా లేకపోయింది. బహుశా గతం మీద ఈ పరిస్థితి కొంత మెరుగే అనవచ్చు.

ఈ రెండు వర్గాలనూ అలా వదిలేస్తే, ఆ మధ్యలో గోతి దగ్గర నక్క వైఖరిని అవలంబించింది ప్రభుత్వం. ఆ ఇద్దరిలో ముందుగా ఎవరు చస్తారా అని ఎదురు చూస్తూ కూర్చుని, జాషువా పోయిన తర్వాత ఆ పదవిని విశ్వనాథకు ఇచ్చింది.

## 7

జాషువా 1895 సెప్టెంబరు 28న పుట్టి, 1971 జూలై 24వ తేదీన కీర్తిశేషుడయ్యాడు. నా కంటే 16 సంవత్సరాల పెద్దవాడు ఆయన.

నేను 1931లో, కాకినాడ పిఠాపురం రాజావారి కాలేజీలో చేరినప్పటినుంచీ భారతిలోను, ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలలోను జాషువాగారి పేరు తరచు చూస్తూ వుండేవాడిని. నాకు ఆయన మొదటి పరిచయం ఆయన పేరుతోనే. ముచ్చటైన మూడు అక్షరాల పేరది. పేరును బట్టే ఆయనెవరో మా వాడే అనుకొన్నాను. భారతీయ క్రైస్తవులంతా మాల మాదిగలే అనుకొంటున్నానప్పటికి.

కాకినాడ కాలేజీ వాతావరణం నిండా బ్రహ్మ సమాజ మత ఘుమఘుమలు గుబాళిస్తున్న రోజులవి. ప్రతి ఆదివారమూ కాలేజీ ఎదురుగా వుండే బ్రహ్మ మందిరంలో ప్రార్థనలూ, ధార్మిక ఉపన్యాసాలూ జరుగుతూ వుండేవి. ఆ సమావేశాలకు తప్పనిసరిగా వెళ్ళవలసిన వాళ్ళం రాజావారి విద్యా సంస్థలలోని పంచమ కులాల వాళ్ళం.

ఆ విధంగా నేను లోకంలోని వివిధ మతాలను గురించి తెలుసుకోవడం, మత గ్రంథాలను చదవడం సాధ్యమైంది. జాషువా అనే పేరు బైబిలులో ఒక మహా వీరుని పేరు. అందమైన పేరుతోపాటు రసవంతమైన పద్యాలు వ్రాసే మహా కవిగా జాషువా నాకు ఆత్మీయుడైనాడు.

బహుశా ఆ కాలంలోనే ఫిరదౌసి కావ్యం నా చేతికి వచ్చిందనుకొంటాను. అందులోని ఒకొక్క పద్యం ఒకొక్క మధు పాత్రగా కనిపించడంతో, కావ్యంలోని చాలా పద్యాలు తమంతట తామే నా నోటికి వచ్చేసినై.

విత్తనంబున మహా వృక్షంబు నిమిడించి
　　　సృష్టించి గారడీ సేయువాడు
కడుపులో శిశువును గల్పించి పది నెలల్
　　　మోయించి యూపిరి వోయువాడు

సద్భక్త వరులకు సాక్షాత్కరించియు
ఉన్న చో టెరిగింప కున్నవాడు
పాట మరింపక ముంచె పుష్ప సంతతులకు
వింతగా రంగులు వేయువాడు.
చెలువ మొప్ప పుడమి సృష్టించి మాకిచ్చి
అనుభవింపు డనుచు నానతిచ్చి
నిలువ నీడ లేక నిల్చిన కలవాడు
**కడుపు నిండ నన్ను గన్నవాడు !**

జాషువా పద్యాలు నా నోటి కెన్నెన్ని వచ్చినా, ఈ పద్యంలో ఒక విశేష ముంది. పోతనగారి భాగవతం పద్యాలతోనూ, శ్రీనాథుడి చాటువులతోనూ నా కప్పటికే బాగా పరిచయం వుండడం వల్ల, ఆధునికులలో అంత అందమైన పద్యాలు వ్రాయగలవారు లేరు అనుకుంటూ వుండేవాణ్ణి. జాషువా పద్యాలతో పరిచయం ఏర్పడిన తర్వాత నా అభిప్రాయం మారింది. ఫిరదౌసిలోని ఈ సీసపద్యం నాకు చాలా ఆత్మీయమైంది. ఆ తరువాత జంధ్యాల పాపయ్యశాస్త్రి గారి కొన్ని పద్యాలు నన్ను ఆకర్షించాయి గాని, వాటిలో జాషువా శైలే కనిపిస్తూ వుండేది.

నాకు జాషువా గారితో వ్యక్తిగత పరిచయం ఎప్పుడు ఎలా కలిగిందో జ్ఞాపకం లేదు. బహుశా రాజమండ్రిలో కుసుమ ధర్మన్నగారి ఇంటిలో నేను మొదటిసారి జాషువాను చూచి వుండవచ్చు ననుకొంటాను.

నేను కాకినాడ కాలేజీలో చదువుకొన్న నాలుగు సంవత్సరాల లోనూ తరచు రాజమండ్రి వెళ్ళి ధర్మన్నగారితో గడపడం జరుగుతూ వుండేది. అక్కడకు జాషువాగారు కూడా గుంటూరు నుంచి వస్తూ వుండేవారు. నాకు జ్ఞాపకశక్తి తక్కువైనా మా తొలి పరిచయం అక్కడ అలా జరిగిందనుకోవచ్చు. విశాఖకు చెందిన హరిజన నాయకుడు చెన్నా ధర్మారావుగారి పరిచయం కూడా నాకు అక్కడ జరిగిందే.

## 8

నగరం, మామిడికుదురు అనేవి జంట గ్రామాలు. రెండూ ఒకటే గ్రామంగా కలిసిపోయి వుంటై. మాది మామిడికుదురు.

నేను నగరం మిడిల్ స్కూలులో 1926లో ఫస్టు ఫారం (ఆరవ క్లాసు) చదువుతూ, ఛందస్సు తెలియని పద్య రచనతో తంటాలు పడుతున్నప్పుడు, రాజోలు హైస్కూలులో ఫోర్త్ ఫారం చదువుతున్న ఉంద్రు సుబ్బారావు అనే కుర్రవాడు గొప్ప కవిత్వం వ్రాస్తున్నాడనే వార్త తెలిసింది. ఆ తరువాత "గురుపూజ" అనే పేరుతో ఆయన వ్రాసి ప్రకటించిన గీత పద్యాల చిన్న వేదాంత కావ్యం ఒక ప్రతి నా చేతి కందింది.

నేను రాజోలు హైస్కూలులో ఫోర్త్ ఫారంలో చేరే నాటికి వున్న పరిస్థితి ఏమిటంటే – గురుపూజ నిండా తప్పులున్నాయని బయ్యా సూర్య నారాయణ మూర్తి విమర్శించడం, ఆ విమర్శాగ్నిలో పడి గ్రంథ కర్త సుబ్బారావు భగభగ మండిపోతూ వుండడం ! సూర్య నారాయణ మూర్తి వేదాంతాన్ని కూడా అవహేళన చేస్తూ మాట్లాడాడట.

ఛందస్సు తెలియకుండా వందల కొలదీ పద్యాలు అప్పటికే వ్రాసి వున్న నేను, వేదాంతంలో పుట్టి పెరుగుతున్న నేను ఆ మండుతున్న వాతావరణంలో సులువుగానే చిక్కుకున్నాను. సుబ్బారావుతో కలిసి, సంస్కృత సమాస భూయిష్ఠమైన వాక్యాలతో ఏతత్ విమర్శకుడ్ని తీవ్రంగా విమర్శిస్తూ ఒక లేఖ వ్రాశాను. ఆ లేఖ నిండా కూడా తప్పులున్నా యంటూ అట్టహాసం చేశాడట ఆ మూర్తి మహాశయుడు. ఆ మహాశయుడు అప్పటికే రాజమండ్రిలో బి.ఏ. కాబోలు చదువుతున్నాడు.

ఇంతకూ, ఈ సాహిత్య విమర్శా రణరంగంలో కాలు దువ్వి నిలబడ్డ వాళ్ళం ముగ్గురమూ విద్యార్థులమే, ఒక ప్రాంతం వాళ్ళమే, బంధువులమే. మూర్తిగారిది నగరమైతే, సుబ్బారావుది సమీపంలోని పొన్నమండ గ్రామం.

"ప్రతివాద భయంకర, బాలకవి బయ్యా సూర్యనారాయణ మూర్తి, బీ.ఏ," అని చెప్పుకొంటూ, చుట్టుపక్కల వాళ్ళను అదరగొడుతున్న ఆ మహాశయుడే తరువాతి కాలంలో కాంగ్రెస్ నాయకుడిగా, అసెంబ్లీ పార్లమెంటుల సభ్యుడిగా, కేంద్రమంత్రిగా, "ఆరుకోట్ల తిరుగుబాటు" అనే పద్య కావ్యం, "ఆంధ్ర కుమార శతకం" వంటి రచనలు చేసిన సాహితీ వేత్తగా ప్రసిద్ధుడైన బి.ఎస్. మూర్తి.

టంగుటూరి ప్రకాశం ఆంధ్రకేసరి అయితే, బి.ఎస్.మూర్తి ఆది ఆంధ్రకేసరి.

అందర్నీ 'ఒరే' అని పిలిచి మాట్లాడే కళా వెంకట్రావు గారితో, "ఒరే వెంకట్రావ్" అంటూ పిలిచి మాట్లాడే సాహసీ, సంస్కారీ బి.ఎస్.మూర్తి ఒక్కడే ఆ కాలంలో జాతీయోద్యమ సందర్భంలో ఎన్నో సార్లు శ్రీకృష్ణ జన్మస్థానం (జైలు)లో తపస్సు చేసుకొని వచ్చిన కాంగ్రెస్ అగ్ర నాయకులలో ఆది ఆంధ్ర వర్గానికి చెందిన బహు కొద్ది మందిలో బి.ఎస్ మూర్తి అగ్రగణ్యుడు.

బి.ఎస్. మూర్తి, కుసుమ ధర్మన్న, ఉంద్రు సుబ్బారావు, నేరేడు మల్లి జగన్నాథం, నేను వంటి వాళ్ళం భాషా పద్య కవితా విషయ వ్యాపకాలలో మునిగి తేలుతూ వుండడం వల్ల, సాంఘిక రంగంలోని అస్పృశ్యతా, దారిద్ర్యతా పిశాచాల బాధలను అంతగా పట్టించుకోలేదని నా ఉద్దేశం.

విద్యా సాంస్కృతిక రంగాలలో తగు వైదుష్యాన్ని సంపాదించుకోగలిగితే, అంటరానితనం వంటి చీడలు, పీడలు వాటంతటవే అంతరించి పోగలవని నా చిన్నప్పటి అనుభవాలు సూచించా యనుకోవచ్చు.

తూర్పు గోదావరి జిల్లాలోని మా అనుభవాలే గుంటూరు జిల్లాలోని బీర్నీడి మోషే, గద్దల జోసెఫ్, గుర్రం జాషువా వంటి సాహితీవేత్తల అనుభవాలు కూడా. భాషా సంబంధంగా సవర్ణ పండితుల నోళ్ళు మూయించడం కోసం ప్రతిభా పాండిత్యాలు అపారంగా గల జాషువా గారు నిరంతర అభ్యాసానికి తోడు, విద్వాన్ డిగ్రీని కూడా సంపాదించి పెట్టుకొన్న మనీషి.

## 9

భారత్‌లో, హైందవ సమాజంలో కులగజ్జి, నిమ్నత్వ జాడ్యం, అస్పృశ్యతా దౌర్జన్యం వంటివి ఇంకా కొనసాగడానికి కారణం వాటిని ఎదిరించే వాళ్ళు, కనీసం ప్రశ్నించే వాళ్ళు ఈ పీడిత కులాలలో లేకపోవడం.

ఎందుకు లేరు అంటే, స్వచ్ఛమైన ఆర్ష సామాజిక వ్యవస్థలోకి కులతత్వ కాలుష్యం ఎంత అన్యాయంగా, అధర్మ దుష్టంగా ప్రవేశించిందో వివరించవలసి

వుంటుంది. ఆ పని నేను నా సాహిత్యం పొడుగునా చేస్తూనే వస్తున్నాను.

హైందవేతరులు, విజాతీయులు, విదేశీయులు అయిన ఆంగ్లేయులు ఈ దేశ రాజరికాన్ని చేపట్టే వరకు ఈ దీన మానవుల బ్రతుకు చీకట్లలోకి కాంతి కిరణాలు చొరబడలేదు. అట్టి కిరణాల ప్రసరణతో జిగేలు మంటూ వెలుగులోకి వచ్చిన ఒక అమూల్య రత్నం జాషువా.

అలాంటి రత్నాలే ఆ తరంలో అవతరించిన వివిధ వర్గాల ప్రతిభావంతులందరూ. సంస్కర్తలూ, రచయితలూ, ప్రవక్తలూ, స్వాతంత్ర్య సమరయోధులూ, సాంఘిక విప్లవకారులూ – హిందూదేశ ముఖచిత్రాన్నే దుమ్ముదులిపి, ప్రాణ ప్రతిష్ఠ చేసి, ప్రజ్ఞా ప్రభావితం చేసిన మహనీయులందరూ కూడా. ఈ విధంగా చైతన్యవంతమై, అప్పుడు అభ్యుదయ పథంలో ప్రారంభమైట్టిదే ఈనాటి తిరుగులేని ఈ దళిత జనోత్తుంగ విజయోత్సవ సమారోహం.

సహజ సుందరమైన, సుందర భావ మనోజ్ఞమైన, మనోజ్ఞతా రసదిగ్ధమైన జాషువా కవిత్వంలోకి ఆలోచనామృతం ప్రవహించిన కారణం ఈ వాస్తవ జీవిత వాతావరణమే. తన చుట్టూ వున్న తన వాళ్ళైన ప్రజల దౌర్భాగ్యాన్ని చూస్తూ సహించలేక దుఃఖిస్తూ, తన కవితా రస వర్ష ధారలతో సమస్త కాలుష్యాన్నీ కడిగివేయడానికి ఆయన ఉద్యమించిన హేతువు కూడా ఇదే.

## 10

నాకు సంగీత మంటే ఇష్టం. చాలా రాగాలు వచ్చు. అన్నీ పద్య నాటకాలు చూచి, మిత్రుల్ని అడిగి నేర్చుకొన్నవే. అయితే, పాడడానికి తగిన కృషి కంఠానికి లేదు. హార్మోనియం మీద సాధన చేయమని ఆత్మీయులు చెప్పారు. నేను వినిపించుకోలేదు. అయితే, కవి సమ్మేళనలలోనూ, ఆకాశ వాణిలోనూ పద్యాలు చదివేటప్పుడు రాగ సరళిలో చదవాలనే తపన మాత్రం నన్ను వెంటాడుతూనే వుంది.

నాటకాలలో పద్యాలు పాడేవాళ్ళను అలా వదిలేస్తే, కవులలో పద్యాలను అందంగా చదివే వాళ్ళు కొంతమంది వున్నారు. ఆ కాలంలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, అడవి బాపిరాజుగారు శ్రావ్యంగా పాడేవారే అనవచ్చు. జాషువాగారు పద్యాలు

పాడడంలోనూ, ధర్మన్నగారు పాటలు పాడడంలోనూ నన్ను బాగా ఆకర్షించేవారు. అయితే, ఆ ఇద్దరి బాణీలూ నాకు పట్టుబడలేదు.

నా పాటలలోనూ, పద్యాలోనూ సంగీతం సహజంగానే వుంటుంది. నిజానికి నాద బిందు లయల నుంచే నాపాటలూ, పద్యాలూ, వచన కవితలూ కూడా ఉద్భవిస్తూ వుంటాయనుకుంటాను. అయితే, వాటిని నాకు నేనుగా గొంతెత్తి పాడుకోలేను.

జాషువా గారెక్కడుంటే అక్కడ కవితా గానాలతో, సాహిత్య చర్చలతో, చతుర సంభాషణలతో కలకలలాడుతూ అదొక సరస్వతీ విలాసంలా వుండేది. అలాంటి సందర్భాలెన్నో నేను ధర్మన్న గారింట్లో చూశాను. సాధారణంగా అక్కడ చేరే వాళ్ళంతా మాల మాదిగ జనమే. కొద్దిమంది ఇతర కులాలకు చెందిన అభిమానులుంటే వుండేవారు.

రాజమండ్రిలో ధర్మన్న గారుండే లక్ష్మీవారపుపేట పూర్తిగా మాలపేట. మెయిన్ రోడ్డుకు అనుకొని పట్టణం మధ్యలో వున్నప్పటికీ, అదొక ఇరుకు మురికి స్లమ్ గానే వుండేది.

ధర్మన్నగారికి వైద్యం ఒక హాబీ. ఆయన ఆయుర్వేద వైద్యుడు. ముఖం చూచి రోగం గుర్తించేవాడు. నాడి చూచి మందులిచ్చేవాడు. స్వయంగా కొన్ని పేటెంటు మందులు తయారుచేసి అమ్మేవాడు. మంచి వక్త. హరిజన నాయకుడు, ఆజానుబాహుడు, స్ఫురద్రూపి, స్నేహశీలి, దయాళువు, కులమత భేదాలు లేని అపద్బాంధవుడు. హిందూ సామాజిక దురాచారాలను సహేతుకంగా ఖండించేవాడు తప్ప ఆగౌరవపరచేవాడు కాదు.

ఇన్ని కారణాలుగా ఆయన ఒక్క హరిజనుల అభిమానానికే కాక, సవర్ణ పండితుల, కాంగ్రెసు నాయకుల గౌరవ మర్యాదలకు పాత్రుడై వుండే వాడు. ఆయన ఇల్లెప్పుడూ జనంతో కిటకిటలాడుతూ వుండేది. నేను విద్యార్థిగా వున్నప్పుడే ఎంతోమంది వివిధ వర్గాలకు చెందిన పెద్దల పరిచయం నాకు ధర్మన్న గారింట్లోనే కలిగింది. ఖురానును తెలుగు చేసిన ఖాసిం ఖాను గారి పరిచయం కూడా నా కక్కడ కలిగిందే.

ఒకసారి ధర్మన్న గారింట్లో జాషువా గారు తమ పద్యాలను శ్రావ్యంగా

చదివి వినిపిస్తున్న సందర్భంలో నేను జాషువా గారిని అడిగాను, "మీరు ఈ పద్యాలను పాడుతున్న రాగం ఏదో చెబుతారా?" అని.

ఆయన మాట్లాడకుండా నా వంక చూశారు. అప్పుడు నేనే అన్నాను, "అది నాదనామక్రియ అనుకొంటున్నాను" అని.

"నాకు సంగీతం రాదు" అన్నారు జాషువా గారు. "ఏదో ఒక బాణీలో పద్యాన్ని పలకడం అలవాటయ్యింది. అది బాగుంటే మంచిదే" అన్నారు.

అప్పటికే నాకు ఆయన పద్యాలు చాలా నోటికి వచ్చు. అయితే సభా కంపం ఎక్కువగా వున్న వాడ్ని కావడం వల్ల ఆయన పద్యాలే కాదు, నా సొంత పద్యాలు కూడా నలుగురి ముందు పాడడానికి జంకే వాడ్ని. బహుశా అందుకేనేమో పద్యాన్ని కూడా ఒక లయలో వచనంలా చదవడం అలవాటయింది.

తనకు సంగీతం రాదని జాషువా గారన్నా, నేను మాత్రం నమ్మలేదు. ఆయనకు రాని విద్య ఏదీ లేదనేది నా స్వానుభవంలోని వాస్తవం.

## 11

జాషువా గురించి నాకు ప్రత్యక్షంగా తెలిసిన, తెలుసు ననుకొంటున్న అంశాలను గురించి మాత్రమే నేనిక్కడ పేర్కొంటున్నాను.

సుమారు ఒక నలభై సంవత్సరాల పాటి పరిచయం సుదీర్ఘమైనట్టిదే. ఆయన కీర్తిశేషులైన ఒక పాతిక సంవత్సరాల అనంతరం ఇలాంటి రచన ఒకటి చేస్తానని నేనెప్పుడూ అనుకొని వుండలేదు.

నాకు డైరీలు వ్రాసే అలవాటు కూడా లేదు. సంవత్సరాలూ, సన్నివేశాలూ, సంఘటనలూ సమస్తమూ జ్ఞాపకం తెచ్చుకొని చెప్పవలసి వస్తున్నది. అందువల్ల ఇప్పటి ఈ నా 'స్మృతి' రచనలో పూర్వ ఋషుల స్మృతులలోవలెనే పొరపాట్లు దొర్లవచ్చు, గుర్తించగలరు.

ఆ కాలంలోని ఎంతోమంది కవులతో నాకు పరిచయం వుంది. స్నేహం వుంది. ఆత్మీయత కూడా వుంది. అయితే ఇప్పుడు ఒక్క జాషువా గురించి మాత్రమే

మే మిద్దరమూ అంటరాని వాళ్లనబడే వర్గానికి చెందినవాళ్ళం. తరతరాల కట్టు బానిసత్వం నుంచి తప్పించుకోవడానికి నిరంతరంగా పోరాడుతున్న సారస్వతులం.

సహజ ప్రతిభతో, స్థిర ప్రజ్ఞతతో, నిర్విరామ కాయకష్టంతో సమాజం కల్పించిన అవరోధాలన్నింటినీ అధిగమిస్తూ, అవమానాలెన్నిటినో ధిక్కరిస్తూ అపూర్వ రత్న మాణిక్యాలను పండించి, గ్రంథాలకెత్తి, తుదకు సాహితీ వ్యవసాయకులుగా సమాజ సహపంక్తిని సాధించిన వాళ్ళం మేమిద్దరమూ.

ఇదంతా మేం కలిసి చేసిన పని కాదు. తెలిసి చేసిన పని కాదు. పనిలోనూ, ఫలసాయం లోనూ సామ్యత సైతం లేదు. ఒకే రకమైన దాస్యమూ, దారిద్ర్యమూ, అవమానాలూ, బంధనాలూ గల అస్పృశ్యకులంలో పుట్టడం అనేదే మా యిద్దరి మధ్యాగల సమాన ధర్మం.

ఒకరికి తెలియకుండా ఒకరం ఎక్కడెక్కడి నుంచో బయలుదేరి, చేతి కందిన సాధనాలతో ముందుకు తోసుకుపోతూ, ఎంతో దూరం ప్రయాసపడి, ఎదురు బొదురుగా తారస పడి, పరస్పరం పరిచయం చేసుకొని సన్నిహితులైన వాళ్ళం మేం.

శ్రమించిన పద్ధతులు, పరిసరాలు, పోరాట సాధనాలు, ఎక్కిన వేదికలు, దిగిన స్నేహ తీర్థాలు వంటి వన్నీ ఎవరివి వారివే. మేం విరుద్ధ దిశలలో పయనించినా ఒకచోట కలుసుకోవడానికి కారణం మా లక్ష్యం ఒక్కటే కావడం.

మా మార్గం సాహిత్యం. మా సాధనాలు అలంకార వ్యంగ్య సరస నిశితోక్తులు. పోరాటం అస్పృశ్యత మీద, కులతత్వ క్రౌర్యం మీద, మత మౌఢ్యం మీద, సాంఘిక దౌర్జన్యం మీద. లక్ష్యం కుల మత పక్షపాతాలు లేని, శక్తి సామర్థ్య సమగ్రమైన ప్రశాంత జీవితం మానవులందరికీ లభించాలనేది.

జాషువా గారిని గురించి జ్ఞాపకం తెచ్చుకొంటుంటే ఇప్పుడు ఈ విశ్లేషణ అంతా ఆవిష్కరించబడుతున్నదే తప్ప, ఆనాడు ఈ విధమైన ఆలోచన సరళి నా మట్టుకు నాకు లేనే లేదు. నా పని నేను చేసుకుపోయే వాడ్ని. ఆయన కనిపించినపుడల్లా ఆనందం అనుభవించే వాడ్ని.

ఒక మొక్క నాటినపుడు అలవాటుగా దానికి నీరుపోస్తూ, ఎరువు వేస్తూ వుంటామే తప్ప ఇతర విషయాలను గురించి ఆలోచించం కదా! మా స్నేహలత గురించి కూడా అదే విధంగా భావించవచ్చు.

## 12

నేను నిజంగా జాషువాలో ఆరాధించింది ఆయన వ్యక్తిత్వాన్ని, నిజాయితీని, నిర్భయత్వాన్ని, పౌరుషాన్ని, ప్రచండ భావోద్వేగాన్ని, ఆయన కవితా సౌందర్యాన్ని, పద్య శిల్పాన్ని, కాంతా సమ్మితంగా చేసే ఉపదేశాన్ని, వ్యంగ్య శైలీ వైఖరిని.

జాషువా గారి ప్రతి పద్యం నాకు ఒక అక్షర కళా రస కలశంగా కనిపిస్తుంది. ఏ పద్యాన్ని అయినా ఎన్ని సార్లైనా పాడుకొంటూ పరవశించ వచ్చు.

తెలుగు పద్య కావ్యాలలో పోతన్న గారి భాగవత పద్యాలూ, శ్రీనాథుడి చాటువులూ తరువాత, నాకు ఎక్కువగా నోట పలికేవి జాషువా గారి పద్యాలే.

జాషువా గారి సాహిత్యం బహుముఖాలుగా ప్రవహించిన ఒక మహావాహిని. బ్రహ్మ గారికి నాలుగు ముఖాలే అయితే, జాషువా గారి ముఖాలు అనేకం. అవన్నీ ఆయన విడి విడి పద్యాలూ, ఖండ కావ్యాలూ, మహా కావ్యాలూ, నాటకాలూ వగైరా. అన్నీ రసవత్ మణి రత్నాలే. మాణిక్య వీణలే.

ఫిరదౌసి ఈనాటికీ నాకు నచ్చిన మహా కావ్యం. అది జాషువాగారి జీవిత దర్పణమే అనవచ్చు.

ఒక్కొక్క పద్దియమ్మునకు
ఒక్కొక్క నెత్తురు బొట్టు మేనిలో
తక్కువగా రచించితి, వృథా
శ్రమ యయ్యె...

అంటూ, ఒక మహా కావ్యాన్ని వ్రాయడంలో కవి పడే శ్రమను వర్ణించాడు జాషువా. అది వాస్తవానికి అపూర్వ వర్ణన ఇది. శరీర శ్రమకంటే మానసిక శ్రమ ఎంత తీవ్రతరమైనదో చెప్పాడు కూడా.

శ్రమకు తగిన ఫలితం లభించని కవి పొందే దుస్థితిని కూడా ఆయన రూపు కట్టించి చూపాడు.

కృతి యొక బెబ్బులిం బలె శ
రీర పటుత్వము నాహరింప, శే
షిత మగు అస్థిపంజరము
జీవ లవంబున ఊగులాడగా
బ్రతికియు చచ్చియున్న ముది
వగ్గు మహమ్మదుగారి ఖడ్గ దే
వతకు రుచించునా ? పరిభ
వ వ్యధ ఇంతట అంతరించునా ?

ఫిరదౌసి కవిది విషాదాంత జీవితం. విషాదానికీ, వేదనకూ అది పరాకాష్ఠ. జాషువా కవి ఫిరదౌసిలో తనను తాను చూచుకొని తాదాత్మ్యం పొందినా, ఈయన జీవితం మాత్రం విషాదాంతం కాదు. జాషువా తన కవితా ప్రస్థాన ప్రారంభంలో కొన్ని కొన్ని తిరస్కారాలూ, మనో వేదనలూ పొంది వుండవచ్చు. మధ్య వయస్సు నుంచీ మహా దివాకరుడిగా అగ్రస్థానంలో వుండి గౌరవ మర్యాదలను, గజారోహణాది సన్మానాలను, సుఖ భోగాలను అనుభవించిన మహానీయుడే ఈయన.

ఇది నా తండ్రిని కష్టపెట్టిన ధనం,
బీ స్వాపతేయంబు ము
ట్టుదునా? నా జనకుండు కంట తడి పె
ట్టున్ స్వర్గ మందుండి...

అంటూ, ఫిరదౌసి మరణానంతరం గజనీ మహమ్మదు పంపించిన బంగారాన్ని తిరస్కరించింది ఆయన కుమార్తె.

ఆత్మాభిమానంలో, గౌరవాతిశయంలో జాషువా గారి కుమార్తె హేమలత అంతటిదే అయినా, అంతకంటే ఎక్కువ కాలోచిత వివేక విజ్ఞానాలను, ప్రజ్ఞా ప్రాభవాలను ప్రదర్శిస్తూ, తన తండ్రి పేరు మీదుగా సాహితీ సంస్థలను స్థాపించి, ప్రపంచ కవితా సరస్వతికి ప్రాసాదాలు నిర్మిస్తూ వుంది - కవి పండిత లోక వంద్యగా.

# 13

గోపరాజు రామచంద్రరావు గారు, అంటే గోరా గారు, అంతర్జాతీయ ఖ్యాతి గన్న నాస్తిక వాద గురువు. కాకినాడ కాలేజీలో నేను ఇంటరులో చేరే నాటికే ఆయన అక్కడ బోటనీ లెక్చరరు. నేను మేథమేటిక్స్, ఫిజిక్స్ స్టూడెంటుని. ఆ రీత్యా మా ఇద్దరికీ మధ్య ప్రత్యక్ష పరిచయం ఉండనక్కర లేదు. అయితే ఆయన నాస్తికత్వాన్ని ఒక ఉద్యమంగా నడిపించడానికి పూను కోవడం వల్లనో, నేను వేదాంతిక మనస్తత్వం కలవాడిని కావడం వల్లనో మా ఇద్దరికీ త్వరలోనే 1931 లోనే పరిచయం ఏర్పడి స్నేహంగా మారి ఆత్మీయతగా పరిణమించింది.

అక్కడ అతి ముఖ్యులైన బ్రహ్మ సమాజ గురువులకు, కాలేజీ యజమానులకు, వారిని అనుసరించి వుండే విద్యార్థులకు కూడా నేను విరోధినై పోవడానికి సైతం గోరా గారి సాన్నిహిత్యం కారణమైంది. అదంతా మరొక కథ.

గోరా గారి నాస్తికత్వం నా అద్వైత తత్వానికి ఏ విధంగానూ వ్యతిరేకం కాదని భావించాను నేను. నిర్గుణ నిరాకార పరబ్రహ్మ ఒక విశ్వాత్మక చైతన్యం. అది వున్న దనుకుంటే వుంటుంది, లేదనుకుంటే వుండదు. ఈ నా సిద్ధాంతాన్ని నేను గోరా గారికి స్పష్టంగా వివరించిన తర్వాతనే ఆయన తన సన్నిహితులలో నన్ను చేర్చుకున్నారు. ఆ తర్వాత చాలా కాలానికి మేం విడిపోయిన కారణం కూడా ఆ సిద్ధాంతమే అయింది. నిర్గుణ నిరాకార పరమాత్మకు రస స్పర్శను కలిగించి సృష్టిని వెలయించడం నాలోని కవికి కర్తవ్యం కదా మరి!

అట్టి గోరా గారు తమ పెద్ద కుమారుడు లవణం గారి వివాహం జరుపుతూ నన్ను కూడా పిలిచారు. పెళ్ళి బెజవాడలోని తమ నాస్తిక కేంద్రంలో. వధువు జాషువా గారి కుమార్తె హేమలత.

నేను ఈ రచనను డిక్టేటు చేస్తూ ఈ వాక్యం చెప్పినప్పుడు “ఈ లవణం పేరు తమాషాగా వుంది” అంటూ వ్యాఖ్యానించింది డిక్టేషను తీసుకొంటున్న శ్రీకరుణ.

ఈమె మా ఆవిడ హైమవతికి హైస్కూలులో స్టూడెంటు. హైస్కూలుకు ఎన్నో సాంస్కృతిక అవార్డులను సంపాదించి పెట్టిన ఆర్టిస్టు. తర్వాత సినిమా రంగంలోకి చేరి, టి.వి. లఘు చిత్రాలను వ్రాస్తూ, ప్రొడ్యూస్ చేస్తూ, దర్శకత్వం వహిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలిని.

ఆలోచనలు వరదలా పొంగుతూ, వ్రాయడానికి చేతులు వణుకుతుండడంతో దిక్కు తోచక దిగాలు పడివున్న నాకు తన తీరిక సమయంలో సహాయ పడుతున్న పరోపకార పరాయణ ఈ అమ్మాయి.

లవణం అనే పేరు తమాషాగానే వుంది. గోరాగారు తమ కుమారులకు, కుమార్తెలకు పెట్టుకున్న సమరం, విద్య, మైత్రి వంటి పేర్లన్నీ ఇలాంటివే. భారతదేశ సమకాలీన, ముఖ్యంగా స్వాతంత్రోద్యమ పురోగమనంలో ముఖ్యమైన సంఘటనలు జరిగినప్పుడు పుట్టిన బిడ్డలకు అందుకు తగిన పేర్లు పెట్టుకుంటూ వుండేవారు ఆయన. లవణం గారు ఉప్పు సత్యాగ్రహ సమయంలో పుట్టిన కుమారుడు. ఆయన నామకరణ సమయమప్పుడు గోరాగారు అతిథ్య మిచ్చిన మిత్రులతో నేనూ ఒకణ్ణి.

గోరా గారు నాస్తికులు. జాషువా గారు ఆస్తికుడు. బహుశా నాలాంటి ఆస్తికుడనవచ్చు. అయితే, నా కంటే ముందుకు వెళ్ళి " ముసుగులో గుద్దులాటలు పొసగ వింక" అంటూ, నేరుగా దేవుడితోనే పోట్లాటలు పెట్టుకొన్న వీర ఆస్తికుడాయన. ఆధునిక చండ దేవుడాయన.

దేవుడితో పోట్లాటకు దిగే వాడెప్పుడూ దేవుడి కంటే కూడా నిజాయితీ పరుడిగానే వుంటాడు. అన్నాడు కదా బర్న్స్ అనే ఆంగ్ల కవి.

ఈ ఆస్తి నాస్తి దాంపత్య బంధాన్ని తిలకిస్తూ తన్మయ మైపోయిన నేను అక్కడికక్కడ నా ఆశీర్వాదాన్ని ఒక పద్యంలో ఇలా చెప్పాను :

లేడను గోరాయును, ఉ
న్నా డను జాషువయు వియ్యమందిన నే డా
లేడును, ఉన్నాడును నా
తోడుగ ఈ నూత్న దంపతుల దీవించున్.

## 14

జాషువా మతాతీత మనస్తత్వం కలవాడు. ఏ మత నియమ నిబంధనలకు తల వొగ్గేవాడు కాడు. హేతు బద్ధంగా ఆలోచించే వాడు, ప్రవర్తించే వాడు, వ్రాసే వాడు.

ఆయన రస భావ రమణీయతను ఆరాధించే కవి మాత్రమే కాదు, ప్రతి వస్తువు లోనూ, వ్యక్తి లోనూ ఏదో ఒక వైశిష్ట్యాన్ని దర్శించ గలిగిన అక్షర చిత్ర శిల్పి కూడా.

ఒకసారి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ సమావేశం జరుగుతున్నపుడు నేను జాషువా పక్కనే కూర్చున్నాను. జరుగుతున్న చర్చల మీద లేదు మా దృష్టి. మా లోకం మాది. మా ఆలోచనలు మావి. వాటి స్వేచ్ఛకు అదుపూ, ఆజ్ఞా వుండవు.

ఒక రెండు క్షణాల మౌనం తర్వాత జాషువా కొంచెం కదలి పెన్సిలు తీసుకొని చేతిలోని ఇన్విటేషను కార్డును వెనుకకు త్రిప్పి ఏవో నాలుగైదు గీతలు గీసి నాకు చూపారు. నా చేతిలో నుంచి డా॥ నారాయణరెడ్డిగారు లాక్కున్నారు. ఆ కార్డు అలా అలా పర్యటనలోకి వెళ్ళిపోయింది. ఇంతకూ, జాషువా గీసిన దేమిటంటే - మా ముందు వరుసలో కూర్చుని వున్న కృష్ణ శాస్త్రిగారి ముఖచిత్రం. ఎంతో సహజ సుందరంగా, ఆరితేరిన చిత్రకారుడి చతుర శిల్పంగా వున్నదది. నన్నేకాదు, నారాయణరెడ్డిగారిని కూడా ఆశ్చర్యంలో ముంచి వేసిందది. జాషువాగారు మా ముఖాలలోకి చూచి, చిరునవ్వు నవ్వుతూ అన్నారు.

*లలిత కళలయందు బలమైన అభిరుచి*
*చిన్నతనము నందె చిగురువెట్టి*
*లీల నెదిగి చిత్రలేఖనమ్ముగ మారి*
*కట్టకడకు తెలుగు కవనమయ్యె !*

జాషువాగారు చిన్నప్పటి నుంచి ఆశువుగా పద్యాలు చెప్పడంలో ఆరితేరి వుండడం వల్ల, ఆయా విశిష్ట సమయాల్లో రసవత్సందర్భాలలో హృదయం స్పందించినప్పుడు తన భావాలను పద్య రూపంలోనే వెలువరిస్తూ వుండేవారు. అట్టి పద్యాలు సందర్భోచితమైన మార్పులతో తన ముద్రిత గ్రంథాలలో కనిపిస్తూ వుండేవి. సహజ ప్రతిభావ్యుత్పత్తులుగల ఏ కవికైనా ఇది సహజమే. అందుకే అట్టి కవుల కావ్యాలూ రస రమ్యాలుగా వుంటై.

*ఎదుట పడ్డ వస్తు వింపైన దైనచో*
*ఊరకొనదు చిత్రకారు కలము*

అన్నాడాయన. అంతటి అద్భుత చిత్రకారుడు జాషువా. అంతవరకూ ఆ వాస్తవం తెలియదు నాకు.

## 15

జాషువా గారూ, నేనూ ఎప్పుడు, ఎక్కడ, ఏ సందర్భంలో ఎన్నిసార్లు కలుసుకున్నా ఏదో లోకాభిరామాయణ కష్ట సుఖాలను గురించి తప్ప, వ్యక్తిగత సమస్యలను గురించి గాని, సారస్వత విషయాలను గురించి గాని చర్చించుకోలేదు.

ఇద్దరం మాత్రమే కలుసుకుని కబుర్లు చెప్పుకున్నా, సభలలో పాల్గొని ప్రసంగాలు చేసినా జాషువాగారు ఎప్పుడూ వక్తే. నేను తరచు శ్రోతగానే వుంటూ వుండేవాడిని. మంచి వక్తకు మంచి శ్రోత లభించడం ఒక అదృష్టమే కదా మరి!

జాషువా మంచి వక్త. తన అనుభవాలను జనరంజకంగా చెపుతుండే చతురుడు. కొత్త పద్యాలను శ్రావ్యంగా పాడి వినిపించేవాడు. వినే వాళ్ళకు కోపతాపాలు కలిగించగల కఠోర సంఘటనలను సైతం హాస్య రసాన్ని జోడించి నవ్విస్తూనే వాటి తీవ్రతను శ్రోతల గుండెలకు గుచ్చుకొనేలా విసిరేవాడు.

ఆయన చెప్పిన అటువంటి సంఘటనలు అనేకం నా స్మృతికోశంలో వున్నై. నా స్మృతి కోశాగారం విశ్వ విశాలమైనట్టిది. సహస్రాధిక పూర్ణ పూర్ణిమా ప్రపూర్ణమైనట్టిది. ఈనాడు అది ఏకం సత్‌గా విరిసి వుండడం వల్ల వైవిధ్యం కనిపించని పరమ స్థితి ఏర్పడి వుంది.

అందుకే జాషువాను గురించిన స్మృతులను వెదకి పైకి తీస్తున్నప్పుడు అన్నీ లభిస్తాయనే నమ్మకం లేదు. లభించిన వాటిని మాత్రమే అందజేస్తున్నాను. పైగా, ఇది నా వ్యక్తిగత కోశాగారం కనుక దీని సమగ్రతను గురించి ఎవరూ ప్రశ్నించకూడదు. ప్రశ్నించే అవసరం వుండదు కూడా.

ఈ స్మృతులలో నాకు అందిన అన్నిటినీ ప్రజల కందజేయాలనే కుతూహలం వుంది నాకు. అయితే, నా శ్రేయోభిలాషులైన మిత్రులు కొందరు అందుకు కొన్ని విధి నిషేధాలను సూచిస్తున్నారు. అట్టి విధి నిషేధాలకు ఒక ఉదాహరణ చెప్పాలంటే

ఒక మహాయోగికి, మహాకవికి వ్యక్తిగతంగా తాగే అలవాటుంటే ఆ మాటే

చెప్పగూడదట ! ఒక రాజకీయ మహాత్ముడికి ఒక ప్రియురాలుంటే ఆ ప్రస్తావనే తేగూడదట !గొప్పవాళ్ళుగా ప్రసిద్ధులైన వాళ్ళందరూ పరమ నైతికులుగానే చిత్రించబడాలట ! నేరస్తుడిగా ముద్రపడ్డ వాడెవడికైనా ఒక్క మంచి గుణం వున్నా దానిని వెల్లడించ కూడదట!

ఈ విధమైన కృతక లౌకిక దృష్టి నాకు కిట్టదు. ప్రతి మనిషిలోనూ నైజంగా మంచి చెడ్డలు రెండూ వుంటై. రోజంతా పూర్తి పగలూ వుండదు. పూర్తి రాత్రీ వుండదు. ఈ వాస్తవం దృష్ట్యా నేను వాస్తవాలు చెపుతూ వుంటాను. ఈ దృక్కోణం నుంచే జాషువాతో నా పరిచయ కథనాన్ని విలోకించవలసిందిగా సహృదయులను కోరుతున్నాను.

ఈ కథనంలో కాలక్రమానుసరణ లేకపోవచ్చు. ఎప్పుడేది ఎలా జ్ఞాపకం వస్తే అప్పుడు అలా దానిని వాక్యబద్ధం చేశాను.

ముందుగా పాదాలను చూపినా, భుజాలను చూపినా చివరకు చూపవలసింది సంపూర్ణ మూర్తి చిత్రం. నేను ఈ రచనను నాకు తెలిసిన జాషువా సంపూర్ణ చిత్రంగానే భావిస్తున్నాను. చిత్రంలో ఆవిష్కరించబడుతున్న పలు అంశాలలో ఏది ముందు ఏది తరువాత అనే మీమాంస అక్కరలేదు, అవసరం కూడా లేదు.

## 16

"పోషించు దాతలు లేక వర్తమాన యుగమున కవితా కళ సన్నగిల్లినది. ధనవంతుల పసిడి సంచులు కారణాంతరములకు ఖర్చు పెట్టబడుచున్నవి. దుర్భర దారిద్ర్యము కవుల నాశ్రయించుటం జేసి, ఉత్తమ కావ్యము లముద్రితములై మూల్గుచున్నవి."

ఇలా అనుకుంటూ, జాషువా గారు ఒక రోజున నా వద్దకు వచ్చి, తాను ఊరికి వెళ్ళిపోతున్నట్లు చెప్పారు.

నేను మద్రాసులో వుంటున్న కాలమది. ఆయన మద్రాసుకు ఎప్పుడు ఎందుకు వచ్చారో జ్ఞాపకం లేదు.

కొన్ని కొన్ని సంఘటనలు అస్పష్టంగా అయినా జ్ఞాపకం వుంటై. సమయ సందర్భాలు జ్ఞాపకం రావు. అలాంటి వాటిలో ఇదొకటి.

జాషువా గారు వెల్లడించిన పై భావాలు కళలకు, కవిత్వానికి సంబంధించి నంతవరకూ అక్షర సత్యాలే, వేద వాక్యాలే.

"నిరాశ్రయాన శోభంతే కవితా వనితా లతా" అనే సూత్రం సార్వ కాలిక సత్యం కదా! ఏదో ఒక విధమైన ఆశ్రయం, ఆధారం, సపోర్టు లేకుండా వనితా రాణించదు. కవితా రాణించదు. లతా రాణించదు.

ముఖ్యంగా కవిత వంటి లలిత కళలు సంపన్నులైన రాజులో, మంత్రులో, భూస్వాములో, పారిశ్రామిక యజమానులో ఔదార్యంతో ప్రశంసా పూర్వకంగా ఆదరించక పోతే, పోషించక పోతే అసలు ఎదగవు, వికసించవు.

ఏ కళలైనా ఆంగ్ల రచయిత అస్కార్ వైల్డ్ అన్నట్లు (All art is Useless) అనే విధంగానే వుంటై.

కవిత్వం వ్రాస్తూ కూర్చుంటే, బొమ్మలు గీస్తూ కాలం గడుపుతుంటే, పాటలు పాడుకుంటూ నదీ తీరాలలో తిరుగుతుంటే అన్న వస్త్రా లెలా లభిస్తై? మనస్సుకు ఉల్లాసం కలిగించే ఏ కళ కూడా అవసరానికి తిండి పెట్టేదిగా వుండదు.

అందుకే ఏ కళ ద్వారానైనా ఆనందాన్నీ, అస్వాదాన్నీ, ఉపశయనాన్నీ, సంతృప్తినీ పొందినప్పుడు అలా పొందిన రసాస్వాదకులు ఆ కళా కారుడ్ని పోషించడం ధర్మం. అలా పోషించని వాళ్ళు ఇతర రంగాలలోని శ్రమ దొంగల వంటి వాళ్ళే అవుతారు. మానవ సాంస్కృతిక వికాస చరిత్రలో ఈ సత్యం ప్రకటిత మౌతూనే వుంది. కళలకు రాజపోషణ లేని జాతి ఏవిధంగానూ వికసించదు. నిస్తేజ మైపోతుంది కూడా. జాషువా కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేశాడు

*గ్రంథ రూపంబు దాల్చు భాగ్యంబు లేక*
*కంట తడి పెట్టుచుండు నా కవన వాణి*

అంటూ, అయితే ఇది ఆయన కావ్య రచయితగా ఎదుగుతున్న ప్రారంభ దశ అనుకోవచ్చు.

తరువాత ఇతరుల కావ్యాల కన్నా జాషువా కావ్యాలే ఎక్కువగా ముద్రణకు

నోచుకున్నై. ఎంతోమంది సంపన్న సహృదయులు ఆయన కావ్యాలను అంకితం తీసుకున్నారు. కావలసిన సదుపాయాలన్నిటినీ సమకూర్చారు. విశ్వకవి సమ్రాట్‌నే చేశారు.

## 17

ఇక్కడొక వాస్తవాన్ని పేర్కొనాలి.

"నిరాశ్రయాన శోభంతే కవితా" అనే సూత్రానికి భిన్నంగా వ్యవహరించిన కవులు కూడా లేకపోలేదు. రాజులకు అంకితం ఇవ్వడం అనేది ఏదో పెద్ద నేరంగా భావించిన ఛాందసులు కూడా వున్నారు. అట్టి వారిలో బమ్మెర పోతన్నగారు ఒకరు.

కావ్యాన్ని మానవులకు అంకితం ఇవ్వడం గొప్ప నేరంగా భావించాడాయన. అలా అంకితం ఇచ్చిన కవులను తీవ్రంగా నిరసించడమే కాక అంకితాలు పుచ్చుకొన్న రాజులను కూడా నీచంగా దూషించాడు. వాళ్ళను 'కిరాత కీచకులు' అన్నాడు, 'కూళలు' అన్నాడు. వాళ్ళ నుంచి కవులు స్వీకరించే ధన కనక వస్తు వాహనాదులను 'పడుపుకూడు' అన్నాడు.

తనకు పొలం వుంది గనుక, చక్కగా వ్యవసాయం చేసుకొంటూ భాగవతాన్ని అనువదించా డనుకొందాం. ప్రతిభావంతులైన కవులకు ఆ మాత్రం భూవసతి కూడా లేనప్పుడు, ఒక పేదరికం కారణంగా కవితా సృష్టిని మానుకోవల్సిందేనా? రాజ పోషణలో చక్కని కావ్యాలు వ్రాయ గూడదా?

చరిత్రకూ, స్వభావానికీ విరుద్ధంగా వెళ్ళిన వాడు పోతన్న గారు. తెలుగులో వెలువడిన అత్యుత్తమ మహాకావ్యా లన్నీ రాజపోషణలో జరిగినట్టివే. అందుకు ఆధునిక యుగంలో జాషువా గారి గబ్బిలమే ఒక మంచి ఉదాహరణ.

## 18

ఊరు వెళ్లిపోతున్నానని చెప్పిన జాషువా గారూ, నేనూ కలిసి ఆ రోజున మద్రాసు సెంట్రల్‌కు వెళ్ళాం. రైలు ఇంకా అప్పటికి ప్లాట్‌ఫారం మీదకు రాలేదు. ప్లాట్ ఫారం మీద వున్న ఒక బెంచీ వద్దకు వెళ్ళి కూర్చున్నాం.

అంత వరకూ జరిగిన సంభాషణను బట్టి ఆయన చిరాకుకు కారణం ఊహించ గలిగాను. తాజాగా ఉన్నతాధికార పదవిలోకి వచ్చిన ఎవరో ఒక హరిజన మిత్రుడ్ని ఆయన కలుసుకుని వుంటారు. అక్కడ ఏదో ఆశాభంగం పొందివుంటారు. సహజంగా కవి కనుక కొంత మనస్తాపానికి గురై వుంటారు.

"ఎంత అధికారంలో వున్నా మన వాళ్ళు మన కేమీ చెయ్యరు" అన్నాడాయన, ఏటో చూస్తూ.

జాషువా చాలా ఆవేశపరుడు. ఆవేశం ఎంత ఎక్కువగా వుంటే అంత తీవ్ర క్రియాశీలి అవుతాడాయన.

మన వాళ్ళు మన కేమీ చేయరనేది వాస్తవమే అయినా, ఇందులోని వాస్తవాన్ని బహు ముఖాలుగా పరిశీలించవలసిన అవసరం వుంది.

ఈ నానా కుల మతాల గయ్యాళి గంప సమాజంలో మన వాళ్ళంటే ఎవళ్ళు?

మన దేశం వాళ్ళా? మన జాతి వాళ్ళా? మన మతం వాళ్ళా? మన వంశం వాళ్ళా? మన కుటుంబం వాళ్ళా? ఎవళ్ళు?

మానవులు ఎంత దగ్గర బంధువులైతే అంత ప్రాణ శత్రువులుగా పోరాడుకుంటారనే వాస్తవం మనకు పురాణాల నిండా, చరిత్ర నిండా కనిపిస్తున్నదే కదా!

కశ్యపుడి కొడుకులైన దేవాసురుల మధ్య, దశరథుడి భార్యల మధ్య, వాలి సుగ్రీవుల మధ్య, పాండవ ధృతరాష్ట్రుల మధ్య, చివరకు షాజహాను చక్రవర్తి కొడుకుల మధ్య జరిగిన యుద్ధాలే కదా మనకు లభిస్తున్న పూర్వ చరిత్ర.

కనుక, మన వాళ్ళంటే వ్యక్తిగతంగా మన (తన) పట్ల ప్రశంసా పూర్వకమైన గౌరవం కలవాళ్లు అనే అర్థమే తీసుకోవాలి. అంటే జాషువాకు గాని, నాకు గాని మా వాళ్ళు అనబడే వాళ్ళందరూ మా రచనలను మెచ్చుకొనే వాళ్ళు మాత్రమే – వాళ్ళు ఏ జాతి కుల మతాలకు చెందిన వాళ్ళైనప్పటికీ.

మద్రాసు సెంట్రల్ స్టేషన్ ప్లాట్‌ఫారం మీద కూర్చుని జాషువా గారు, నేను

మనసు విప్పి మాట్లాడుకొన్న అనేక విషయాలలో ఈ ‘ మన వాళ్ళు’ అనే దాని అంతు తేల్చడం ఒకటి.

రాజకీయ నాయకులో, మంత్రులో, అధికారులో, సంపన్నులో అయి వున్నంత మాత్రం చేత హరిజనులు గాని, మాల మాదిగలు గాని, మతం మారిన ఆ కులాల క్రైస్తవులు గాని మన సాహిత్యాన్ని అభిమానించక పోతే, వాళ్ళు మన వాళ్ళెన్నడూ కాజాలరని అనుకున్నాం. అట్టి వాళ్ళు మన పట్ల నిరాదరణ కనబరిస్తే మనం బాధ పడకూడదనే నిర్ణయానికి వచ్చాం.

అప్పుడు నవలెత్తిన చిరునవ్వుతో అన్నాడాయన. “అయితే, ఈ మాల మాదిగల మధ్య చెలరేగుతున్న తగాదాల మాటేమిటి?” అని.

## 19

షెడ్యూల్డు కులాల జాబితాలో అరవై కులాలకు పైగా వున్నై. అంటరాని వాళ్ళుగా వెలివేయబడి, అనేక విధాలుగా అణిచి వుంచబడిన కులాలు మాత్రమే ఈ జాబితా క్రిందకు వస్తై. ఆంధ్ర దేశంలో ప్రధానమైన షెడ్యూల్డు కులాలు రెండు. అవి మాలలు, మాదిగలు.

ఈ రెండు కులాల వాళ్ళూ ఆదిలో ఒకే వంశానికి చెందిన దాయాదులు. వృత్తులు కారణంగా క్రమంగా రెండు శాఖలుగా విడిపోయిన వాళ్ళు.

ఈ రెండు శాఖలు కులాలుగా మారిన పరిస్థితులలో వీళ్ళ మధ్య అస్పృశ్యత కూడా ప్రవేశించింది. బహుశా ఇది సవర్ణ కులాల నుంచి దిగుమతి చేసుకొన్న దురాచారం కావచ్చు.

మాల మాదిగల మధ్య అంటరానితనం అనే సమస్య నన్నెప్పుడూ బాధించలేదు. దానిని నేనెప్పుడూ గుర్తించలేదు కూడా. మా ఊళ్ళో మా గరువు మీద ఒకే ఒక మాదిగ కుటుంబం వుండేది. వాళ్ళకు చర్మకార వృత్తి లేదు. మాలల వలెనే వ్యవసాయపు పనులు చేసేవాళ్ళు. కాగా, అందరూ కలిసే వుండేవాళ్ళు. నేను చిన్నప్పుడు వాళ్ళ ఇళ్ళలో తింటూ, తాగుతూ, వాళ్ళతో కలిసిపోయి వుండేవాడ్ని.

నా సాహిత్యంలో మాల మాదిగ శబ్దాలను పర్యాయ పదాలు గానే వాడతాను.

చండాల, మాతంగ, గోసంగి, అరుంధతీయ, పంచమ, జాంబవాను, అది

ఆంధ్ర, ఆది హిందు, మాల మాదిగ, నిమ్న, హరిజన పదాలన్నీ పర్యాయపదాలే, సమానార్థకాలే, ఒకే వర్గం ప్రజలను సూచించేవే. అస్పృశ్యుడు అని చెప్పడానికి ఇందులో ఏ పదాన్నైనా వాడవచ్చు. పూర్వ కవులందరూ అలాగేవాడారు. నిరుద్ధ భారతం వ్రాసిన మంగిపూడి వెంకట శర్మగారు కూడా అలాగే వాడారు.

మాల, మాదిగ పర్యాయ పదాలే అయినా, ఛందోబద్ధమైన సాహిత్యంలో వాడడానికి మాదిగ అనే నాలుగు మాత్రల శబ్దం కంటే మూడు మాత్రల మాల శబ్దమే ఎక్కువ అనువుగా వుంటుంది. పూర్వ సాహిత్యం నిండా – మార్కండేయ పురాణంలోని హరిశ్చంద్ర చరిత్ర మొదలు జాషువాగారి ఆనాథ కావ్యం వరకూ కూడా – మాల మాదిగ వర్గాన్ని సూచించడానికి మాలశబ్దమే వాడబడింది.

**అలుక శమించెనా జలక**
**మాడిన యంతన, మాలదాని పి**
**ల్లల కడగండ్లు చూచి బహు**
**ళంబుగ తప్తము నందు నా మనో**
**జలజము మైల వద్ద, దది**
**స్నానము చేసెనె వెర్రిదాన!**

అంటూ తన ఆనాథ కావ్యంలో ఒక అంటరాని స్త్రీని సూచించడానికి మాల శబ్దాన్నే వాడాడు జాషువా.

వీరబాహుణ్ణి 'మాలడు' అన్నాడు మార్కండేయ పురాణకర్త.

నేను కూడా చాలా చోట్ల మాల మాదిగ వర్గాన్ని సూచించడానికి అనుకూల్యత కోసం మాల శబ్దాన్నే వాడడం జరిగింది. "మాలలు రాజు లౌదురు సుమా!" అన్నాను ఒక పద్యంలో.

**మాలను నేను, విక్రమ కు**
**మారుడ నేను, స్వతంత్ర విప్లవ**
**జ్వాలను నేను ....**

అన్నాను మరో చోట.

**మాలల మేమో, పనికి**
**మాలిన వారమె యేమో**

అన్నాడు కృష్ణ శాస్త్రి ఒక గేయంలో. ఈ గేయాన్ని సీతా అనసూయలు తరచు సాహిత్య సభలలో పాడుతుండే వాళ్ళు.

మంచి అన్నది మాల అయితే
మాల నే అగుదున్"

అన్నాడు గురజాడ.

అంటే – ఈ మాల శబ్దాన్ని ఒక మాల మాదిగలనే కొక మొత్తం అస్పృశ్య కులాలన్నిటినీ సూచించడానికే కవులు వాడా రనడం స్పష్టమే కదా? అట్టి కవులందరూ మాలల పట్ల పక్షపాతం చూపా రనలేం కదా?

ఈ మాల మాదిగ కుల భేదాలు నా వరకు ఒక సమస్య కాకపోయినా, తనను చాలా బాధిస్తున్నా యన్నారు. జాషువా గారు.

తాను మాలో, మాదిగో ఆయన ఎక్కడా చెప్పుకోలేదు. తాను పుట్టుక తోనే క్రైస్తవుడు కదా! క్రైస్తవ మతంలో కులాలు వుంటాయా? మాలలూ, మాదిగలూ హిందూ మతంలోని కుల జాడ్యం నుంచి విముక్తి పొందడం కోసమే కదా క్రైస్తవ మతంలోకి మారింది! కుల వ్యవస్థ అంటు జాడ్యం అయితే, ఇక మతం మారడం ఎందుకు ?

ఇది జాషువా గారు పడుతున్న బాధ. వ్యక్తిగతమైన బాధ కాదిది. ఒక జాతి సామూహిక భ్రష్టత్వానికి చలించిపోయి పడుతున్న మానసిక వ్యథ.

## 20

క్రైస్తవ మతంలోకి మారిన మాల మాదిగలు తమను మాల క్రైస్తవులుగా, మాదిగ క్రైస్తవులుగా చెప్పుకో సాగారు. మళ్ళీ ఇక్కడ కూడా ఈగోల దేనికి అనేది జాషువా గారి ఆవేదన. మాల క్రైస్తవులు మాల చర్చినీ, మాదిగ క్రైస్తవులు మాదిగ చర్చినీ వేరు వేరుగా నడుపుకోవడం ధర్మమేనా? పేటలు వేరు, నీళ్ళ బావులు వేరు, ప్రార్థనా మందిరాలు వేరునా?

అయితే, అక్కడ స్వర్గంలో కూడా మాల స్వర్గ మనీ, మాదిగ స్వర్గ మనీ విడి విడిగా వుంటున్నా యనవచ్చునా?

ఈ భారతీయ అమానుషతా దోషం కారణంగా మన దళిత కుల ద్వయం అసలు స్వర్గంలోకి అనుమతించబడుతున్నారో, లేదో కదా! ఒక్క హిందూ మతంలో మాత్రమే వ్యాపించి వున్న అస్పృశ్యత అనే వ్యాధి గురించి క్రైస్తవ మత దేవుళ్ళకు తెలిసి వుండదు కదా! మరి, తమ స్వర్గంలోకి తమకు తెలియని ఈ వ్యాధిని ఎలా రానిస్తారు?

అసలు ఈ రెండు కులాల మధ్య అంటరాని తనానికి కారణం చాలా చిన్నది. రెండు వృత్తులకు సంబంధించి నట్టిది - నూలు, తోలు వృత్తులవి.

ఇంట్లోనే వడుక్కునేది నూలు, ఊరి వెలుపల కడుక్కునేది తోలు.

నూలుకు పరిశుభ్రతా, తోలుకు అపరిశుభ్రతా సహజమే. అయితే, ఈ రెండు వృత్తులూ అన్నదమ్ములను క్రమంగా రెండు కులాలుగా విడదీశాయి. అంతవరకూ పరవాలేదనుకున్నా, వారి మధ్య రగిలిన వైరం మాత్రం ఏవిధం గానూ సమర్థించ రానిది.

మరొక దురదృష్టం ఏమిటంటే, ఈ నూలు, తోలు కూడా అంతర్జాతీయ వ్యాపార వస్తువులుగా విలువలు పెంచుకున్న తర్వాత, వాటిని వీళ్ళ చేతుల్లో నుంచి పైవాళ్ళు గ్రద్దల్లా తన్నుకు పోవడం జరిగింది. ప్రపంచ రాజకీయాలనే కీలుబొమ్మల్లా ఆడించగల నిరంకుశ కోటీశ్వర స్థాయికి ఆ పెద్దలు ఎదగడమూ జరిగింది.

ఆ సమయంలో నా ఆలోచనలు ఇలా సాగుతూ వుండగా జాషువా గారు ఈ పద్యం పలికారు–

*ఒక వంక నూలు వారును,*
*ఒక వంకను తోలు వారు ఊరక నను బ*
*ట్టుక లాగుదు రటు నిటు, తమ*
*ఎకిమీడ నటంచు; కవికి ఇటు నటు కలదే?!*

పద్యం తిన్నగా జ్ఞాపకం లేదు. భావం మాత్రం ఇదే.

జాషువా క్రైస్తవుడే కానీ హరిజన క్రైస్తవుడు కాదనీ, ఆయన మీద మాల మాదిగ కులాల వారెవరికీ హక్కులు లేవనీ వాదించే వాళ్ళు కూడా వున్నారు.

నూలు, తోలు అనే వృత్తి నామాలు కూడా ఆయనకు కిట్టవు, ఎందుకంటే, అందులో ఏ వృత్తికీ చెందినవాడు కాదాయన.

ఆయనది ఉపాధ్యాయ వృత్తి, విద్యకు సంబంధించింది. ఆయన విద్యా గురువు. హిందూ యోచనా పద్ధతిలో చెప్పాలంటే - ఆయన బ్రాహ్మణుడు. బ్రహ్మజ్ఞానం కలవాడు బ్రాహ్మణుడు. బ్రహ్మజ్ఞానం అంటే లోకజ్ఞత, సర్వభూత సమతా దృష్టి. అట్టి సుగుణ సంపదలో జాషువా అగ్రగణ్యుడు.

"నేను ఎవరి వాణ్ణి కాదు. అందరి వాణ్ణీని. నేను విశ్వమానవుణ్ణి" అన్నాడు జాషువా అందుకు అనుగుణంగానే వ్రాశాడు, జీవించాడు.

ప్రవచనంలో విశ్వమానవతా, ప్రవర్తనంలో విశ్వమానవతా, ప్రభావంలో విశ్వమానవతా. ఆయన పేరులోని మూడు అక్షరాల లోను ఈ మూడు ప్రకారాలు అక్షర మధురంగా నిండి వున్నా యనిపిస్తుంది నాకు జాషువానుస్మరించి నప్పుడెల్లా.

అటువంటి విశ్వ నరుడ్ని పట్టుకొని, "మావాడు మావాడు" అంటూ తమ తమ కులాలలో కలుపుకోవడానికి కొందరు కులతత్వ స్వార్థపరులు గింజుకు చస్తుంటే, ఆయన ఎంత క్షోభపడ్డాడో ఈ పద్యం చూడండి-

కలదమ్మా వ్రణ మంటరాని తన, మా
　　　కర్ణింపుమీ ఇండియా
పాల మందున్ గల మాల మాదిగలకున్;
　　　భూతేశుడే కాదు కృ
ష్ణులు, కృష్ణున్ నిరసించు దైవములు క్రీ
　　　స్తుల్ మస్తుగా పుట్టినన్
కలుప న్నేరరు రెండు జాతులను, వ
　　　క్కాణింప సిగ్గయ్యెడిన్!

మాల మాదిగల మధ్య పుట్టుకతోనే పుట్టిన అంటరానితనమనే పుట్టకురుపు మతం మారినా మానలేదు. అది మానడానికి దేశీయ కృష్ణుడేమీ చేయలేకపోయాడు, విదేశీయ క్రైస్తు కూడా ఏమీ చేయలేకపోయాడు కదా! ఎంత విచారకరం!

ఈ అంటరానితనమనే వ్రణం మౌలికంగా మాల మాదిగలలో పుట్టింది కాదు. హైందవ సమాజంలో పుట్టిందది. వాళ్ళనుంచి వీళ్ళకు సంక్రమించిన అంటురోగమది.

దాన్ని బ్రహ్మ విష్ణు మహేశ్వరులూ, వాళ్ల కుమారులూ, వాళ్ళ అవతారమూర్తులూ కూడా ఏమీ చేయలేకపోయారు. పైగా, ఆ వ్రణం మొత్తం తమ జాతినే నిర్వీర్యం చేసి విదేశీ దేవుళ్ళకు పాద సేవ చేయిస్తుంటే కళ్ళు మూసుకుని కొండ లెక్కి కూర్చున్నారు, పాపం!

అనగా, మొండివాడు రాజు కంటే బలవంతుడన్న సామెతగా, ఈ దేశంలో పుట్టిన మనుషులంతా దేవుడికంటే బలవంతులైన మొండి వాళ్ళనవచ్చునేమో!

## 21

ఈ దేశంలో, ఈ హైందవ సమాజంలో అంటరాని వాళ్ళనబడుతున్న వాళ్ళెవరు?

ఈ అస్పృశ్యులనబడుతున్న వాళ్ళంతా వైదిక ఋషుల వారసులే అనేది నా సిద్ధాంతం. ఈ నా సిద్ధాంతాన్ని ఋజువు చెయ్యడానికి వైదిక సాహిత్యంలోనూ, మానవ చరిత్రలోనూ అనేక సాక్ష్యాధారాలున్నై. నా చిన్నప్పటి నుంచీ పురాణ సాహిత్యంలో మునిగి తేలుతూ నేను చేస్తున్న నిరంతర పరిశీలన ఫలితమే హరిజనులు ఆర్యులే అనే ఈ నా సిద్ధాంతం.

జాషువా కవి కూడా నాలాగే ఆలోచిస్తున్నాడనీ, ఈ అస్పృశ్య కులాల జన్మ రహస్యాలను గురించి అన్వేషిస్తున్నాడనీ గుర్తించినప్పుడు నేను పొందిన ఆనందం ఇంతా అంతా కాదు.

ప్రతి అస్పృశ్యుడూ, ప్రతి పంచముడూ, ప్రతి నిమ్నుడూ, ప్రతి దళితుడూ తీవ్రంగా ఆలోచించవలసిన సమస్య ఇది. తానెవరు? ఇన్ని యుగాల పొడుగునా విస్తరిస్తూ వచ్చిన తన వంశ వృక్షానికి మూల పురుషుడెవరు?

తాను అనుభవిస్తున్న నేటి దుస్థితిని సమూలంగా తొలగించాలంటే ఏవో

తత్ శాంతిచర్యలు కాక, ఏవో తాత్కాలికోపశమన చికిత్సలు కాకుండా వ్యాధి ప్రధాన కారణాన్ని పట్టుకొని దానిని నిశ్శేషంగా నిర్మూలించాలి. అందుకు, తానెవరో తెలియాలి.

ఈ విధమైన మౌలిక పరిశోధన నేను నా చిన్నప్పుడే మొదలుపెట్టాను. అప్పటికే మాదిగలు తాము అరుంధతీయుల మనీ, జాంబవాసుల మనీ చెప్పుకొంటూ వుండడం చూచి ధైర్యంతో ముందుకు సాగాను. నా సిద్ధాంతం సరియైనదే అనే నిశ్చయానికి వచ్చాను.

ఒక్క మాదిగలే కాదు, మాలలు కూడా, అస్పృశ్యులుగా భావించబడుతున్న కులాలన్నీ కూడా అరుంధతీయులే, జాంబవానులే. అది పరమసత్యం. ఆ సత్యాన్ని మాలలచేత కూడా గుర్తింప చేయడానికి నేనెంతో కృషి చేశాను. ఈనాటికీ చేస్తున్నాను. జాషువా కూడా ఇదే మార్గంలో పయనిస్తున్నాడన్న వాస్తవం నన్నెంతో ఆనందపరచింది. ఈ పద్యం పరిశీలించండి.

కని గంగార్పణ మంచు త్రోసి చనియెన్
  కర్ణున్ పృథాదేవి; ఆ
తని విద్యా గుణరూప సంపదలు వ్య
  ర్థంబై ప్రలాపింపవో?
కనియెన్ భారత కుంతి మమ్ముల నసం
  ఖ్యాకంబుగా కర్ణులన్!
మునిపక్షీ! యమ నందనుల్ తెలియ రి
  ప్పున్ మాదు భ్రాతృత్వమున్

ఇదెంత గొప్ప పద్యమో పరిశీలించండి.

నేను పరిశోధక స్థానంలో వుండి వ్రాసిన వేల పేజీల సారాంశాన్ని కవిగా ఒక మత్తేభ పద్యంలో చూపగల్గిన జాషువా సాక్షాత్ భారత భారతీమూర్తి భావమే కదా! ధ్వనివైభవానికి, శిల్ప సౌందర్యానికి ఈ పద్యం ఒక నమూనా.

ఆనాడు కర్ణుడు చచ్చిన తర్వాతనైనా ధర్మరాజుకి తెలిసింది – కర్ణుడు తన సోదరుడని.

ఈనాడు సవర్ణ హిందువులలో ప్రతి ఒక్కడూ ఒక ధర్మ రాజే, ధర్మ రక్షకుడే, అయితే, కొన్ని కోట్ల మంది కర్ణులు ప్రతి క్షణమూ భారత కుంతి కడుపున అనాధలుగా పుడుతూ, అవమానితులుగా చస్తూ వుంటే వీళ్ళ సహోదరత్వాన్ని గుర్తించే సిసలైన ధర్మ రాజు ఒక్కడూ లేడు కదా!

ఈ నాటి ధర్మరాజులందరూ ధర్మం లోపించిన రాజులు మాత్రమే. వట్టియమ నందనులు మాత్రమే. ఓహో! జాషువా పద్య రచనలోని శబ్దశక్తి!

## 22

ఒక సాయంకాలం జాషువా ఏదో సాహిత్య సభలో మాట్లాడుతూ, కళాపూర్ణోదయంలోని ఒక పద్యాన్ని ఉదహరించాడు.

**తమి పూదీగెల తూగుటూయలల పం**
**తా లాడుచున్ తూగు నా**
**కొమరం బ్రాయపు గబ్బి గుబ్బెతల అం**
**ఘ్రుల్ చక్కగా సాగి మిం**
**టి మొగమ్మై చనుదెంచు తీవి కనుగొం**
**టే దివ్య మౌనీంద్ర! నా**
**క మృగీ నేత్రల మీద కయ్యమునకున్**
**కాల్ సాచు లా గొప్పెడున్!**

దేవర్షి నారదుడు, మణికంధరుడు ఆకాశంలో ప్రయాణం చేస్తూ ఒక సారి క్రిందకు చూచినప్పుడు, ఒక రాజోద్యానంలో కొందరు రమణీ మణులడోలా క్రీడోత్సవ దృశ్యం కనిపించింది. ఆ దృశ్యాన్ని మణికంధరుడు నారద మహర్షికి వర్ణించి చెప్పిన పద్యం ఇది.

ఉయ్యాలలూగుతున్న అమ్మాయిల కాళ్ళు ఆకాశం కేసి వస్తున్న దృశ్యం ఎలా వున్నదంటే – స్వర్గకాంతల మీద కయ్యానికి కాలు చాస్తున్నట్టుగా వున్నదట. అంటే ఆ క్రీడాసక్తులైన మానవ కాంతలు సౌందర్య సముత్సాహాలలో దేవకాంతలను మించి వున్నారని అతడు ప్రశంసించాడన్న మాట.

ఈ పద్యం అన్ని కవితా లక్షణాలను కలిగివున్న రసగుళిక. కవిత్వం ఎలా వుండాలో చెప్పాలంటే ఈ ఒక్క పద్యమూ చెప్పి, దీని అర్థ తాత్పర్యగుణ విశేషాలను వివరిస్తే చాలు.

మణికంధరుడిలోని ఈ కవితాశక్తిని గుర్తించి నారదుడు వెంటనే అన్నాడు. "భళిరా సత్కవి వౌదు నీవు" అని.

ఈ సందర్భాన్ని జాషువాగారు ఆనాటి తన ప్రసంగంలో ఎంత చక్కగా వివరించి చెప్పారంటే – సభాసదులు ముగ్ధులై పోయారు. కవితా రహస్యం అందరికీ బట్టబయలై పోయింది.

నేనే ఎన్నెన్నో సార్లు ఎందరెందరి సాహిత్యోపన్యాసాలలో వినివున్నాను. ఇంతటి కవితా దర్పణం నుంచి సూక్ష్మంలో మోక్షాన్ని అతఃపూర్వం దర్శించి వుండలేదు.

పింగళి సూరన్న గారి కళాపూర్ణోదయ కావ్యం ఒక అద్భుత సృష్టి. ఒక్క కట్టమంచి రామలింగారెడ్డిగారు తప్ప మరే సాహిత్య విమర్శకుడూ దానికి న్యాయం చెయ్యలేదనిపిస్తుంది నాకు. కారణం గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు.

జాషువా గారికి కూడా సాహిత్య రంగంలో పూర్తి న్యాయం ఇంతవరకూ జరగలేదు. ఆయన లేఖినినుంచి వెలువడిన ప్రతి పద్యాన్నీ సమగ్రంగా పరిశీలించి విపుల వ్యాఖ్యానాలతో విశేష భాష్యాలు వెలువడవలసి వుంది.

## 23

దేశభక్తిలో ఏ దేశ భక్తుడి కంటే కూడా జాషువా అగ్రేసరుడిగా కనిపిస్తాడునాకు.

జాతీయోద్యమ కాలంలో ఆ ఉద్యమం ఇంకా తీవ్రంగా ముందుకు దూకాలనీ, భారతీయులందరూ కలిసి మూకుమ్మడిగా ఉద్యమంలో పాల్గొనాలనీ ఆయన కవితాత్మ ఎంతగానో తహ తహలాడిపోయింది.

ఆయన ఆ ఉద్యమ కాలంలో వ్రాసిన పద్యాలూ, కావ్యాలూ మాత్రమే కాక, మొత్తం ఆయన రచనలన్నిటా కూడా జాతీయతా, జాతి సమైక్యతా జాతి సంఘటిత పురోగమన కాంక్షా స్పష్టంగా కనిపిస్తూ వుంటై.

మాల మాదిగల సమైక్యం గురించి, దారిద్ర్య నిర్మూలన గురించి

హరిజనాభ్యుదయం గురించి ఆయన అంతగా ఆలోచించాడంటే అదంతా భారతీయమైన సమగ్ర వ్యక్తిత్వ నిర్మాణం కోసమే.

"అంగ వ్రాతములో చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శేషాంగ శ్రేణిని మేలు" చెయ్యాలన్న భాగవత నిర్దేశమే నాది కాని, జాషువాది కాని మంగిపూడి వెంకట శర్మదికాని, కుసుమ ధర్మన్నది కాని.

హిందూ సమాజంలోని ఒక బలమైన మార్గం వాళ్ళను అస్పృశ్యులుగా వెలివేసి, సవర్ణులు హింసించడం వల్లనే వాళ్ళు ఇతర మతాలలోకి మారిపోయి హిందూ జాతీయతను నిర్వీర్యం చేశారు. "మేం మూతులు నాకుతున్నా మా తాతలు నేతులు తాగారు" అంటూ బడాయి కబుర్లు చెప్పుకున్న కవులను అలా వదిలేస్తే, అసలు ఈ జాతి అంత నిర్వీర్య మెందు కయిందో గమనించి, దానికి పునరుజ్జీవన ధాతు పుష్టిని కలిగించడానికి ప్రయత్నించిన నిజమైన మహాకవులు కూడా వున్నారు. అందులో జాషువా అగ్రగన్యుడనవచ్చు.

అందుకు ఒక్క పద్యాన్ని మాత్రం మచ్చుకు ఇక్కడ ఇస్తున్నాను:

**తరముల్ పెక్కులు దాస్య గర్భమున అం**
**తర్ధానమై పోయె; సో**
**దర దేశంబు లఖండ వైభవ సము**
**ద్ర స్నానముల్ చేసె; తత్**
**పరమోత్సాహ సముత్సవ ప్రగతిలో**
**పాల్పంచుకోకుండ, సో**
**మరి దానిం బలె మిన్నకుండెదవు, లె**
**మ్మా, కచ్చ బంధింపుమా!**

ఇదీ దేశభక్తి క్రియాశీలతకు సూత్రం.

సృష్టిలోని ఏ రూపానికైనా పేరు అనేది గుర్తు కోసమే. పేర్లు భాష లను బట్టి వుంటై.

లోకంలో ఎన్ని భాషలుంటే మానవులు అన్ని జాతులు అనుకోకూడదు. ఏ జాతి అయినా విస్తరించే కొలదీ భాష కూడా శాఖోప శాఖలుగా విడిపోతూ వుంటుంది. కనుక, సంస్కృతం మాట్లాడే వాడే హిందువుడని గానీ, అరబ్బీ మాట్లాడేవాడే మహమ్మదీయుడని గానీ, ఇంగ్లీషు మాట్లాడేవాడే క్రైస్తవుడని గానీ అనుకోకూడదు.

'ద హెబ్రూ ఆరిజిన్ ఆఫ్ ద ఇండియన్ బ్రాహ్మిన్' అనే పుస్తకం చదివాను నేను చాలా కాలం క్రితం. ఈ జాతి భేదాలు ఎంత కృతకమైనవో అందులో శాస్త్రీయంగా వర్ణించబడినట్టు జ్ఞాపకం.

క్రైస్తవులకు పురాణ పురుషుడు ఐజాకు, మహమ్మదీయులకు పురాణ పురుషుడు ఇస్మాయిలు అన్నదమ్ములే కదా! సవతి తల్లుల బిడ్డలు. అబ్రహం గారి కుమారులు.

మరి, వాళ్ళ మధ్య జరిగిన క్రూసేడ్లు, జిహాద్‌లు అన్నీ కేవలం మత విశ్వాసంతోనూ, దైవ భక్తి తోనూ జరిగినవే అనగలమా? అవి కూడా మనకశ్యప కుమారులైన దేవాసురుల మధ్య జరిగిన యుద్ధాల లాంటివే. ఏ యుద్ధాల లక్ష్యాలైనా స్వప్రయోజనాలే. మతమూ, దేవుడూ అనడం సామాన్య ప్రజలను మోసగించడానికి మాత్రమే.

ఈ వాస్తవం జాషువాకు తెలుసు. అందుకే ఆయన ఏ మతాన్నిగాని, ఏ దేవుణ్ణి గాని అభిమానించలేదు. వాళ్ళ గురించి పట్టించుకోలేదు.

వ్యాసముని చంద్రుగన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షి అయ్యె
వేశ్యకును బుట్టి మాలెత బెండ్లి యాడి
ఆ వశిష్ఠ మహర్షి బ్రహ్మర్షి యయ్యె

అనే నిరుద్ధ భారత పద్యం ఒక్కటే చాలు అస్పృశ్యులనబడుతున్న వాళ్లూ, సవర్ణ హిందువు లనబడుతున్న వాళ్లూ ఒకే జాతికి సంబంధించిన వాళ్ళని నిరూపించడానికి.

అయితే, తరతరాల దాస్యం వల్ల అస్పృశ్యులు మూరులై పోయారనుకోవచ్చు. మరి, సవర్ణ హిందువుల కేమయింది? జాతి సమైక్యం కోసం ఎందుకు కృషి చెయ్యరు?

ఆనాడు జాషువా గాని, ఈనాడు నేనుగాని చేసిన, చేస్తున్న కృషి ఇదే.

పరాశరుడి తల్లి మాలది. ఆమె పేరు అదృశ్యంతి. ఆమె అరుంధతి మేనకోడలు. అరుంధతి తన కొడుకు శక్తి మహర్షికి తన మేనకోడలినే తెచ్చి చేసుకొన్నది.

అరుంధతి కున్న తమ్ముడొక్కడే. అతడే సాంఖ్యదర్శన కర్త కపిలమహర్షి. అంటే, అదృశ్యంతి కపిల మహర్షి కుమార్తె అయి వుండాలి. ఈ విషయంలో పరిశోధన ఎంతో జరగవలసి వుంది.

ఏడుగురు అక్కచెల్లెళ్ళలో అరుంధతి ఏడవది. కపిలుడు ఎనిమిదవ వాడు. వీళ్ళంతా కర్దమ ప్రజాపతి సంతానం అంటూ ఒక పాఠాంతరం వుంది కావచ్చు. ఆ కాలంలో జాతి పెద్ద అయిన కర్దముడు ఒక మాల పెద్దే అయివుండవచ్చు కదా!

పరిశోధన అంటే, అది జరగవలసింది కుల మౌఢ్య సినీ పండిత కవులచే కాదు - మంగిపూడి వెంకటశర్మ వంటి విశ్వభారతీ మూర్తులచే.

తన పరిశోధన కార్యక్రమాన్ని, అస్పృశ్యులనబడుతున్న వాళ్ళు 'బ్రోకెన్ పీపుల్' అనే తన సిద్ధాంతాన్ని ఇంకా ముందుకు తీసుకువెళ్ళవలసిందిగా అంబేద్కరు చేసిన విజ్ఞప్తిని సైతం లెక్కచేయడం లేదు కదా, ఆయన శిష్యకోటిలోని విద్యావంతు లొక్కరు కూడా?

ఈనాటి మాల మాదిగ విద్యావంతులు అంబేద్కరు సంపాదించి పెట్టిన సౌకర్యాలను తమ వ్యక్తిగత స్వార్థాలకూ, స్వాతిశయాలకూ మాత్రమే కదా వాడుకొంటున్నారు?

అట్టి స్వార్థ సంకుచిత దుర్మార్గులను గురించి జాషువా పడిన ఆవేదన ఎంత బాధాకరమైనట్టిదో ఈ పద్యం స్పష్టీకరిస్తుంది

*జగముల్ మెచ్చు బియే, లెమేలు, బిరుదుల్*
*సాధించినా మంచు నీ*
*లుగు మా మాలలు, మాదిగల్ కుల మహా*
*లోభంబు రెట్టింపగన్*
*తెగలన్ గట్టి తగాద లెంచెదరు గా*
*నీ, సంధి గావింప; రో*
*ఖగ భామా! మత బోధలేల కుల క*
*క్షా భ్రష్ట దుర్జాతికిన్?*

# 25

"అంబేద్కరు భయంకరుడు, భయరహితుడు, చేతికి ఏది దొరికితే దానితో ఈ హిందూ కుక్కను కొట్టడానికి వెనకాడడు" అంటూ పరితపించాడు గాంధీజీ.

'హిందూ కుక్క' అనడంలో నిస్పృహతో కూడిన దుఃఖం గాంధీజీని ఎంతగా పీడిస్తూ వుండిందో అంచనా వేయగలమా?

జాషువా దుఃఖం కూడా అంతకంటే బాధాకరం. 'కులకక్షా భ్రష్ట దుర్జాతి' అంటూ మాల మాదిగ విద్యావంతుల్ని తిట్టినప్పుడు

'కులకక్షా భ్రష్ట దుర్జాతి' ఒక్క మాల మాదిగ లేనా? యావద్భారత హిందూ సామాజిక వ్యవస్థకూ ఈ నింద వర్తించదా?

ప్రవక్తలు చెప్పినా వినరు, గురుదేవులు చెప్పినా వినరు, మేధావులూ, సంస్కర్తలూ చెప్పినా వినరు, మహాకవులు చెప్పినా వినరు, మరెవడు చెపితే వింటారు ఈ నిమ్నులు? కేవలం స్వభావాన్ని బట్టే ప్రవర్తించే మూఢ జంతువుల కంటే ఏ విధంగా ఉన్నతులు ఈ మానవ జీవులు?

ఇక్కడ అస్పృశ్యతా నివారణా, హరిజనోద్ధారణా కార్యక్రమాలను గురించి, గాంధీ అంబేద్కరులకు సంబంధించి ఒక సత్యాన్ని వెల్లడించవలసి వుంది.

ఆధునిక యుగంలో అస్పృశ్యతను తొలగించి నిమ్న కులాలవాళ్ళను తక్కిన సవర్ణ భారతీయుల స్థాయికి పెంచడానికి కృషి చేసిన సంస్కర్తలలో గాంధీజీని మించిన వాళ్ళు మరొక రెవరూ లేరు.

అట్టి గాంధీజీ దళితులకు శత్రువంటూ ఒక దుష్ప్రచారం వ్యాపించింది. ఈ దుష్ప్రచారం చేసినవాళ్ళూ, ఇప్పటికీ చేస్తున్నవాళ్ళూ రాజకీయ పార్టీలే కావచ్చు. కానీ, తమ బాగు తమకు తెలియని, తమ ప్రాచీనత తమకు తెలియని, తమ సంస్కృతి తమకు తెలియని దళితులు సదరు దుష్ప్రచారాన్ని నమ్మి ఎంతగా చెడిపోతున్నారో చూస్తూవుంటే ఎంతటి రాతి గుండెలైనా బీటలు తీయక తప్పదు.

ప్రతిభావంతులైన ప్రజానాయకులు ఇద్దరు రెండు వ్యతిరేక పార్టీలలో వున్నప్పుడు తమ తమ పార్టీల ప్రయోజనాలకోసం ఒకళ్ళ నొకళ్ళు విమర్శించుకోవడం,

నిందించుకోవడం తప్పనిసరి. ఆ పద్ధతిలో ఎట్టి పరిస్థితిలోనూ జాతి విచ్ఛిన్నం కాకూడదని, హరిజనులు హిందూ సామాజిక పరిధినుంచి బయటికి పోకూడదని గాంధీజీ పట్టుబట్టి కూర్చుంటే, కలిసి మెలిసి వుంటే మహమ్మదీయులకే విడిపోయే హక్కును ఇచ్చినప్పుడు, ఊరికి దూరంగా తరిమి కొట్టబడిన అస్పృశ్యులకు అంతకంటే ఎక్కువ హక్కులు కావాలని అంబేద్కరు డిమాండు చేశాడు.

ఇద్దరూ కరక్టే. ఇద్దరూ జాతి సమగ్ర శ్రేయస్సు కోరిన వాళ్ళే. కాగా అంబేద్కరీయులు గాంధీని, గాంధేయులు అంబేద్కరుని తప్పు పట్టడం న్యాయం కాదు కదా!

ఉచితానుచిత వివేకం లేని దళితులు ఏ వికాసమూ లేకుండా ఎక్కడివాళ్ళక్కడే వుండిపోగా, సమయజ్ఞుడైన మేధావి అంబేద్కరు గాంధీగారి పిలుపును మన్నించి, కాంగ్రెసు మంత్రివర్గంలో చేరి, స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాత అయినాడు. దళితులకు హిందూ సామాజిక పరిధిలోనే తగిన హక్కులను, రిజర్వేషనులను కలిగించగలిగాడు.

దళితులకు తగిన హక్కులు సాధించి పెట్టడానికి అంబేద్కరు కాంగ్రెసును, గాంధీజీని నిందించడం జరిగింది. అట్టి నింద ఒక సాంఘిక ప్రయోజనాన్ని ఆశించినట్టిది మాత్రమే. గాంధీజీ మాత్రం అంబేద్కరు హృదయం తెలిసినవాడు కనుక, అంబేద్కరును అన్యాపదేశంగా ప్రశంసిస్తూ, హిందూకులతత్వ వాదుల్ని తీవ్రంగా నిందిస్తూ వుండేవాడు.

హిందూ కులతత్వ వాదులతో ఎంతగా విసిగి పోకపోతే 'హిందూ కుక్క' అంటాడు! అలా అన్నందుకు ఎంత బాధపడి వుంటాడు!

తనకు పునర్జన్మ వుంటే హరిజనుడుగా పుడతానన్నాడు. అస్పృశ్యత పోకపోతే హిందు సమాజం చస్తుందన్నాడు. తాను పాకీ పేటలో మకాం పెట్టాడు. అస్పృశ్యకులాలకు వుండే హీనమైన పేర్లను రద్దుచేసి, అందరికీ కలిపి ఒకే ఒక 'హరిజన' అనే పేరు పెట్టాడు. ఆ పేరుతో పత్రిక నడిపాడు. హరిజన సేవా సంఘాలు నెలకొల్పాడు. ఆ సంఘాలకు ప్రత్యేకంగా దేశ పర్యటన ద్వారా నిధులు సమకూర్చాడు.

1915లో తాను స్వయంగా ఒక హరిజన బిడ్డను దత్తత చేసుకొన్నాడు. అందుకు హిందూ కులతత్వ వాదుల చేత వెలివేయబడ్డాడు. స్వరాజ్యం వచ్చినప్పుడు స్వతంత్ర భారత దేశానికి ఒక హరిజన మహిళ మొదటి అధ్యక్షురాలు కావాలన్నాడు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆమెకు కార్యదర్శిగా వుండి పరిపాలనా విధులలో తోడ్పడాలన్నాడు.

ఇన్ని విధాలుగా హరిజనోద్ధరణ కోసం, ఈ నిమ్నకుల అభాగ్యులను పట్టి పీడిస్తున్న దళితత్వాన్ని నిర్మూలించి వారికి సమాజంలో సహపంక్తి స్థాయిని కలిగించడానికి కృషి చేసిన గాంధీజీని దళితులకు శత్రువు అనడం అమానుషమే అవుతుంది.

అంబేద్కరు గాంధీజీకి ఏ విధంగానూ వ్యతిరేకి కాదనీ, 1954లో రాజ్యసభలో ఆయన గాంధీజీని ఎంతో ప్రశంసిస్తూ మాట్లాడాడనీ, తాను కూడా అప్పుడు ఆ సభలో వున్నాననీ గాంధీజీ యొక్క 125వ జయంతి ఉత్సవాలకు కన్వీనరుగా పనిచేసిన సురేంద్రనాథ్ ద్వివేది గారు వివరించారు. (హిందూపత్రిక - 28.9.1995)

ద్వివేది గారు ఇంగ్లీషులో చేసిన ప్రకటనను ఈ క్రింద ఇస్తున్నాను:

## Ambedkar and Gandhiji

In View of the series of allegations emanating from some political parties and their leaders that Dr. Ambedkar was a hater of Gandhiji and that Gandhiji was an enemy of the Dalits, I would like to reproduce here a portion of the speech of Dr. Ambedkar which he delivered in the Rajya Sabha on 6 September, 1954, on Mahatma Gandhi. I also participated in the same debate as one of his colleagues in the Rajya Sabha. I think this will clear all doubts in the public mind.

Paying glowing tributes to Gandhiji, he said, "I respect him and I suggest, in the name of Mr. Gandhi, a Gandhi Trust be created for development or settlement of the untouchables. After all, untouchables, according to all of us, were the nearest and dearest to him and there is no reason why Mr. Gandhi may not bless this project from heaven."

He further said."You may keep it quite outside the budjet just as a sort of Gandhiji welfare Scheme, which will perpetrate the name of Mr. Gandhi and which will give relief to the people whom he wanted to protect and whom he wanted to elevate."

అంబేద్కరు గారి ఈ ప్రసంగాన్ని ఇక్కడ నేను ఎందుకు ఉదహరించానో

స్పష్టమే. గాంధీజీని ద్వేషించడం, ఆయన పెట్టిన హరిజన అనే పేరును నిరాకరించడం, తమతో శాశ్వతంగా సహ జీవనం చెయ్యాక తప్పని హైందవ జాతీయులతో వైరం పెంచుకోవడం దళితులకు శ్రేయస్కరం కాదని, తమ పురోభివృద్ధికి అట్టి వ్యతిరేక వైఖరి ఏ విధంగానూ తోడ్పడదని స్పష్టంగా డా॥ అంబేద్కరు గారి నిజ హృదయాన్ని ఇక్కడ ఆవిష్కరించాను.

జాషువా గారి కావ్యాలలోని ఏ పద్యం చదివినా, నా ఈ ఉపదేశాన్ని బలపరుస్తుంది. సహృదయతతో, తెలుసుకోవాలనే ఉత్సుకతతో దళితులే కాదు, దళితేతరులు కూడా పరిశీలించడండి.

ద్రాక్షా పాకంలో, పద్య కళా కలాశాలలో స్వచ్ఛమైన, ఉపదేశాత్మకమైన కవితా రసాన్ని ఒక ప్రవక్తలా అందించాడు జాషువా.

దురదృష్టం ఏమిటంటే – ఆ రస కలశాలలోని మాధుర్యాన్ని యథాలాపంగా ఆస్వాదించి, ఆహా ఓహో అంటున్నారే తప్ప, కవి ప్రవచనాలను ఎవరూ పట్టించుకోవడం లేదు.

జాషువా ఎంత బాగా వ్రాశాడనే ప్రశంసకాదు కావలసింది ఆయన ఏమి చెప్పాడు, మనలను ఏమి చేయమంటున్నాడు అనే తార్కిక బుద్ధికావాలి. అప్పుడే ఏ కవి మనోరథమైనా ముందుకు సాగేది.

## 26

జాషువా చిన్నప్పుడు దీపాల పిచ్చయ్యశాస్త్రితో కలిసి అవధానాలు నిర్వహించడానికి యత్నించిన సంఘటన మనకు తెలుసు. అందులో జాలువారిన హాస్యరసం గురించి కూడా తెలుసు. నా దీప సభ కావ్యం అచ్చయిన కొత్తలో శాస్త్రిగారు మద్రాసులోనూ ఆంధ్రప్రభ ఆఫీసుకు వచ్చారు. "మా ఇంటి పేరులో ఎన్ని దీపాలున్నాయో ఇంత కాలానికి మీ కావ్యం చూచి తెలుసుకున్నాను" అన్నారాయన.

శాస్త్రి గారి రచనలు నాకు బాగా నచ్చుతై. అయితే, అంతవరకూ పర్సనల్‌గా ఆయనను చూడలేదు. జాషువా గారిలాగే ఆయన కూడా చమత్కార సంభాషణాప్రియులు. దీప సభను చదివి మెచ్చుకొన్న తొలిసాహితీ వేత్త కూడా ఆయనే నేమో!

అవధానాలకు సిద్ధపడిన కవులు అశుధారా సిద్ధులయ్యే వుంటారు కదా! అందుకే జాషువా గారు తమ సాహితీ సభల్లో, సహృదయ మిత్ర గోష్ఠుల్లో తాజా విషయాలను వేడి వేడి పద్యాలలో చెబుతూ అలరించేవారు.

భారతీయ సంస్కృతిపట్ల, చరిత్ర పట్ల మంచి అవగాహనతో పాటు గొప్ప భక్తి తాత్పర్యాలున్నై జాషువా గారికి. తమ జాతీయత స్వాతంత్ర్యం రాక ముందు ఎంత శిథిలమైందో, వచ్చిన తర్వాత కూడా అదే శిథిలావస్థలో ఎలా కొట్టుమిట్టాడుతున్నదో యథాలాపంగా చెపుతున్నట్లే ఎంత నిశితంగా నిరూపించి చూపేవాడో మనకు ఆయన అనేక పద్యాలలో కనిపిస్తూ వుంటుంది. అందుకు ఎన్నో పద్యాలు ఉదాహరించవచ్చు.

తన గ్రామం వినుకొండను వర్ణిస్తూ చెప్పిన పద్యం ఇది

**ఊరికి తూర్పుగా నిలిచి**
**యున్న మసీ దొకనాడు నిత్య కే**
**ళీ రతులైన బాలురకు, అ**
**ళీక కళా కితవ ప్రజాళికిన్,**
**జారులకు ఆశ్రయం బయి ప్ర**
**శస్తికి నెక్కిన దమ్మ! దాని ప్రా**
**కారపు రాల్ మసీ దనిన,**
**కాదని చూపు శివాలయాంకముల్!**

ఈ విషాద దృశ్యం ఒక వినుకొండకే పరిమితమై లేదు. దేశం నిండా ఇవే. శిథిల దృశ్యాలు. చూచి ఏడ్వగల కళ్ళు కూడా లేవు, ఈనాటి స్వతంత్ర భారత రాజకీయ హితవులకు.

వందలు వేలు సంవత్సరాలుగా భారత జాతి అనుభవించిన కష్టాలను, నష్టాలను, అవమానాలను, అన్యాయాలను సరిదిద్దడానికే కదా అన్ని త్యాగాలను చేసి రాజకీయ స్వాతంత్ర్యాన్ని తెచ్చుకొన్నది! మరి ఆ స్వాతంత్ర్యం కాస్తా రాజకీయ దురోదరుల నోట్లోపడి శల్యావశిష్టమై పోతుంటే, చూస్తూ ఏ కవి ఊరుకోగలడు? కుక్షింభరులు, భయ భీతావహులు ఊరుకుంటూనే వున్నారు – జాషువా తప్ప.

వినుకొండ చేసుకొన్న పుణ్యమేమిటంటే, జాషువా వంటి వీర ధీర సాహసిక దేశభక్తుడు అక్కడ కవిగా పుట్టడం.

**చిరకాలమ్మును భిన్న జాతి మతముల్**
**జీవించు రాజ్యాన సు**
**స్థిరమై శాంతి రహించునన్న నుడి సం**
**దేహించెదన్, పక్షిణీ!**
**తురకల్ హైందవు లీ స్వరాజ్య రథమున్**
**దొర్లింతురే? దక్షిణో**
**త్తర దిగ్గంతులు రెండునున్ గలసి మే**
**తల్ మేయు తావున్నదే?**

ఏ భాషలో ఏ పేరుతో పిలువ బడినా, ఏ రూపంలో ఏ మందిరంలో నిలువబడినా, ఏ పద్ధతిలో ఆరాధించబడినా దేవుడు దేవుడే కదా! మరి, హిందూ దేవాలయాలు మసీదులుగా ఎందుకు మార్చబడినట్టు?

ఇదీ జాషువా ప్రశ్న.

జాతి వైరం తప్ప దైవభక్తి లేదు అట్టి చర్యలలో.

వెర్రివాడి పెళ్ళాం సామెత ననుసరించి, హిందువుల మంచితనం చేతగాని తనంగా అర్థం చేసుకొని ముస్లింలు జరిపిన హింసా కాండే తప్ప దేవాలయాలు మసీదులుగా మారడానికి దైవనిర్ణయంగాని, ముస్లిం దేవుడి బలాధిక్యత గాని కారణం కాజాలదు.

అట్టి సహజ శతృత్వ నైజం గల ముస్లింలూ, పాపభీతితో ఎలాంటి దౌర్జన్యాలనైనా సహించే దాసగుణం గల హిందువులూ కలిసి ఈ దేశంలో సహజీవనం చెయ్యగలరా?

ఇదీ జాషువా గారి సందేహం. ఈ శందేహాన్ని ఆయన ఎంత సూటిగా, స్పష్టంగా ప్రకటించాడో చూడండి.

ఏది పట్టించుకోని సామాన్య వోటరు కంటే, ఉద్యోగం చేసుకొని బ్రతికే విద్యావంతుడి కంటే, ప్రజల డబ్బుతో పెత్తనం చేసే నాయకుడి కంటే కూడా జాతిశ్రేయస్సును కోరే కవి ఎక్కువ మేధావీ, కాలజ్ఞానీ, మార్గదర్శీ అయి వుంటాడు

కదా? అట్టి వాడి మార్గదర్శకత్వమే ప్రజలకు ఉత్తమోత్తమంగా వుంటంది కదా? ఈ వాస్తవం లోక విదితమే కదా. అయినా, పట్టించుకొనే వాళ్ళే వుండడం లేదు.

కవులు కూడా ఎవరు విన్నా, వినకపోయినా తాము చెప్పదలచుకొన్నదేదో చెప్పుకుపోతూనే వున్నారు, ఆచరణకు ఉద్యమించడం లేదు.

చెప్పడం, చెయ్యడం సాధారణంగా ఒకే వ్యక్తికి సాధ్యం కావు. చెప్పడం సమాధి సంజనితం, చెయ్యడం ఉత్సాహోద్రేక క్రియావిక్రీడితం.

## 27

***భారత క్షోణి గల్గు దేవ స్థలములు***
***చెదరి గజనీ పురాన మసీదు లయ్యె;***
***ఇప్పటి మసీదు లేరూపమెత్తగలవొ***
***కాల మెరుగును, ధారుణీ గర్భ మెరుగు!***

జాషువాను నా అంచనాలో మహా కవిగా నిలిపింది ఫిరదౌసి కావ్యమైతే, నాకు ఆత్మీయుణ్ణి చేసింది ఈ పద్యం

జాతీయోద్యమ కాలంలో మొత్తం మీద తెలుగు మహా కవులందరూ తమ గతం గురించి గొప్పలు చెప్పుకొన్నారే తప్ప జాషువావలె వాస్తవాన్ని గుర్తింపజేసి, కర్తవ్య బోధచేసిన స్థిత ప్రజ్ఞులు ఎందరో లేరు. కవికి వుండవలసిన దైవజ్ఞత, ప్రజ్ఞానం పుష్కలంగా వున్న మహర్షి జాషువా.

చర్యకు ప్రతిచర్య ప్రకృతి సిద్ధం. మనం సుఖంగా వుండాలంటే పొరుగు వాళ్ళకు దుఃఖం కలిగించకూడదు.

పొరుగువాళ్ళ దేవుడిపై మనం రాళ్ళు విసిరితే, మన దేవుడిపై మరెవళ్ళో బాంబులు విసురుతారు.

జాషువాగారి ఆనాటి వాక్కును ఈనాడు మనం క్రియారూపంలో చూస్తున్నాం కదా! అంతటి భవిష్యత్ ద్రష్ట స్వతంత్ర భారత భారతీదర్బారులోనే కవిసార్వభౌముడు కావలసినవాడు, సొంత రాష్ట్రంలో చిన్న ఆస్థాన కవిగానే స్వీకరించబడలేదు!

ప్రతి మతమూ వేల సంవత్సరాల క్రితం ఊహించబడినట్టిదే. అప్పటి పరిస్థితుల కనుగుణంగా నెలకొల్పబడినట్టిదే. ఏ ప్రాంతంలో పుట్టిన ప్రజలు ఆ ప్రాంతానికే పరిమితమై సంకుచితంగా బ్రతుకుతున్నట్టివాళ్ళే. ఏ ప్రాంతంలో ఏ మతం పుట్టినా, అప్పటి ఆ ప్రజలను అనాగరికతనుంచి సంస్కరించి నాగరికులను చేపడమే లక్ష్యంగా పుట్టినట్టిది.

ఇప్పుడు ఆనాటి పరిస్థితులు పూర్తిగా మారిపోయినా, ప్రజల అవసరాలు, కోరికలు, పరస్పర సంబంధాలు కొత్త కొత్త చివుళ్ళు తొడిగినా, జీవిత విధానాలలో నాటికీ నేటికీ ఏ సంబంధమూ లేకపోయినా, మత సూత్రాలలో గానీ, మత విశ్వాసాలలో గానీ మార్పురాలేదు. అదే శిథిలావశేషాన్ని అవే శల్యావశేషాలు పట్టుకు వ్రేలాడుతున్నై.

ఈ ఒక్క పద్యంలోనూ జాషువా ఇంతటి మానవ పాతిత్యాన్ని నిక్షిప్తం చేసి చూపగలిగాడు.

ఒక దేవుడి భక్తులు మరొక దేవుడి భక్తుల్ని హింసిస్తూనే, దేవుడొక్కడేఅంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపులు జరుపుతారు. ఎవర్ని మోసగిస్తున్నారు? దేవుణ్ని ఒక రాజకీయ మాఫియా నియంతగా పెంచిందెవరు? అతడి దాసానుదాసులుగా బ్రతికే కిరాయి భక్తులే, ఆషాడభూతులే కదా?

## 28

నేను ఈ రచన సాగిస్తున్న సమయంలో ఒక ఉదయం మహాకవి, పద్మ విభూషణ కాళోజీ మా ఇంటికి వచ్చారు. అయిన ఆ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా మా ఇంటికి వచ్చి మా ఆవిడ చేతి కాఫీ తాగి (ఉంటే ఇడ్లీ కూడా తిని) వెళుతుంటారు.

ఈ రచన వ్రాతప్రతి బయట వరండాలో టేబులు మీద వుంది. అప్పటికి నేనింకా నిద్ర లేవలేదు. కనుక, ఆ వ్రాత ప్రతి పేజీలు తిరగవేస్తూ కూర్చున్నాడు. అందులో ఆయన కంటపడ్డ ఒక విషయం ఆ తర్వాత మా సంభాషణకు ప్రాతిపదిక అయింది.

"రెండు విరుద్ధ విషయాలను మెచ్చుకుంటూ ఒకే ఒక వేదిక మీద మాట్లాడడం సాధ్యమా?" అన్నాడాయన, నన్ను చూడగానే.

"సాధ్యమే" అన్నాను నేను. ఆయన మనసులో వున్న విషయమేమిటో తెలియదు. అయినా, ప్రశ్న సార్వత్రిక స్వభావం కలది కనుక నా జవాబు కూడా సార్వత్రికంగానే వుంది.

"ఎలా సాధ్యం?"

"గులాబీ పువ్వూ, వేప పువ్వూ రెండూ విరుద్ధ రుచులు గలపువ్వులు" మరి

నా సమాధానం ఆయన్ని చకితుణ్ణి చేసింది. మా ఇద్దరిదీ చిరకాల స్నేహం. చాలా ఆత్మీయులం. తరచు ఒక వస్తువును రెండు దృక్కోణాల నుంచి చూస్తూ వాదించుకోవడం మాకు అలవాటే.

ఆయన సూటిగా విషయంలోకి వాచ్చడు. హేళనగా మాట్లాడేటప్పుడు 'తమరు' అనడం ఆయనకు అలవాటు.

"తమరు జాషువాకూ, విశ్వనాథకూ కూడా ఆత్మీయులేనా?" అన్నాడు. "చాలా బాగా" అన్నాను నేను. "ఆ ఇద్దరూ బద్ధ విరోధులు కదా" అన్నాడు. "కావచ్చు." అన్నాను నేను, "వాళ్ళ వ్యక్తిగత రాగ ద్వేషాలతో నాకు సంబంధం లేదు. ఆ ఇద్దరిలోనూ కవిత్వం వుంది. అది నాకు ఆనందం కలిగిస్తుంది."

నా వాదాన్ని రెండు ఉదాహరణలలో వివరించాను. ఒక కవి తన కావ్యానికి ఒక కూలివాడ్ని నాయకుడిగా చేసుకొని ఆ వర్గం వాళ్ళ జీవిత సుఖదుఃఖాలను మనోహరంగా వర్ణిస్తాడు. మరొకకవి ఒక భూస్వామిని నాయకుడిగా తీసికొని ఉన్నత జీవిత పురోగతిని కావ్యీకరిస్తాడు. ఇద్దరూ తమ కావ్యాలలో అపూర్వ రస భావ సౌందర్యాలను ఆవిష్కరించినప్పుడు ఇద్దరూ ప్రశంసనీయులే కదా!

వృత్తులు, హోదాలు, క్రియా క్షేత్రాలు వేరు వేరు కావచ్చు. మానవుడు ఒక్కడే, స్వభావం ఒక్కటే. సుఖ దుఃఖాలు, ప్రేమానురాగాలు, ఆశాభిలాషలు అన్నీ ఒక్కటే. మానవుడు ఏ పరిస్థితిలో వుంటే ఆ పరిస్థితికి అనుగుణంగా ప్రవర్తిస్తాడు. మానవులు చాలామంది. కవులూ చాలా మందే. వర్ణనలూ చాలా విధాలు. ప్రతి కవీ తనకు తెలిసిన మానవుడ్నే తన కావ్యనిర్మాణానికి కేంద్రంగా స్వీకరించడం సహజం. అందుకే కవిత్వం ఎక్కడవున్నా నేను మెచ్చుకుంటాను. అందుకే జాషువా, విశ్వనాథా కూడా నాకు ఆత్మీయులు.

ఉపదేశాత్మక కావ్యాలు వ్రాసినప్పుడు కార్మికుడి గురించి వ్రాసిన కవి అతడి అభ్యుదయానికీ, భూస్వామి గురించి వ్రాసినప్పుడు అతడి ఉదాత్తగుణపరివ్యాప్తికీ రసవంతమైన పరిభాషలో సలహాలు చెప్పాలి. అట్టి ప్రతిభాపాండిత్యాలు గల కవుల కృతులనే మన పూర్వ లాక్షణికులు మూడు స్థాయిలలో పేర్కొన్నారు. ప్రభు సమ్మితాలని, మిత్ర సమ్మితాలని, కాంతా సమ్మితాలని. అందులో ఏకవి అయినా నాకు అభినందనీయుడే, ఆత్మీయుడే.

నేను నిరాకరించేది వర్గకవుల్ని. ఒక వర్గపక్షం వహించి మరొక వర్గం మీదకు రెచ్చగొట్టడం రాజకీయమౌతుంది, సాహిత్యంకాదు. సాహిత్యం భోజనం లాంటిది, దానిని తుపాకీ మందుగా వాడకూడదు.

భోజనం అన్నాను కదా! దానికి సంబంధించిన మరొక ఉదాహరణ చెపుతాను. తల్లీ తండ్రీ, నలుగురు కొడుకులూ గల కుటుంబంలో అందరికీ సరిపడే భోజనం తయారు చేస్తుంది తల్లి. తండ్రి వ్యవసాయదారుడు. పెద్ద కొడుకు కాంగ్రెస్‌వాడు. రెండవ కొడుకు ఒక పోలీసు ఆఫీసరు. మూడవ వాడు నక్సలైటు, బేఫికరు విద్యార్థి నాల్గవవాడు.

ఈ అందరికీ మంచి భోజనం తయారై వుంటుంది. నలుగురికీ నాలుగు రకాల భోజనం కాదు. ఒకే తల్లి ఒకే విధమైన పదార్థాలతో కుటుంబ యోగ క్షేమాల దృష్టితో తయారు చేసిన పుష్టికరమైన భోజనం. భోక్తలు భోజనం నుంచి ఆశించేది పుష్టిని. వ్యవసాయదారుడు నాగలినో, కాంగ్రెస్‌వాడు అశోక చక్రాన్నో, నక్సలైటు ఏకే నలభై ఏడునో, పోలీసాఫీసరు పదోన్నతినో కాదు – కేవలం పుష్టిని మాత్రమే. వాళ్ళందరూ భోజనానికి ఒకే సమయంలో కూడా రారు. పరస్పర విరుద్ధమైన వృత్తులలో, కార్యకలాపాలలో వున్నవాళ్లు. అయినా, వాళ్ళు తినేది ఒకే భోజనం, వడ్డించేది ఒకే తల్లి, పొందేదీ ఒకే జీవశక్తిని.

నేను వివరించాను – ఆ తల్లే కవి. ఆ భోజనమే నవరసాత్మకమైన కవిత్వం. అది అందరికీ పుష్టినీ, తుష్టినీ ఇస్తుంది. జీవిత మాధుర్యాన్ని రుచి చూపుతుంది. వారి వారి ఇష్టకార్యకలాపాలకు ఉత్సాహం సమకూరుస్తుంది.

జాషువా గానీ, విశ్వనాథగానీ వర్గ కవులు కాదు. జాషువాను హరిజన

వర్గానికో, విశ్వనాథను బ్రాహ్మణ వర్గానికో ప్రతినిధులనడం న్యాయం కాదు. వాళ్ళు తమ కావ్య నిర్మాణానికి తమకు బాగా పరిచయమైన వర్గాలనుంచి, పరిసరాల నుంచి వస్తువును ఎంచుకోవచ్చు. సృష్టిలోని ప్రతి వస్తువూ ఏదో ఒక వర్గానికి చెంది వుంటుంది కదా. వర్గ కవి కవికాదు. వర్గ పోరాటం పోరాటం కాదు.

**(కాళోజీ ఆలోచనలో పడ్డాడు)**

## 29

జాషువా, విశ్వనాథ ఆనాడు సాహితీ రంగంలో ప్రతిస్పర్థులు. ఇద్దరూ ఒక వేదికపై వున్నప్పుడు గాలి వాటాన్ని బట్టి ఒకరు హీరోగా రాణిస్తే, రెండవవారు విలన్‌గా మారిపోతారు. అందులో కుల మత ప్రసక్తి ఏమీ వుండదు.

ఇక్కడ విశ్వనాథను గురించి ఒక మాట చెప్పాలి. ఆయన కవిత్వం మొదలు పెట్టిన తొలి రోజులలో ఆధునిక (భావ) కవుల విమర్శలకు లోనై కొంత మనోవ్యథ అనుభవించాడు. క్రమంగా ఎదిగి తనను హేళన చేసిన వర్గంపై ప్రతీకార చర్యకు పూనుకున్నాడు.

దానితో సూటిగా, ఘాటుగా మాట్లాడడం అలవాటయింది. సంప్రదాయవాది కనుక, లౌక్యుడు కాదు కనుక, అభ్యుదయ వాదుల మనుకునే వాళ్ళ దుష్ప్రచారానికి గురి అయ్యాడు.

అంతే తప్ప, నిజానికి విశ్వనాథ కులతత్వ ఛాందసుడు కాదు.

జాషువాను ఆయన తనకు ప్రత్యర్థిగానే భావించేవాడు. అసూయ ప్రదర్శించే వాడు.

హరిజన, హరిజన క్రైస్తవ వర్గాలకు చెందిన కవులెందరినో ఆయన ప్రోత్సహించిన ఉదంతాలు నాకు తెలుసు. అప్పటికే మంచి కవులుగా ప్రసిద్ధులైన గద్దల జోసెఫ్, బీర్నీడి ప్రసన్న, జ్ఞానానంద కవి అందులో కొందరు. బీర్నీడి ప్రసన్న తన 'పృథ్వీ భారతం' విశ్వనాథకే అంకితం ఇచ్చాడు. అంకిత సభ హైదరాబాదులోనే జరిగింది ఎంతో వైభవంగా.

ఆంధ్ర యూనివర్సిటీవారు జాషువాకు కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేటును ప్రదానం చేసినప్పుడు, సెనేటు మెంబరుగా నేను అక్కడే వున్నాను. కాన్వొకేషన్లో

ఆయన వెనకే కూర్చున్నాను. డాక్టరేటు ప్రదానానికి ముందూ, వెనకా కూడా ఆయనను అభినందించిన వాళ్ళలో చివరివాడ్నీ, మొదటివాడ్నీ కూడా నేనే. అప్పటికి ఆయన చాలా అస్వస్థులుగా వున్నట్లు జ్ఞాపకం.

భారత ప్రభుత్వం జాషువాకు, విశ్వనాథకు పద్మభూషణ బిరుదం ఒకే సారి ఇచ్చింది. వార్త విన్న వెంటనే, తనకు సహజమైన ఉద్వేగంతో విశ్వనాథ అన్నాడట, "ఏమయ్యా, గాడిదనూ, గుర్రాన్నీ ఒకే రాట కట్టేసారు!" అని.

ఉద్వేగమూ, ఉద్రేకమూ కామక్రోధాదులతో చేరినప్పుడు వివేకాన్నీ, విచక్షణనూ పోగొడతాయి. అట్టి స్థితి క్షణికమే కావచ్చు. కాని, ఆ క్షణంలో జరిగే ధ్వంసం మాత్రం తిరుగులేనంతగా వుంటుంది.

విశ్వనాథ అలా అన్నాడని జాషువాకు తెలిసినప్పుడు, జాషువా అన్నాడట, "ఇప్పటికైనా సత్యాన్ని గుర్తించినందుకు విశ్వనాథను మెచ్చుకోవాలి" అని!

ఆ తర్వాత కొద్ది రోజులకు ఒక సాహిత్య సభ కోసం విశ్వనాథ హైదరాబాదు వచ్చాడు. ఆ సభలో మాట్లాడుతూ ఆయన ఈ ఉదంతం చెప్పి, నిర్వేదంగా ముఖంపెట్టి అన్నాడు, "ఆ విధంగా నేను గాడిద నయ్యాను" అని సభ నిండా చప్పట్ల వర్షం కురిసింది.

నిజమే! జాషువా ఎలాగూ గుర్రమే కదా!

ఈ ఉదంతాన్ని విశ్వనాథ బహిరంగ సభలో చెప్పకోవలసిన అవసరం లేదు. కానీ చెప్పుకుంటాడు. అదీ ఆయనలోని వైలక్షణ్యం. ఆ సభలోవున్న నేను విశ్వనాథను అభినందించాను.

ఇటు జాషువాకు, అటు విశ్వనాథకు కూడా నేను సన్నిహితమిత్రుడ్నే. ఇద్దరూ నన్ను సమానంగానే అభిమానించేవాళ్ళు. ఇలాంటి తమాషాలను చూస్తూ ఆనందిస్తూ వుండేవాడ్ని తరచు.

ఇద్దరూ సంప్రదాయవాదులే. భావకవుల్ని హేళన చేస్తూ కూడా, తమ వంతు భావ కవిత్వం వ్రాసినవాళ్ళే.

భావ కవిత్వం అంటే ఎవరో ఊరూ పేరూ తెలియని ప్రియురాలి కోసం

కన్నీరు మున్నీరుగా ఏడవడం మాత్రమే కాదు కదా! ఎన్నో వినూత్న భావాలను రమ్యపదాలంకారాలలో మనోరంజకంగా ఆవిష్కరించిన వారు భావకవులలో వున్నారు. జాషువా, విశ్వనాథల రచనలలో కూడా అలాంటి రస మానసాలు చాలా వున్నై.

హైదరాబాదు వచ్చినప్పుడల్లా జాషువా మా ఆఫీసుకి వచ్చి కబుర్లు చెబుతూ వుండేవాడు కదా! అలాంటి సందర్భంలో ఒకసారి ఆయన –

*"ఇమ్మాడ్కి ప్రణయ మధుర ర*
*సమ్ముం జవి జూపి, నిన్ను సాధించుచు, బల్*
*గమ్మత్తు చేయు ఎవరా*
*అమ్మాయి, వచింప రాదటయ్యా మాతో?"*

అంటూ ఈ పద్యం చదివాడు. ఇదీ భావకవులను ఆక్షేపిస్తూ చదివిన పద్యం.

తర్వాత చర్చ భావకవిత్వం మీదకు పోయింది. వాళ్ళమీద ఆంగ్ల కవుల ప్రభావం ఎక్కువ. అయితే, వాళ్ళ ప్రియురాళ్ళు కూడా అందరూ అజ్ఞాత వ్యక్తులే కాదు కదా!

• కావ్యానికి వస్తువును ప్రపంచంలో ఎక్కడి నుంచైనా తీసుకోవచ్చు. అయితే, అదే గొప్పదంటూ మన మన సాంప్రదాయక వస్తువును నిరసించకూడదు. భావ కవులలో కొందరూ, అభ్యుదయ కవులలో అందరూ చేసిన పొరపాటు అదే.

## 30

"మీరు కులాతీతులు, మతాతీతులు, మానవాతీతులు అనేది కూడా పూర్తిగా వాస్తవమే. అందుకు మీ రచనలే పరమ సాక్ష్యాలు, ఎంతగా ఎన్నిటికి అతీతంగా వున్నప్పటికీ సెంటిమెంటు అనేది మానవుడికి సహజం కదా! అసలు సెంటిమెంటే మానవ జీవితంలోని వ్యక్తిత్వం. ఒక వ్యక్తికీ మరొక వ్యక్తికీ తేడా సెంటిమెంటే. అందుకే ఈ ప్రశ్న వేస్తున్నాను.

"మీది హిందూ మతాన్ని వదిలేసిన క్రైస్తవమతం. మీరు బైబిలును కూడా బాగా చదివే వుండాలి. కవిత్వానికి చక్కగా సరిపోయే కథలు, సన్నివేశాలు, రసవంతమైన ఘట్టాలు బైబిలులో ఎన్నో వున్నాయి కదా! అందులో నుంచి కాకుండా,

మీ రచనలకు వస్తువును ఎక్కువగా హిందూ మత చింతనా సరళినుంచే తీసుకుంటారెందుకు. గబ్బిల రాయబారం శివుడికి కాకుండా పరలోక ప్రభువైన ఏ యెహోవాకో పంపించివుంటే బాగుండేది కదా!"

చిరునవ్వు నవ్వుతూ, మీసాలు దువ్వుకొంటూ చాలాక్లుప్తంగా జవాబిచ్చాడు ఆయన :

"నేను చిన్నప్పుడు మేరీ మాతను గురించి పద్యాలు వ్రాశాను. వాటిని తెలుగు బాగా వచ్చిన పాస్టర్ గారికి చూపించాను. పద్యాలు బాగున్నాయని మెచ్చుకున్నాడు ఆయన. ఎంత బాగున్నాయంటే కాళీ మాతను గురించి ఒక బ్రాహ్మణకవి వ్రాసినంత బాగున్నాయన్నాడు!

"నా పద్యాలలో మేరీమాతను వర్ణిస్తూ వాడిన పదాలలో 'చంద్రవదనా', 'పద్మ దళాయతాక్షి' వంటి మాటలున్నై. వాటిని పెన్సిలుతో కొట్టివేశాడాయన. అటువంటి పదాలు మేరీ మాతపట్ల వాడకూడదన్నాడు. ఇంకా ఏదేదో అన్నాడు - నాకు మత పవిత్రతను బోధిస్తున్న ధోరణిలో.

"నాకు మతిపోయినంత పనయ్యింది, ఆ రాత్రి అంతా బాగా ఆలోచించాను. కవిత్వాన్ని వదులుకోవడమా, మతాన్ని వదులుకోవడమా అనే మీమాంసలో పడ్డాను. క్రైస్తవ కవి బైబిలును దాటి వెళ్ళకూడదు, మహమ్మదీయ కవి ఖురానును దాటి వెళ్ళకూడదు. ఏ మతమూ తన సమకాలీన సుఖసౌందర్యాలను గుర్తించదు. పైగా వాటి అనుభూతి పాపకారణం అంటుంది. మరి ఆయా మతాలలో సుప్రసిద్ధులైన కవులు చాలామందే వున్నారు కదా అంటే, వాళ్ళందరూ మత శాసనాలను ధిక్కరించిన వాళ్ళే. ఎవరి తాత్త్విక దృష్టిని వారు ప్రదర్శించిన వాళ్ళే. తనవంటి, షేక్స్పియర్ వంటి వాళ్ళకు అంతరాత్మలే వుండవన్నాడు బెర్నార్డ్ షా.

"ఏ కవీ తన కవిత్వాన్ని మతపరంగా చెప్పడు, మతాతీతంగానే చెప్తాడు. కనుక, మరీ మత మూఢులైన అజ్ఞానులను ధైర్యంగా ధిక్కరించగల హేతువాదియైన కవి మతాన్నీ వదులుకోనక్కర లేదు, కవిత్వాన్నీ వదులుకోనక్కరలేదు.

"ఏ మతంలో కంటే కూడా హిందూమతంలో స్వేచ్ఛ ఎక్కువ. దేవుడున్నాడన్నా హిందూమతమే, లేడన్నా హిందూమతమే. గుడికి వెళ్ళినా హిందువుడే, వెళ్ళకపోయినా

హిందువుడే. దుర్గాదేవిని లోకమాతగా భక్తి ప్రపత్తులతో వర్ణించవచ్చు, మహేశ్వరుడి ప్రియురాలిగా శృంగారాది రసాలకు నాయికనూ చెయ్యవచ్చు" అంటూ చెప్పుకుపోయాడాయన.

పర్యవసానం ఏమిటంటే - జాషువా మతాతీతుడిగా మహా రచనలు చెయ్యగలగడం. ఆ తర్వాత మళ్ళీ తాను క్రైస్తవ మతాత్మకమైన ఏ వస్తువునూ తన రచనలకు ఇతివృత్తంగా స్వీకరించలేదు.

అయితే, జాషువా కవితా ప్రస్థానం మూడు పద్యాలూ ఆరు కావ్యాలుగా సాగిపోతూవుంటే, క్రైస్తవులు చూస్తూ ఊరుకోలేదు. వారిలో అభ్యుదయ వాదులు తమ వాడని ఆయన చుట్టూ చేరుతూ వుంటే, మత ఛాందసులు అంతటి వాడిని తాము వాడుకోలేకపోతున్నామే అనే నిర్వేదంలో పడ్డారు.

జాషువా ఆర్థిక ఇబ్బందులలో సతమతమౌతూ వుండడం, క్రైస్తవ మత పెద్దలలో ఏ విధంగానైనా ఆయన చేత ఒక క్రైస్తవ కావ్యాన్ని వ్రాయించాలనే పట్టుదల పెరగడం - రెండూ కలిసి 'క్రీస్తు చరిత్ర' కావ్య నిర్మాణానికి కారణం అయినై.

బైబిలులోని న్యూటెస్ట్‌మెంటును యథాతథంగా పద్య కావ్యంగా అనువదించాడు జాషువా. మత పెద్దలు పెట్టిన షరతులన్నింటికీ ఆయన అంగీకరించడం, ఆయన ఎప్పుడు ఎంత డబ్బు అడిగితే అంతా వాళ్ళు ఆయనకు ఇస్తూ వుండడం - ఇదీ ఆ కావ్య నిర్మాణానికి పునాది అయ్యింది. మొత్తం మీద సంస్కృతం నుంచి మహాభారతం వలె, ఇంగ్లీషు నుంచి క్రీస్తు చరిత్ర తెలుగులో ఒక మహా కావ్యంగా అవతరించడం జరిగింది.

మానవతా గుణం గల ఏ మానవుడికైనా ఏ మతమైనా ఒకటే. అంటరాని తనం ఒక్కహిందూ మతంలోనే వుండడం వల్ల, ఒక అంటరాని వాడి దీనగాథను దేవుడితో చెప్పుకోవాలనుకోవడం వల్ల, అట్టి దేవుడు హిందూ మతంలోని వాడే అయి వుండడం సముచితం. అందుకే జాషువా అరుంధతీసుతుడి దీన చరిత్రను గబ్బిలం ద్వారా సన్నిహితదేవుడైన శివుడికి పంపించాడు; అపూర్వ కావ్య కళా సుందర క్షేత్రాన్ని నిర్మించాడు.

అంతటి మహనీయ మూర్తి జాషువాకు తొలి దశలో కులతత్వ పండితులు చేసిన అగౌరవాలు చాలానే వున్నై. అలాంటి అవమానాలు భరిస్తూ ఒకసారి ఆయన ఒక రాజుగారి సందర్శనానికి వెళ్ళినపుడు ఇలా చెప్పుకొన్నాడు.

*"నా కవితా వధూటి వద*
*నమ్ము నెగా దిగ జూచి, రూపు రే*
*ఖా కమనీయ సంపదను*
*గాంచి, భళాభళి అన్నవాడె, మీ*
*దే కుల మన్న ప్రశ్న వెల*
*యించి, చివాలున లేచిపోవుచో*
*బాకున గ్రుమ్మినట్లగును*
*పార్థివ చంద్ర! వచింప సిగ్గగున్!"*

నలుగురు సాహితీ మిత్రులు ఎప్పుడు ఎక్కడ కలుసుకొన్నా జాషువా ప్రసక్తి రాకుండా వుండదు. అదంతా ఆ కాలంలో ఎక్కువగా ఈ పద్యం చుట్టూ తిరుగుతూ వుండేది.

జాషువాగారి స్వీయ కవితా గోష్ఠులు కూడా ఈ పద్యం లేకుండా జరిగేవి కావు. అలాంటి గోష్ఠులలో ఆయన మరీ వ్యక్తిగతమైన అనుభవాలను చెప్పి నవ్వించేవాడు. అందులో కొన్ని మరీ అశ్లీలంగానో, అవాచ్యంగానో, ఆవేశపరిచేవిగావో వుండేవి. అందులో చాటువులుగా వుండే వాటిని గురించి చెప్పుకోవచ్చుగాని, మరీ అపోహలను కలిగించే వాటిని మాత్రం వదిలేస్తున్నా.

మేం కొద్ది మందిమి మాత్రమే వున్న ఒక గోష్ఠిలో ఆయన ఈ పద్యం చదివినపుడు, నేను అన్నాను "ఆ పద్యం నేనే వ్రాసి వుంటే, చివరి చరణం ఇలా వుండేది.

*"బాకున గ్రుమ్మబుద్ధగును*
*పార్థివ చంద్ర! మనస్సు మండెడిన్!"*

అందుకు జాషువాగారు మీసం మీదచెయ్యి వేసుకొంటూ అన్నారు, "అలా నేనూఅనగలను. మదమ త్రిప్పని ఆంధ్ర వీరుడను నేను. అయితే ప్రయోజనమేమి? బాధ కలిగినప్పుడు దానిని మనమే మౌనంగా అనుభవించడం మంచిది. మనం అఫెన్సుకు దిగితే, దాని ప్రతిచర్యను ఎదుర్కొనడానికి సిద్ధమై వుండాలి. అందుకు తగిన శక్తియుక్తులు ఇప్పుడు మనకు లేవు."

"ఎప్పుడు వస్తై?"

ఆ ప్రశ్న వేసింది మోదుకూరి జాన్సన్. మోదుకూరి నాతోనే వుండేవాడు ఆ రోజుల్లో. అతనికి జవాబు నేనే చెప్పాను!

"ఎప్పుడో వస్తై. అప్పటివరకూ మనం సత్యాగ్రహులమే"

ఈ మోదుకూరి జాన్సన్ మంచి గాయకుడు. జాషువాగారి పద్యాలూ, నా పాటలూ శ్రావ్యంగా పాడేవాడు. విస్కీ అతిగా తాగడం, తాగి కక్కుకోవడం వాల్తేరులో తన నాటకాల గురువైన కె.వి. గోపాలస్వామిగారి దగ్గరే నేర్చుకున్నాడు.

అక్కడనుంచి నేను మోదుకూరిని హైదరాబాదుకి తెచ్చి మా ఆఫీసులో ఉద్యోగం ఇచ్చాను. నటుడిగా, గాయకుడిగా, సాహసోద్రేకాల సారంగా, సాహిత్య సమావేశాల ఆర్గనైజరుగా, మా సుఖేలా నికేతన్ సాంస్కృతిక సంస్థకు డైరెక్టరుగా నాకు మంచి ఆత్మీయుడైనాడు.

భూషి రామదాసు, బొజ్జా తారకం, ఎస్వీ రమణారావు వంటి యువకులతో కలిసి సుఖేలానికేతన్ తరఫున నేనే దామోదరం సంజీవయ్యగారికి అంకితమిచ్చిన 'పైరుపాట' గేయ నాటకను పద్మరాణి, లక్ష్మి, జయశ్రీ ఆర్టిస్టులుగా ప్రదర్శింపజేసినవాడు ఈ మోదుకూరి.

తర్వాత సినిమాలలో చేరి బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రసిద్ధి కెక్కాడు. తెనాలి దగ్గర కొలకలూరులోని ఒక మాదిగ క్రైస్తవ కుటుంబానికి చెందిన వాడాయన.

'మాలమాదిగ యువకుల్లారా, ఏకం కండి' అనే పిలుపుతో నేను 'ధర్మం కోసం పోరాటం' వ్రాస్తున్న కాలంలోనే అక్కడ వీరింట్లోకొన్నాళ్ళుండి, అక్కడి మాల మాదిగ సమస్యలను పరిశీలించి వచ్చాను. మాల మాదిగ కులాలు రెండింటికీ కలిపి 'మామ్మాలు' అని నామకరణం చేశాను. ఈ పేరును మెచ్చుకొని బాగా ప్రచారం చేసిన వాళ్ళలో అగ్రగణ్యుడు మోదుకూరి.

జాషువా గారు హైదరాబాదు వచ్చినప్పుడల్లా ఆయన గోష్ఠులలో పాల్గొనే ప్రథమ శ్రోతను నేనైతే, రెండవ శ్రోత మోదుకూరి జాన్సన్.

## 32

జాషువా గారిని ప్రాణ సమానంగా ఆదరించి, గౌరవించి, సన్మానించి, ఆర్థిక పుష్టిని కలిగించి, ఆయన సాహిత్య వ్యవసాయం నిరంతరాయంగా సాగిపోవడానికి అన్ని విధాల తోడ్పడిన ఉదార చరిత్రులు చాలా మందే వున్నారు. అన్ని కులాల వారూ వున్నారు.

అందులో నాకు తెలిసిన, జ్ఞాపకం వున్న పేర్లు మాత్రం బహుకొద్ది. ఏకా ఆంజనేయులుగారు, అడ్వకేటు మాలకొండారెడ్డిగారు, తిక్కవరపు రామిరెడ్డిగారు, కాసు బ్రహ్మానందరెడ్డిగారు, ప్రత్తిపాటి సుబ్రహ్మణ్యంగారు.

అంటరానితనాన్ని ప్రతిఘటించి, నిమ్న కులాల హక్కుల కోసం తరతరాలుగా పోరాడుతూ వచ్చిన ప్రముఖ మాల మాదిగ కుటుంబాలలో ప్రత్తి పాటి కుటుంబం ఒకటి. కృష్ణాజిల్లా బందరు వాస్తవ్యులైన మాలలు వీరు. పంచమ, మాలమాదిగ, ఆది ఆంధ్ర, నిమ్న జాతి వగైరా పేర్లతో పిలువబడే ఈ దళిత కులాల అభివృద్ధికి జరిగే కృషికి ఆనాడు బందరు ఒక కేంద్రంగా వుండేది.

సుబ్రహ్మణ్యంగారు ఉన్నతాధికార పదవిలో వున్న ఇంజనీరు, ఔదార్య గుణ సంపన్నమైన అరిస్టోక్రటిక్ మనస్తత్వం కలవాడు. భోగి, అహంకారి, అధికార దర్పం, కార్యనిర్వహణ దక్షత, పలుకుబడి, పరపతి కూడా కలవాడు, స్కాచ్ తప్ప తాగడు. ఆయన ఎక్కడవుంటే అక్కడ అదొక రాజ దర్బారే అనిపించేది.

అట్టి సుబ్రహ్మణ్యంగారు జాషువాకు పరమభక్తుడు.

ఆయన ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ అయితే అక్కడికిజాషువాను ఆహ్వానించి, కవితోత్సవం జరిపి, వెయ్యిన్నూట పదహార్లతో సన్మానించేవాడు. జాషువా కూడాభక్తుడి వెంట భగవంతుడిలా ఆయన ఎక్కడికి పిలిస్తే అక్కడకు వెళుతూవుండేవాడు. అట్టి సన్మానాలు కొన్నిటిలో నేను కూడా పాల్గొనడం జరిగింది.

సుబ్రహ్మణ్యంగారు నల్గొండలో ఇంజనీరు<sup></sup>గా వున్నప్పుడు అక్కడికి జాషువాను పిలిచారు. హైదరాబాదు నుంచి నన్ను కూడా సపరివారంగా రమ్మన్నారు. అందుకు ఒక జీపు ఏర్పాటు చేశారు.

నాతో పాటు నల్గొండ వెళ్ళిన వాళ్ళలో ప్రముఖ కాంగ్రెస్ విదుషీమణి ఎల్లాప్రగడ సీతాకుమారి, అప్పటికి తెలుగు ఎమ్.ఎ. పాసయి రిసెర్చ్ చేస్తున్న మా అమ్మాయి విజయభారతి, మిత్రుడు మోదుకూరి జాన్సన్ ముఖ్యులు.

అది గొప్ప సాహిత్య సభ, వెయ్యిన్నూట పదహారు రూపాయి నాణాలను వెండి పళ్ళెంలో పోసి, నూతన వస్త్రాభరణ చందన తాంబూలాది సమస్త మర్యాదలతోనూ జాషువాను సత్కరించారు ఆయన.

అక్కడికి ఎందుకు వచ్చారోగాని, బి.ఎన్. మూర్తిగారు కూడా పాల్గొన్నారు. సభలో ఎంతోమంది కవి పండితులూ, నాతోపాటు వచ్చిన ముగ్గురూ కూడా నూతన వస్త్రాలతో సన్మానిచబడ్డారు. సంగీత సాహిత్యాలతో నల్లగొండ తెల్లబడిపోయిందంటే అతిశయోక్తి కాదు.

భరద్వాజ విందును గుర్తుచేసే డిన్నరు తర్వాత, మళ్ళీ జాషువా గారి కావ్యగానం. మహారథి కర్ణ పద్యాలంటే సుబ్రహ్మణ్యం గారికి మహా మక్కువ.

## 33

ముమ్మిడివరం బాలయోగి యోగంలో కూర్చొన్న తొలి రోజులలో, ఆయన గురించి నేనొక నాటకం వ్రాశాను. దానిని శాసన సభ్యులు ఈలి వాడపల్లిగారికి అంకితం ఇవ్వాలనుకొన్నాను.

యోగంలో కూర్చొన్న కటికదల సుబ్బారావుకు బాలయోగి అని పేరు పెట్టినవాడు వాడపల్లిగారే. అక్కడ బాలయోగి తపస్సుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించినవాడు కూడా వాడపల్లిగారే. అందుకే ఆ నాటకాన్ని ఆయనకు అంకిత మివ్వాలనుకొన్నాను.

బాలయోగిని నేనెప్పుడూ చూడలేదు. ఆ ప్రాంతం మాత్రం నాకు సుపరిచితం. బాలయోగి అయినా మహాయోగే కనుక, అతడి గురించి వ్రాసిన

నాటకాన్ని అంకితం తీసుకునే అర్హత ఒక మహర్షి అయిన వాడికే వుంటుంది. కనుక, అంకితానికి ముందు వాడపల్లి గారికి 'మహర్షి' బిరుదం ఇవ్వాలనుకొన్నాను. ఆయన అందుకు అర్హుడే.

అయితే, ఒక హరిజన నాయకుడికి మహర్షి బిరుదం ఇవ్వాలంటే ఆ ఇచ్చేవాడు ఎంతటివాడై వుండాలి. సంకల్పమూ, క్రియా నాకే అయినా, ఒక సుప్రసిద్ధ మేధావి చేతుల మీదుగా ఆ బిరుదును అందచేయడం సముచితం. అలా ఆలోచించి నేను అందుకు జాషువా గారిని ఎన్నుకొన్నాను.

1964లో సభను కాకినాడలో పెట్టడానికి జొన్నల మోహనరావు గారు సిద్ధపడ్డారు. అప్పటికి ఆయన కాకినాడ మునిసిపాలిటీ కమీషనరు, నాకు చిరకాల మిత్రుడూ, రచయితా కూడా. తన పెద్ద కుమార్తె వివాహం. కొత్తగా కట్టుకున్న సొంత ఇంట్లో ప్రవేశం పెట్టుకొని, అదే ముహూర్తంలో ఈ సభను కూడా జరపాలనుకొన్నాడు ఆయన.

సభకు అధ్యక్షులు జాషువాగారు, జాషువా గారిని తీసుకురావడమంటే, అదొక బ్రహ్మాయత్నం. చాలా ఖర్చుతో కూడిన పని. నేనే పేదవాడ్ని కనుక ఆ కార్యక్రమాన్ని ప్రత్తిపాటి సుబ్రహ్మణ్యం గారికి అప్పగించాను. అప్పటికి ఆయన కాకినాడలో ఇంజనీరు.

కాకినాడ మున్సిపల్ కమీషనరు, ఇంజనీరు కలిసి పూనుకొంటే ఏ పని మాత్రం జరగదు. ప్రభుత్వ గెస్టుహౌసులో మాకు విడిది. జాషువా గారితో ఎడతెగని గోష్ఠి. అంకిత సభ మహావైభవంగా జరిగింది. జాషువా గారు అధ్యక్షులు, వాడపల్లి గారికి మహర్షి బిరుదు ప్రదానం చేస్తూ, అక్కడ హాజరైవున్న కాకినాడ కవి పండితుల సంతకాలతో చేసిన తీర్మానాన్ని జాషువాగారు చదివి వినిపించి, వాడపల్లి గారికి అందచేశారు. పూలమాలలకు, నూతన వస్త్రాలకు లెక్కేలేదు. మోహనరావుగారి, సుబ్రహ్మణ్యంగారి సమష్టి కార్యనిర్వహణ దక్షత అద్వితీయంగా వెలుగొందిన సందర్భం అది.

మహర్షి బిరుద ప్రదానం తర్వాత బాలయోగి నాటకాన్ని అంకిత మిచ్చాను నేను.

ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలు మా ఆవిడ హైమవతి వ్రాసిన పాలేరు నుంచి పద్మ శ్రీ వరకు అనే గ్రంథంలో వున్నై. చూడవచ్చు.

అయితే ఏదో సామెత చెప్పినట్లు, వాడపల్లిగారి కిచ్చిన మహర్షి బిరుదు విలువను అక్కడి వారెవరూ గుర్తించలేదు. వాడపల్లి గారు కూడా దానిని వాడుకోలేదు. ఆయన మేనల్లుడు, వాల్మీకి ఆశ్రమ నిర్వాహకుడు అయిన దండంగి అప్పారావు గారొక్కరే మన వాళ్ళ అవజ్ఞతకు బాధపడుతూ వుండేవారు.

ఆ సభ మరునాడు, కాకినాడ రేచర్లపేటలో జాషువా గారికి ఒక గొప్ప సన్మానోత్సవం ఏర్పాటు చేయబడింది. రేచర్ల పేట పూర్తిగా మాలపేట. పట్టణం మధ్యంలో విశాలంగా, విద్యావంతంగా వుండే పేట అది. పచ్చిపాలరామస్వామి వంటి నాయకులూ, కె.ఎస్. ఆర్. మూర్తి, ఐ.ఎ.ఎస్. వంటి ఉన్నతాధికారులూ ఆ పేట నుంచి వచ్చినవారే. అక్కడ మళ్ళీ వెయ్యిన్నూటపదహార్లతో సన్మానం. ఆ కాలంలో వెయ్యి రూపాయలంటే ఇప్పుడు లక్ష రూపాయలకు సమానం అనే వాస్తవాన్ని గుర్తుంచుకుంటే, జాషువా సన్మానాల విలువను మనం సిసలుగా అంచనా వేయగలుగుతాం.

## 34

కాకినాడలోని పిఠాపురం మహారాజా వారి కాలేజీలో విద్యార్థులచే ప్రతి సంవత్సరం ఆంధ్ర సాంస్కృతిక వారోత్సవాలు నిర్వహించబడుతున్న కాలమది.

చిరకాలంగా నాకు చాలా సన్నిహితుడిగా వుంటున్న బయ్యా సుబ్బారావు అనే యువకుడు కాలేజీ విద్యార్థి సంఘానికి ఎన్నుకోబడి, ఆ సంవత్సరం ఉత్సవాలను ఘనంగా చెయ్యాలనే నిశ్చయానికి వచ్చాడు. సుబ్బారావు నాకు దగ్గర బంధువు. బావమరిది వరసవాడు. సంస్కృతం రెండవ భాషగా చదివి కొంత పాండిత్యం సంపాదించినవాడు. మంచి ఉత్సాహి, సాహసి, కార్య నిర్వహణలో నేర్పరి, పట్టుదల గలవాడు.

ఉత్సవాల నిర్వహణలో లేఖల ద్వారా నా సలహాలు తీసుకొనేవాడు. అప్పటికి మద్రాసులో వుంటున్న నన్ను కూడా ఆ సభలకు ఆహ్వానించాడు.

వారం రోజుల పాటు జరిగే సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలవి. ఆ సంవత్సరం దేశంలోని అగ్రశ్రేణి కవి పండితులంతా ఆ ఉత్సవాలకు ఆహ్వానించబడ్డారు.

ఒక రోజు సాయంకాలం కవి సమ్మేళన కార్యక్రమం కాబోలు, మొత్తం కాకినాడ సాహితీ లోకమంతా అక్కడ హాజరై వుంది. తెలుగు కవిత్వాన్ని వినడానికి అంత జనమా! అంత ఉత్సాహమా! ఏడీ సుబ్బారావు?

వేదిక మీద అధ్యక్ష స్థానంలో ఆసీనులై వున్నవారు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు. ఆయన కిరువైపులా విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, త్రిపురనేని రామస్వామిచౌదరి, రాయప్రోలు సుబ్బారావు, అడవి బాపిరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి వగైరా.

అధ్యక్షవాణి "నాలుగు మోములన్ సరస నాదము లుప్పతిలన్" తాండవించగా పుట్టిన ప్రచండ వాతూలం రొదతో సభ అల్లకల్లోలం కాగా, జాషువాగారు లేచి నిలబడ్డారు - తుఫాను అనంతరం చంద్రోదయంలా.

చంద్రోదయంతో తుఫాను చల్లారిందంటే ఇంకా బాగుంటుందనుకుంటాను. సభ నీరవ నిస్తంద్రమై శ్రవణానందానుభూతికి సిద్ధమైంది.

ఇక, మీసం దువ్వుకొంటూ జాషువాగారు చేసిన కవితా గానం సభలోని వేలాది హృదయాలను అమృత పూర్ణ కుంభాలు చేసి పొంగు లెత్తించగా, వేదిక మీదున్న కొందరిలో గాడి పొయ్యిల్ని రగిలించింది. విశ్వనాథ వారు ఆ తర్వాత కవితా గానానికి లేచారు. లేస్తూనే

"జాషువా అచ్చం కోకిల" అన్నారు.

జాషువా గారికి కోపం వచ్చింది. లేచి నిలబడ్డారు. "ఈ జాతికి ఇక బుద్ధిరాదు" వేదిక దిగి వెళ్ళిపోయారు.

కొంపలంటుకొన్నంత పనయ్యింది. సభ యావత్తూ లేచిపోయింది. జాషువా వెంటపడింది. కేకలు, అరుపులు, విశ్వనాథకు వ్యతిరేకంగా నినాదాలు.

మొత్తం సభంతా జాషువా చుట్టూ చేరింది. త్రిపురనేని వారు కూడా దిగి వచ్చి జాషువాతో చేరారు. ఆ గందరగోళం మధ్యలో కార్యదర్శి సుబ్బారావు అప్పుడు

ఊడిపడి, నా చేయి పట్టుకొన్నాడు. కృష్ణశాస్త్రి గారిని పిలుచుకురమ్మన్నాను. అప్పటికే శాస్త్రి గారు జాషువాగారి చేతులు పట్టుకొని ఏదో అంటున్నారు.

తర్వాత కొంతసేపటికి అధ్యక్షుల వారి అభ్యర్థనా, విశ్వనాథవారి క్షమార్పణతో పరిస్థితి చక్కబడి, జాషువాగారు తిరిగి వేదికమీదకు వచ్చారు.

ఇదీ ఆ కాలంలో జాషువాగారి ప్రాభవం, పలుకుబడి, ఇంతకూ, ఆయనకు అంతకోపం ఎందుకు వచ్చినట్టు?

"కోకిల నల్లగా వున్నందుకు!"

## 35

మాల మాదిగల కష్టసుఖాలను కవితా వస్తువుగా స్వీకరించడం జాషువాకు సహజం. అందులోనూ ఆయన పాటించే ఔచిత్యం అద్వితీయం. సందేశం పంపడానికి మహిళా గబ్బిలాన్ని ఎంచుకోవడంతో పాటు, కష్టాలు తీర్చే దైవంగా శివుణ్ని గుర్తించడం నిజంగా విశ్వజన కవి చక్రవర్తి ఒక్క జాషువాకే సాధ్యం.

హరిశ్చంద్ర నాటకంలోని కాటి సీనులో జాషువాగారి పద్యాలు విన్నప్పుడు ఆడియన్సు ఆనందతాండవం చేస్తారంటే జాషువా ఎంత ధన్యుడో ఊహించవచ్చు.

ఒక సుందర కళా క్షేత్రంగా తన శ్మశానవాటికను తీర్చిదిద్ది, పరమేశ్వరుడికే బహూకరించిన కవి పరమేశ్వరుడు జాషువా.

ఇక్కడ నా కనిపిస్తుందీ–

జాషువాగారి శ్మశానవాటికనే ప్రత్యేకంగా ఒక ఏక పాత్రా దృశ్యరూపకంగా ఎందుకు ప్రదర్శించకూడదు? ఎంతో మందికి చెప్పాను. ఎవరూ వినిపించుకోలేదు.

అలాగే జాషువాగారి గబ్బిలం, క్రీస్తు చరిత్ర, ఫిరదౌసివంటి కావ్యాలను, కొన్ని కొన్ని ఖండ కావ్యాలను పద్య రూపకాలుగా ప్రదర్శించవచ్చు. వేదిక మీద రాగ రమణీయంగా పాడడానికి ఇంతకంటే ఆధునికమైన మంచి పద్యాలు లేవు. మరి, అందుకు ఎవరూ ఎందుకు పూనుకోరో?

జాషువా మెమోరియల్ సంఘాలూ, ట్రస్టులూ, ఫౌండేషన్లూ ఎన్నో

నెలకొల్పబడుతూ వున్నై. అవి కూడా తమ స్వప్రయోజనాల కోసం జాషువా పేరును వాడుకొంటున్నాయే గాని, ఆయన సాహిత్యానికి వివిధ కళారూపాలను కల్పించి ప్రజల ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నం చెయ్యడం లేదు.

అట్టి సంస్థల వాళ్ళు ముందుగా తాము జాషువా దృక్పథాన్ని అలవరచుకోవలసి వుంది. ఆయనలోని విశ్వనరుడ్ని గుర్తించి విశాల హృదయాలతో జాషువాను విశ్వకవిగా ఆవిష్కరించవలసి వుంది.

## 36

జాషువాగారు ఆంధ్ర సాహిత్య అకాడెమీలోనూ, విధాన పరిషత్తులోనూ సభ్యులుగా వున్న కాలంలో హైదరాబాదుకు వచ్చినప్పుడల్లా మా ఆఫీసుకి వచ్చి కూర్చునే వారు కదా! నేను అప్పుడు రాష్ట్రప్రభుత్వ అనువాద శాఖకు డైరెక్టరుగా వుండేవాడిని.

'యత్ర జాషువా తత్ర సరస్వతీ' అనే విధంగా ఆయన వచ్చినప్పుడల్లా మా ఆఫీసు సరస్వతీ విలాసంగా మారిపోతూ వుండేది. అలాంటి ఒక సందర్భంలో నా గురించి ఒక పద్యం చెప్పాడాయన.

*తళుకుల్ బెళ్కులు గల్గు మేల్ తెలుగు శ*
*బ్ద శ్రేణితో, కావ్య భూ*
*షలు సృష్టించి, విరించి బిత్తరి కటా*
*క్ష శ్రీల నార్జించి, కా*
*గలవాడై నుతి కెక్కు భీమన కవిన్*
*గన్నట్టి శ్రీవేగి మం*
*దల మే రీతి బహూకరించునొ ప్రతి*
*ష్ఠా వాహ మెక్కించుచున్!*

1960 ప్రాంతంలో, నా పైరు పాటను సంగీత నృత్య రూపకంగా ప్రదర్శించుతూ సుఖేలా నికేతన్ వారు వెలువరించిన సన్మాన సంచికలో ఈ పద్యం ప్రచురించబడింది.

విశ్వకవి జాషువా గారి శ్రీవాణీ నుంచి రెండు శ్రీ అక్షర మధు చషకాలను

తెచ్చి నా కవితా సరస్వతికి ప్రసాదించిన ఆశీః స్వర్ణపళ్ళెరం కదా ఈ మత్తేభ వాహన!

కొన్ని కొన్ని సార్లు జాషువా గారి కూడా ఆయన కుమారుడు వచ్చే వాడు. ఆయన పద్యాలు రాగయుక్తంగా పాడేవాడు.

## 37

నేను మా నగరం సంతలో తెనాలి రామలింగడి కథలు, కాళిదాసు కథలు కొనుక్కొని ఎంతో ఆసక్తితో చదివే వాడ్ని. ఆయా రాజుల ఆస్థానాలలోని చాలామంది కవులు వారి వారి కవిత్వాలలో తప్పులెంచుకుంటూ, పరస్పరం నిందించుకుంటూ, ఆక్షేపించుకుంటూ వుండేవాళ్ళు. కులం పేరుతో కూడా తిట్టుకునే వాళ్ళు.

**'సీపర పాపర తీగెల**
**చేపల బుట్టల్లి నట్లు చెప్పెడి నీ ఈ**
**కాపు కవిత్వం బిల మా**
**బాపన చెవులకు వినంగ ప్రమదం బిడునే?'**

అంటూ ఈసడించాడు తెనాలి రామకృష్ణుడు ఒక సందర్భంలో భట్టుమూర్తిని.

ఆ కాలంలోనే కాదు, ఏ కాలంలోనూ అంతటి సంగీత సాహిత్య మనోజ్ఞమైన ప్రబంధం వెలువడలేదన్న కీర్తి గడించిన వసుచరిత్రనే కాపు కవిత్వమని నిందిస్తే, ఇక నిందలకు విలువేముంది? అందుకే ఇతరుల నిందాస్తుతులను లెక్కచెయ్యడం మానేశాను నేను మొదటి నుంచీ కూడా.

నేను కాకినాడ లైబ్రరీలో పాత భారతులు, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు తిరగవేస్తూన్నప్పుడు అందులో కనిపించినై జాషువాగారి పద్యాలు. రామరాజ భూషణుడి మీద ఆయన వ్రాసిన మూడు పద్యాలలో ఇదొకటి.

కాపు కవిత్వ మెవ్వనికి
కమ్మదన మ్మగునంచు నెన్నియో
లోపము లెన్ని, నిన్ను సభ
లో అవమానము చేయు లింగనిన్
కోపము చేయ, కింక నను

కొమ్మని, చక్కదనంపు కబ్బపుం
గాపులు కాసి పోయితివి
గా కవితా దివిజ ద్రుమమ్మునన్!

కాపు కవిత్వం, బ్రాహ్మణ కవిత్వం అని వుంటుందా, కులాహంకార బధిరాంధతా మదం కాకపోతే! (వ్యాస వాల్మీకులూ, ఆంజనేయ కాళికాసులూ ఏ కులాల వాళ్ళో ఎపుడైనా ఆలోచించారా అట్టి పండితులు?

ఆ పాత సంచికలలోనే జాషువాగారి ఏక పద్య కవితలు చాలా కనిపించినై. అందులో ఒకటి.

సరదాగా భుజశక్తిమై ఎపుడొ ఈ
క్ష్మా నామకం బైన బొం
గరమున్ ద్రిప్పితి, వీ పరిభ్రమణ వే
గం బింత చల్లారినన్
జరుగ న్నేర్చునె లోక వృత్తము మహే
శా! అప్పుడే రీతిగా
నొరగున్ పర్యవసాన మే మగు నటం
చూహింతు నున్మాదినై!

కవి, పిచ్చివాడు, ప్రేమికుడు ఉన్మత్తులై ప్రవర్తిస్తారనే లోకోక్తికి ఈ పద్యం ఒక అద్దం కదా. భావుకతకు కూడా ఇది శిఖరాయమానం.

## 38

పండిత మండలీ మధుర
భావ వనీ! రసమూర్తి! పండితా
ఖండల భీమ మిత్ర! కల
కంఠము నిండిన నీదు వాక్కులో
పండెను తెల్గు ఖండములు,
వాములు వాములు నవ్య భావనో

*ద్దండ కవిత్వ భాగ్య ప్రమ*
*దంపు తళత్తళ కావ్యరాజముల్!*

ఒకసారి ఎవరో ఒక కవిగారు మా ఆఫీసుకి వచ్చి ఈ పద్యం ఆశువుగా చదివారు. పూర్వకాలపు రాజాస్థానాల వాతావరణం సృష్టించిన ఆ సన్నివేశం నన్నెంతో అలరించింది.

ఆయనే ఆ తర్వాత నాకు మంచి మిత్రులైన గద్దల జోసెఫ్ కవిగారు.

ఆనాటి నుంచీ ఆయన హైదరాబాదు వచ్చినప్పుడల్లా నన్ను కలుసుకుంటూ వుండేవారు.

ఆయనదీ గుంటూరు ప్రాంతమే. మంచి ప్రౌఢ కవి. చాలా కావ్యాలు వ్రాశారు. ఆయన సంపన్నుడట. ఆయన గృహం సదా రాజాస్థానంలా కవిపండిత గోష్ఠులతో కలకలలాడుతూ వుండేదట. కవి పండితులను పోషిస్తూ, సన్మానిస్తూ ఆనందించే ధీరోదాత్త కవి జోసెఫ్ గారని ఆయన వెంట వుండే మిత్రులు చెప్పారు నాకు. తమ ఊరికి నన్ను ఎన్నో సార్లు ఆహ్వానించారు గాని, నేను వెళ్ళడం జరగలేదు. నిజానికి నేనెక్కడికీ వెళ్ళేవాడినికాదు.

జోసెఫ్ కవిగారు విశ్వనాథవారికి సన్నిహితులు, హితులు. జాషువా గారితో స్నేహం లేకపోవడానికి అదొక కారణం కావచ్చు. వారిద్దరూ ఏక కాలంలో నావద్దకు వచ్చిన సందర్భాలున్నై. అలాంటప్పుడు మళ్ళీ వస్తానంటూ జోసెఫ్ కవిగారు లేచి వెళ్ళిపోతూ వుండేవారు.

విశ్వనాథవారి అసూయ ఒక్క జాషువాగారి పట్లనే. ఎంతో మంది హరిజన క్రైస్తవ కవులతో విశ్వనాథ కలిసి మెలిసి వుండేవాడు, కావ్య చర్చలు చేసేవాడు.

## 39

*వీరయకు లింగమాంబకు*
*గారాల సుతుండ, కవిని, గంధ గజముపై*
*ఊరేగి చరణమున పెం*
*డారమును ధరించినాడ నలుగురు మెచ్చన్!*

జాషువా తన ఆత్మకథను పద్యాలలో వ్రాయడం ప్రారంభించినప్పుడు నేనొక చిన్న సలహా చెప్పాను. ఏ కవి అయినా తానే తన గురించి చెప్పు కోవడం కంటే, మరొక సహృదయుడు చెప్పడం మంచిదేమో అని. తర్వాత నేనెంతో సంతృప్తి చెందాను, ఆయన వ్రాసుకున్న పద్యాలను వింటున్నప్పుడు.

ఇతర అన్ని ఆత్మకథల కంటే జాషువా గారి ఆత్మకథ సరస రమణీయమూ, చారిత్రక కావ్యమూ.

తానుగా మతం మారినవాడు కాదు జాషువా. తల్లిదండ్రులు లింగమ్మా వీరయ్యలు క్రైస్తవులు కనుక, తాను క్రైస్తవుడిగానే పుట్టినవాడు.

క్రైస్తవం కూడా మాలమాదిగ కులాలుగా విడిపోయి వుండడం వల్లా, జాషువా మా వాడంటే మా వాడని ఆ ఇరు కులాలూ క్లెయిమ్ చెయ్యడం వల్లా ఆయన కొంత ఇబ్బందిలో పడ్డాడు. అట్టి సందిగ్ధ స్థితిని తొలగించడానికో అన్నట్టు ఈ పద్యంలో తన తండ్రి కులాన్ని సూచించాడాయన.

**తానము నంది, క్రైస్తవ మ**
**తంబున జేరి, కులంబు గోత్రమున్**
**మానిన వెర్రిగొల్లడ; వ**
**మాయక మూర్తివి; కాని, తండ్రి! ఇ**
**ట్లేనుగు నెక్కు పుత్రుని, క**
**వీశుని పుట్టువు గుట్టెరుంగు వి**
**జ్ఞానివి నీవు, నీదు చర**
**ణమ్ములకున్ కవితా నమస్కృతుల్!**

వెర్రి గొల్లడు అంటే అమాయకుడు అని అర్థం. ఇది కులాన్ని సూచించే మాట కాదు; గుణాన్ని సూచించే మాట. 'ఆ బ్రాహ్మడు, వట్టి వెర్రిగొల్లడు' అనవచ్చు.

గొల్ల శబ్దానికి వెర్రిని చేర్చడంద్వారా వ్యంగ్యాన్ని సృష్టించి, తన ప్రయోజనాన్ని సాధించుకొన్న చతురమతి జాషువా, తన తండ్రిగారు గొల్లకులం వాడని చెప్పకుండానే చెప్పివేశాడు.

సృష్టి యావత్తు బీజ ప్రధానమే. క్షేత్రం నిమిత్తమాత్రం. ఒక్క హిందూ సంఘమే కుల వ్యవస్థను కల్పించుకుని ధర్మ విరుద్ధంగా ప్రవర్తిస్తూ వుంది.

ఆ తోటలోని విత్తనం ఈ తోటలో పడకుండా కంచెలు ఆపగలవా? ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటిమీద వాలగూడదంటే కాకి వింటుందా? జీవస్వభావాన్ని నియంత్రించడానికి స్మృతికర్తలు చేసిన వ్యర్థ ప్రయత్నమే ఆనాటి నాలుగు వర్ణాలూ ఈనాటికి వందలు వేలు కులాలుగా చిట్లిపోవడానికి హేతువయింది.

తండ్రి ఏ కులంవాడో సంతానం ఆ కులానికి చెందడం ధర్మం. ఎక్కువ తక్కువ కులాలతో కుళ్ళి చస్తున్న హైందవంలో మాత్రం తల్లిదండ్రులలో ఎవరిది తక్కువకులమో సంతానం ఆ కులానికి చెందడం జరుగుతున్నది.

తల్లి బ్రాహ్మణ, తండ్రి మాదిగ అయినప్పుడు సంతానం మాదిగలే అవుతారు. అది ధర్మసమ్మతం, కాని తల్లి మాదిగ, తండ్రి బ్రాహ్మణ అయినప్పుడు కూడా సంతానం మాదిగలుగానే పరిగణించబడుతున్నారు కదా! ఎందుకని?

హైందవ కులతత్వ భ్రష్టత్వం అంటే అదే మరి!

# 40

"జాతో వ్యాసస్తు కైవర్త్యాః
శ్వపాక్యాస్తు పరాశరః"

వ్యాసుడు ఒక పల్లె పిల్లకొడుకనీ, అతని తండ్రి పరాశరుడు ఒకమాల మాదిగ పిల్ల కొడుకనీ వ్యాసుడే తన గోత్రాలను మహాభారత కావ్యంలో చెప్పుకున్నాడు. తమ కులగోత్రాలను గురించి లోకం ఊహాపోహలు చెయ్యకుండా పూర్వఋషులు ఆ విధంగా తమను గురించిన సత్యాలను చెప్పుకునే వారు. అట్టి సత్యాలకు కూడా పేడ పూసేస్తున్నా రీనాటి కవి పుంగవులూ, సినీ వృషభులూ, మతాచార్యదురంధరులూ.

మరొక తమాషా ఏమిటంటే–

యాదవులూ, కౌరవులూ (పాండవ ధార్తరాష్ట్రులు) బంధువులు. కౌరవులు వ్యాసుడి సంతానం. వ్యాసుడు అరుంధతీయుడు. అరుంధతీయులు అంటే మాలలూ, మాదిగలూ కలిసిన చండాలురు. అంటే మొట్టమొదట వెలివేయబడిన చండ దేవుడి (మతంగుడి) సంతానం.

"వ్యాస మునిచంద్రు గన్న పరాశరుండు
మాల దానికి పుట్టి బ్రహర్షియయ్యె"

అంటూ మంగిపూడి వెంకటశర్మగారు పేర్కొన్నారు కదా? శర్మగారు తన నిరుద్ధ భారత గ్రంథంలో చెప్పిన విషయాలన్నీ ఎంతో పాండిత్యంతో, పరిశోధనతో, పరమజ్ఞతతో చెప్పిన చారిత్రక సత్యాలే.

కాళిదాసు మహాకవి యాదవుడు. గొల్లవాడు. కవి కాకముందు ఆయన కూడా వెర్రి గొల్లడే. జాషువా తండ్రి వీరయ్యగారు వెర్రిగొల్లడు. అయితే, వీరయ్యగారు తాను కవి కాకపోయినా, తన కుమారుడు మహాకవి అయ్యి కాలికి గండపెండేరం అలంకరించబడి, ఏనుగునెక్కి ఊరేగుతుంటే ఆ మహావైభవాన్ని కన్నులార చూచి ఆనందించే అదృష్టం కల్గిన సుకృతి.

తండ్రి ఆనందం చూచి తాను సాక్షాత్తూ ఆనంద బ్రహ్మ అయ్యాడు జాషువా.

నా సన్మానము కన్నులార గని ఆ
నందించు నీ జన్మమున్,
నీ సంతాన విభూతి, మెచ్చుకొనుచున్
నీ మూర్తికిన్, ఠీవి కిన్
దాసోహమ్మని అంజలింపదె కవీం
ద్ర శ్రేణి! ఏ గొల్లవా
డే సూక్రీస్తుని భక్తుడందుకొనె దం
డ్రీ! ఇట్టిమర్యాదలన్?

తన తండ్రి గొల్ల అనీ, క్రీస్తు భక్తుడనీ నిర్ద్వంద్వంగా ప్రకటించాడు జాషువా ఈ పద్యంలో.

తాను నూలువాడో, తోలువాడో కాదనీ, అందరికీ చెందినవాడనీ, వ్యర్థ స్పర్థలతో జాతి సంఘటిత శక్తిని భగ్న పరుచుకోవద్దనీ మాల మాదిగ కులాల వారికి బోధించాడు.

క్రైస్తవంలో కులాలు లేవు. హైందవంలో కులాలు తప్ప మానవులు లేరు.

కులాలు అంటు వ్యాధులు. అంటు వ్యాధుల ఆసుపత్రి హైందవం. అక్కడ నుంచి ఏ రోగి ఎక్కడికి వెళ్ళినా, చివరకు స్వర్గానికి వెళ్ళినా అక్కడంతా ఆ వ్యాధి వ్యాపిస్తుంది.

తన అనంతరం తనను మాలలో, మాదిగలో సొంతం చేసుకొని, తనను విశ్వమానవతా పవిత్ర పీఠం నుంచి క్రిందకు లాగి, ఏ మురికి బస్తీ సందులోకో ఈడ్చి పారేస్తారేమో అనే భయం జాషువాగారికుంది. అందుకే తన తండ్రి గొల్ల అనీ, ఏసుక్రీస్తు భక్తుడనీ స్పష్టంగా చెప్పాడాయన.

అయితే, తాను మాత్రం మాల మాదిగలతోనే మమేకం చెంది, వాళ్ళకష్టసుఖాలలో పాలు పంచుకొంటూ, వాళ్ళ నిమ్నత్వ, దళితత్వ, దైన్య దారిద్ర్యాలను తొలగించడానికి తన సాహితీ కళా కృషి సమస్తమూ ధారపోసిన మహనీయుడు జాషువా.

తన ఆదర్శాలను చెక్కు చెదరకుండా ముందుకు తీసుకుపోవడానికి నడుం బిగించిన ఆదర్శ వీర మహిళ తన కుమార్తె హేమలతా లవణం.

ఇక్కడొక చిన్న వివరణ చెప్పాలి–

*పంచములలోన మాదిగవాడ నేను*
*పంచమీయులలో మాలవా డతండు*
*ఉభయులము క్రైస్తవ మతాన ఒదిగినాము*
*సోదరత గిట్టుబాటు కాలేదు మాకు.*

జాషువా తమ వాడని మాదిగలు క్లెయిమ్ చెయ్యడానికి ఈ పద్యం కూడా ఒక కారణం కావచ్చు. కానీ, "నేను మాదిగవాడను, అతను మాలవాడు" అని జాషువా చెప్పినప్పుడు, దానిని వ్యక్తిగతంగా తీసుకోకూడదు. స్వపరభేదాలు సూచిస్తూ చెప్పిన సార్వత్రిక వాచకం అది. తల్లినిబట్టి ఆయనను మాదిగ అంటున్నారనుకోవచ్చు. అయితే, సంతానానికి తల్లికులంచెప్పడం శాస్త్రీయం కాదు; తండ్రి కులమే చెప్పుకోవాలి కదా?

## 41

విద్యార్థి దశ నుంచి నాకొక పద్యం నోటికి వచ్చి నోట్లోనే ఆడుతూ వుంది నేటికీ. దానిని జాషువా గారు గాని, ధర్మన్న గారు గాని, జగన్నాథం గారు గానీ వ్రాసి వుండాలనుకొన్నాను. దాని కర్తృత్వం నేటికీ తెలియలేదు.

**ఎవరైనను మమ్ముల మీ**
**రెవరని ప్రశ్నింతురేని ఏమందుము? మా**
**నవు లమె కామందుమ? ఈ**
**యవనికె బానిసల మందుమా? ధర్మమతీ!**

ఎవరు? ఏ కులం?

ఈ ప్రశ్నలకు ఈ దేశంలో జవాబులు చెప్పక తప్పదు ఎవరికీ. ఏ మతం అనేది కూడా అంత ముఖ్యం కాదు. హిందువులకు ఏ మతమైనా ఒకటే. ఏ కులం అనేదే ముఖ్యం. హిందూ మతం అంటే కులవ్యవస్థే కనుక, ఎవరిదైనా ఏ కులమో తెలియాలి.

పంచమ కులం వాళ్ళను మీరెవరు అని అడిగినప్పుడు ఏమని చెప్పాలి? వీళ్ళు నిజంగా హిందువులే అయినా, చాతుర్వర్ణ్య వ్యవస్థలోకి రారు కదా? ఆచరణలో మొత్తం హిందూ సవర్ణులచే నిరాకరించబడివున్న అవర్ణులుకదా?

మీరెవరూ అంటే మాల, మాదిగ, పంచమ, ఆది ఆంధ్ర, నిమ్న, అంత్య–ఇలాంటి పేరేదో చెప్పాలి. ఏ పేరైనా హేయ దృష్టితో చూడబడుతున్నదే. క్రైస్తవులు కూడా మినహాయింపు కాదు?

జగన్నాథం గారు అన్నాను కదా! నేరేడుమల్లి జగన్నాథం గారు మామిడికుదురు లేబర్ స్కూల్లో టీచరు. నేను ఒకటి. రెండు తరగతులు అక్కడే చదివాను. మూడు చదువుతూ నగరం మిడిల్ స్కూల్లో ఫోర్త్ క్లాసులో చేరాను. సలహా జగన్నాథం గారిదే.

ఆయన పగలు లేబర్ స్కూల్లో పనిచేస్తూ రాత్రి వయోజన విద్యాకేంద్రం నడిపేవారు. దానిని రాత్రిబడి అనేవాళ్ళు. ఊళ్లోవాళ్లు ఎవరైనా సరే వచ్చి అక్షరాలు నేర్చుకోవడం, చిన్న చిన్న పుస్తకాలు చదవడం చేసేవాళ్లు. వాళ్లు కోరినప్పుడు ఆయన కథలు చెప్పేవాడు. పురాణాలు చదివి విన్పించే వాడు. హరికథలు చెప్పేవాడు.

తాను సొంతంగా పాటలూ, పద్యాలూ వ్రాసి పాడేవాడు. గొప్పపండితుడు, అన్ని శాస్త్రాలూ చదవుకొన్నవాడు. వేదాంత విద్యలో మా అయ్య పల్లయ్యగారికి ప్రధాన శిష్యుడు.

ఆ రోజుల్లో నేరేడుమల్లి, కుసుమ, బయ్యా, బోయ, ఉంద్రు, సరెళ్ళ, పాముల, బళ్ళ, భూపతి వంటి కుటుంబాల వాళ్ళందరూ బంధువులే, న్యాయం పట్ల ఎంతటి పెద్ద మనుషులో అన్యాయం పట్ల అంతటి భయంకరులు.

అంటరానితనాన్ని ఒక ఆచారంగా సహించినా, దాని కారణంగా ఏదైనా అన్యాయమో, అవమానమో జరిగితే మాత్రం ప్రళయం సృష్టించే వాళ్లు.

ఆ కాలంలో ఈ ప్రశ్న అస్పృశ్యకులాల వాళ్ళందరూ వేసుకొంటూన్నదే. 'సంభవామి యుగేయుగే' అని వాగ్దానం చేసిన భగవంతుడు ఏ రూపంలో అయినా పలకరించి, తమ ఈ నీచమైన పేర్లను రద్దుచేసి, గౌరవ ప్రదమైన ఒక మంచిపేరు పెట్టి, తమను కనీస మానవ స్థాయికైనా ఉద్ధరిస్తాడేమోనని ఎదురు చేస్తున్నవాళ్లే. జాషువా గారు కూడా అదే స్థితిలో పడి ఒక పద్యం చెప్పారు.

## 42

**హరిజనులని ఇప్పటి వలె**
**సరుదుకొనుట కుపకరించుసాధన మింకన్**
**భరత పిత పంచిపెట్టని**
**కరకు దినము లవ్వి నిఖిల క్రైస్తవ తతికిన్!**

అప్పటికి అస్పృశ్య కులాలకున్న పేర్లన్నీ ఇతరులచే హేయంగా చూడబడుతున్నట్టివే. ఆ పేర్లతో పిలువబడుతూ సభ్య సమాజంలో సమాన గౌరవ మర్యాదలను పొందే ఆశ, అవకాశం ఎవరికీ లేదు. అందుకే చదువూ, సంపదా, సభ్యతా వరిస్తున్న ఆ కులాల యువకులు పూర్వపు పేర్లతో పిలువ బడడాన్ని అసహ్యించుకునే స్థితికి ఎదిగారు.

అయితే ఈ కులాల అభ్యుదయం కోసం ఎందరునాయకులు ఎన్ని ముఖాలుగా కృషి చేసినా, వాళ్ళ ఈ అంతర్మధనాన్ని ఎవరూ గుర్తించలేదు. గుర్తించినవాడు ఒక్క గాంధీజీయే.

ఇక్కడ పోతన్నగారి గజేంద్ర మోక్షంలోని ఒక పద్యం గుర్తుకు రావడం సహజం.

విశ్వమయతలేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు లడ్డుపడక,
విశ్వమయుడు విభుడు, విష్ణుండు, జిష్ణుండు
భక్తవరున కడ్డు పడ దలంచె.

గజేంద్రుడి మొరను చాలామంది దేవుళ్ళు విన్నారట. అయితే, వాళ్ళకు విశ్వవ్యాపకత్వం లేకపోవడం వల్ల ఏమీ చెయ్యలేక ఊరుకున్నారు. విశ్వమయత్వం కల విష్ణువు మాత్రం వెంటనే సహాయం చెయ్యడానికి పూనుకున్నాడు.

అప్పటి భారత జాతీయ నాయకులందరూ చిల్లర దేవుళ్ళలాంటి వాళ్లు, వర్గ నాయకులు, కులనాయకులు, మత నాయకులు, ప్రాంతీయ భాషా నాయకులు. యావద్భారత జననాయకుడు ఒక్క గాంధీజీయే.

అందుకే అస్పృశ్య కులాల వాళ్ళ ఆకాంక్ష ఆయన ప్రజ్ఞానాన్ని స్పృశించగలిగింది. దానికి ప్రతిస్పందిస్తూ వాళ్ళ కులాలన్నింటినీ కలిపి ఒకే పేరుతో. హరిజనులు అన్నాడాయన.

హరి అంటే హిందూ ముక్కోటి దేవతలకూ ఆదిదేవుడైన భగవంతుడు ఈశ్వరుడు, పరబ్రహ్మ, పరమాత్మ. సవర్ణ హిందులచే అమానుషంగా బహిష్కరించబడిన ఈ దీనులందరూ నిజానికి భగవంతుడికి ప్రియమైనవాళ్ళే అనే అర్థంలో ఆ పేరు పెట్టాడు గాంధీజీ.

జాషువా గాంధీజీని ప్రశంసిస్తూ గబ్బిలంలో ఇలా అంటాడు:

మరచితి నాది దేవుని స
మానుడు, బుద్ధుని యంతవాడు, భా
సుర దరహాస చంద్రికల
శుభ్రత లోన గలట్టివాడు, అ
ద్దొరలకు కాదు వారి చెవి
దూరిన వారిని లక్ష్యపెట్ట, ద
ప్పరమ మునిన్, సబర్మతి ని
వాసిని చూచితివే? తపస్వినీ!

అట్టి గాంధీజీని "అది దేవుని సమానుడు, బుద్ధుని యంతవాడు, పరమ ముని" అంటూ శ్లాఘించడంలో చారిత్రక సత్యాన్నే అలంకారంగా వాడాడు జాషువా.

అస్పృశ్య కులాలలో ఎంతో ఉపశమనం. ఉత్తేజం, ఉజ్జీవం కలిగించిన పేరు హరిజనులు అనేది; జాతీయంగా, అంతర్జాతీయంగా క్షణాలలో ప్రచారమయిందీ, ప్రభాతమయిందీ, చెరగని ముద్ర వేసిందీ.

ఇంతకూ ఈ హరిజన అనే మాట గాంధీజీ సొంతంగా కల్పించిందికాదు. భక్త సర్సే మెహతా అనే గుజరాతీ కవి తన ఒక కవితలో వాడిన పదం అది; జాషువా వంటి అగ్రశ్రేణి కవి ప్రశంసకు పాత్రమైన పేరయిందది.

హరిజన అనే పేరును కొందరు దళితులు నిరాకరిస్తున్నారంటే అందుకు కారణం దళిత రాజకీయాలు మాత్రమే.

దళితుల అజ్ఞానాన్ని, అవిద్యను తమ ప్రాచీనతను గురించి సవ్యంగా ఆలోచింపలేని బలహీనతను ఆసరా చేసుకొని, వాళ్ళను తమ విష కౌగిళ్ళలోకి తీసుకోవడానికి ఇతర రాజకీయ వర్గాలు పన్నుతున్న కుతంత్రాలు మాత్రమే.

గాంధీజీ ప్రచారంలోకి తెచ్చిన పేరు కనుక, కాంగ్రెస్ అగ్రనాయకుడైన జగ్ జీవన్ రామ్‌కు ఆ పేరు ఆమోదకరమే. అంబేద్కరుకు నిజంగానే ఆ పేరు ఇష్టం కాకపోతే మరొక పేరు పెట్టే వుండేవాడు. నిమ్న, బహిష్కృత పదాల కంటే దళిత ఉత్తమమైంది కాదు. పైగా వాటికంటే హేయమైంది.

మాల క్రైస్తవులు, మాదిగ క్రైస్తవులు అనడంకంటే హరిజన క్రైస్తవులు అనడంలో ఎంతో సంతృప్తిని పొందాడు జాషువా. తాను కులాతీతుడే. అయినా, సామాజిక వాస్తవాన్ని గుర్తించిన ప్రజ్ఞాశాలి.

## 43

*గవ్వకు సాటిరాని పలు*
*గాకుల మూక లసూయచేత న*
*న్నెవ్విధి దూరినన్, నను వ*
*రించిన శారద లేచిపోవునే?*
*ఇవ్వసుధా స్థలిన్ పొడమ*
*రే రస లుబ్ధులు? ఘంట మూనెదన్*

రవ్వలు రాల్చెదన్, గరగ
రల్ పచరించెద ఆంధ్ర వాణికిన్!

జాషువాగారు ఒక సారి ఈ రవ్వల పద్యాన్ని మంచి వీరావేశంతో పలుకుతుండగా, ఆడియన్సులో నా పక్కన కూర్చున్న ఒకరు నా మీదికి వంగి అడిగారు, "గర గరల్ అంటే ఏమిటండీ?" అని.

జాషువాగారి వంకే చూస్తూ పరధ్యానంగా వున్న నేను వెంటనే జవాబిచ్చాను. "గరం గరం పకోడీలు" అని.

"ఓహో!" అన్నాడాయన. అంటూ పరధ్యానంలో పడిపోయాడు. గుంటూరులో దొరికే కరకరలాడే ఉల్లిపాయల పకోడీలు జ్ఞాపకంవచ్చివుండాలి.

పైగా, ఇప్పటిలా 'నాకు లేనిది నీకు మాత్రం ఎందుకుండాలి' అంటూ తనకు గంజి మూకుడు లేనివాడు పొరుగు వాడి మజ్జిగ గిన్నెను పగలగొట్టే నిర్భాగ్య, నిరుత్సాహ, నిరానంద, నిష్పౌరుషేయ కాలం కాదు అప్పటిది.

నా ధ్యాసలో మాత్రం తొణికిసలాడ సాగినై జాషువా బాణీ, పద్య శిల్పమూ, శైలీ సౌందర్యమూ, రసధ్వనీ మాధుర్యమూ, హేతువాద నైశిత్యమూ, విరాట్పురుష పౌరుషమూ.

ఆయన వీరావేశం అత్యద్భుత మనిపించింది. తన తండ్రిగారి పేరులోనే వుంది కదా వీరం? వీరయ్యగారు జనరంజకంగా గొల్లసుద్దులు చెప్పే వారట. వీర గొల్లల కథలు చెప్పేటప్పుడు ఆయా వీరుల బలవిక్రమ నైపుణ్యాలను అభినయించి చూపేవారట.

పకోడీ లన్నప్పుడు భోజన ప్రియత్వం జ్ఞాపకం వచ్చిందినాకు. జాషువా గారు కూడా భోజనప్రియుడే. మా ఇద్దరికీ వున్న సమాన ధర్మాలలో అదొకటి.

భోజన ప్రియత్వం అంటే తిండిపోతు తనం కాదు. భోజన ధ్యాస కూడా కాదు. 'ఆత్మ కింపైన భోజనం' అని అల్లసాని పెద్దన గారన్నారే, అలాంటి భోజనం, కడుపు నింపే ముందు కన్ను నింపే భోజనం.

ఈ విషయంలో మాత్రం మేమిద్దరమూ అరిస్టోక్రాట్లమే. సాధారణంగా

మాలాంటి భోజన ప్రియులకు ఆత్మకింపైన భోజనం లభించేది స్వగృహంలోనే. గొప్ప గొప్ప విందులకు హాజరై వచ్చి, అసలు భోజనం ఇంట్లో చేసిన సందర్భాలెన్నో నా జీవితంలో వున్నై.

## 44

భారత సమాజంలోని అమానుషత్వాన్ని, అన్యాయాన్ని, అంటరానితనాన్ని నాగరిక సాహిత్యం నరక గలిగినంత కర్కశంగా నరికి పారేశాడు జాషువా.

***కసరి బుస గొట్టు నాతని గాలి సోక***
***నాల్గు పడగల హైందవ నాగరాజు!***

అనడం కంటే కుల వ్యవస్థను ఇంకా తీవ్రంగా ఎవరు ఈసడించ గలరు?

***ఆలయమ్మున నీవు వ్రేలాడు వేళ***
***శివుని చెవి నీకు కొంత చేరువగ నుండు,***
***మౌని ఖగరాజ్ఞి; పూజారి లేని వేళ***
***విన్నవింపుము నాదు జీవిత చరిత్ర!***

అనడం కంటే శివుడి అబలత్వాన్ని, పూజారిముందు దేవుడి అల్పత్వాన్ని ఇంకా హీనంగా ఎవరు అపహాస్యం చెయ్యగలరు?

మరి, ఫలితం ఏమిటి?

"ఓహో, ఎంత గొప్పగా చెప్పాడు జాషువా" అంటూ మెచ్చుకోవడం!

ఆ నాల్గు పడగల్నీ ఏం చెయ్యాలి? శివుడు పూజారికి భయపడకుండా వుండాలంటే ఏం చెయ్యాలి?

పరిష్కారం చెప్పలేదు జాషువా. ఏ కవీ కూడా పరిష్కారం వాచ్యంగా చెప్పడు. వ్యంగ్యంగా సూచిస్తాడు. సౌంజ్ఞ చేసి, పరిష్కారాన్ని సహృదయులకు వదిలేస్తాడు.

మరి జాషువాకు మనం చేసిన న్యాయం ఏమిటి? ఆయన అందించిన కవితామృతాన్ని మనం గ్రోలామా? జాషువాను మెచ్చుకునే వాళ్ళందరూ నిజాయితీగా ఆత్మ పరిశీలన చేసుకోవలసి వుంది.

జాషువా ఎంత గొప్ప కవో అంత గొప్ప శిల్పి కూడా.

"మిద్దెల్ మేడలు వృద్ధిచెందిన గతిన్
మేధస్సు పెంపొందెనే"

అంటూ స్వతంత్ర భారత పురోభివృద్ధిని గూర్చి జాషువా గారడిగిన ప్రశ్నకు సూటిగా జవాబు చెప్పుకోగల్గితే, ఆయన ఆశించిన సాంఘిక పరిణామానికి దోహదం చేసిన వాళ్ళమవుతాం. అందుకు కృషి చేయుగల్గితే, జాతి పునర్నిర్మాణ దీక్షా దక్షులమే అవుతాం.

## 45

"జాషువా ఎవరు?"

"కవి!"

"అది సరే, ఆయన?"

"క్రిస్టియన్"

అంతటితో ఆగితే వీళ్లు భారతీయులెలా అవుతారు? నూలా, తోలా తేల్చుకోవాలి కదా?

ఎందుకు?

ఎందుకూ కాదు. ఊరకనే, తెలియడమే జ్ఞానం. కులం తెలియడమే భారతీయ పరమ జ్ఞానం.

"ఏమని చెప్పుదు నా కథ
భీమకవీ! తోలు, నూలు బీరులు నన్నున్
క్షేమమ్ము లరసి తమ తమ
నోములు పండించుకొనుచు నూర్చుదు రెపుడున్!"

తోలూ, నూలూ కులాలవాళ్ళ అజ్ఞానం గురించి ఇలా వాపోయేవాడాయన.

"క్షేమమె కద భీమకవీ!

ఏమిటి సంగతులు?"

అంటూ పలకరించేవారు జాషువాగారు మేం కలుసుకొన్నప్పుడల్లా. నన్ను భీమకవీ అనే పిలిచేవాడు. ఆ చిరునవ్వు పలకరింపుతో జాషువాగారి నోట అదేదో వేదనాదంలా వినిపించేది నాకు, నా పేరు.

స్వచ్ఛమైన చిరునవ్వు నిజంగానే వెన్నెల కాస్తుంది. కవి సమయాలలో వాస్తవికత వుంది.

*నూలా తోలా అనుచున్*
*తేలుచు కొనకుండ ఎడద తృప్తిపదరు మా*
*మాలలు మాదిగలు; జగత్*
*పాలక!మత బోధలేల? ప్రార్థన లేలా?*

కాలం మారుతున్నా మానవులు మారడంలేదు. ఒక మతంలోని బాధల నుంచి తప్పించుకోవడానికి మరొక మతంలోకి మారినా, సదరు బాధలను ఆ కొత్త మతంలోకి కూడా తీసుకుపోతున్నారు. స్వచ్ఛమైన ఆ మతాన్ని కూడా కలుషితం చేస్తున్నారు.

"మరి, ఈ రోగాలను నిర్మూలించలేని మతబోధలెందుకూ, ప్రార్థన లెందుకూ?" అంటూ దుఃఖపడతాడు జాషువా.

నేనంటానూ, "పాపం మతబోధల్నీ, ప్రార్థనల్నీ నిందించడం ఎందుకు? అవన్నీ మన ఊహలకు, విశ్వాసాలకు లోబడివుండేవే. అసలు రోగాలు మాల మాదిగలను అంటిపెట్టుకొని వున్నట్టివి. వాళ్ళెక్కడికి వెళ్ళినా అవి వాళ్ళకూడా వెళుతూవున్నై.

''కలదమ్మా వ్రణమంటరానితన, మాకర్ణింపుమా, ఇండియా పొలమందుంగల మాలమాదిగలకున్" అంటూ ఈ రోగిష్ఠులను మాల మాదిగలుగా పేర్కొన్న జాషువా, మొత్తం హైందవకుల వ్యవస్థనే నేరస్థం చేసి నాగరిక లోకం ముందు ముద్దాయిగా ఎలా నిలబెట్టాడో గమనిస్తే అద్భుత మనిపిస్తుంది కదూ!

## 46

గబ్బిలం ద్వారా గంగాధరుడికి సందేశం పంపిన అరుంధతీ సుతుడు ఫలితంకోసం ఎదురుచూస్తూ కూర్చోలేదు.

సోమరితనం అతని స్వభావంలోనే లేదు. తన పని తాను చేసుకుంటూనే వున్నాడు. అయితే, అనుకోకుండా ఒక రాజకీయంలో తలదూర్చివున్నాడు కనుక, లాటరీ ఫలితాల కోసం వలె, అప్పుడప్పుడూ తల పైకెత్తి ఆకాశంలోకి చూస్తూనూ వున్నాడు.

ఇంతకూ తాను చేసిన పనిలో ఔచిత్య మెంత?

లోకంలో ఎంతోమంది శ్రీమంతులూ, చారిష్మావంతులూ, పదవీ జయంతులూ అయిన దేవతలూ, దేవుళ్ళూ వుండగా, బూడిద తప్ప మరేమీ లేని ఈ కాటికాపరి దేవుడ్ని ఎంచుకున్నాడేమిటి తాను.

ప్రపంచానికే ఆది దేవుడనా? తమకు ఎప్పుడూ అందుబాటులో ఉండే బిచ్చగాడనా. కొండమ్మ తల్లి భర్తగారనా?

తెల్లటి మబ్బు తునక కనిపించినా శివుడో, శివదూతో వచ్చాడనుకొంటున్నాడు!

శివుడు తన ఊరి గుడిలో వుండి వుండడు. కాశీలో కూడా లేడేమో! గబ్బిలం కైలాసంవరకూ వెళ్ళే వుంటుంది. అందుకే ఈ ఆలస్యం!

సృష్టిలోని లోపాలను సవరించడానికి, మనిషిని మంచివాడిగా మార్చడానికి తానెన్నో సూచనలు చేశాడు. అవన్నీ శివుడు వినే వుంటాడు. అర్థం చేసుకొని వుంటాడు. బహుశా సంస్కరణలకు పూనుకొని వుండవచ్చు కూడా. ఎందుకంటే.

అస్పృశ్యత తొలగిపోతున్నది. గుడులు తెరవబడుతున్నై. తమను కొత్త పేరుతో భారతమాతే పిలిచి ఆహ్వానిస్తున్నది.

*వెరపు వలదు నీకు, హరిజన మిత్రమా!*
*స్వీయ రాజ్య రథము వెడలి వచ్చె*
*లాగిపోమ్ము, నీకు భాగమ్ము గల దంచు*
*పాడుచుండె రత్న భరతమాత!*

అవును, కనుల పండుగగా అదిగో స్వరాజ్య రథం. చెవుల విందుగా ఇదిగో హరిజన నామం. ఈ రథోత్సవంలో తనకు సమాన భాగం.

అందరితో పాటు తనకు రథాన్ని లాగే అవకాశం, హక్కు

ఇదంతా తన సూచనలపై శివుడు తీసుకున్న సత్వర చర్యే.

అతి స్వల్ప కాలంలో ఇన్ని మంచి మార్పులు జరగడం తన గబ్బిలసందేశం వల్లనే అనుకుంటూ ఆనందపడిపోయాడు అరుంధతీ సుతుడు.

ఇక్కడ జాషువా 'హరిజన మిత్రమా' అన్నాడంటే, దళిత అనే శబ్దం తెలియక కాదు కదా!

చదువు చున్నావె పత్రికా చయము నందు
ఆంధ్ర మంత్రుల రాజకీయాల సభస?
అర్థమైనదె స్వేచ్ఛా మహా యుగాన
దళిత మైనట్టి ధనతత్వ తాండవమ్ము?

అన్నాడొకచోట. దళిత శబ్దాన్నే పతిత అనే అర్థంలో వాడాడు.

అస్పృశ్య కులాలకు ప్రభుత్వ నామం షెడ్యూల్డు కులాలు. రాజకీయ నామం దళితులు, నాగరికమూ, గౌరవప్రదమూ, మానవతా సమున్నతమూ అయిన నామం హరిజనులు.

న్యూనత లేనిదీ, విద్యా సంపన్నుల తాహత్తుకు తగినదీ, గత దాస్యకాలుష్య దుర్వాసన సోకనిదీ హరిజన నామం ఒక్కటే.

అందుకే జాషువా అటువంటి ఒక సభ్యనామం కోసం ఎదురుచూశాడు. అది గాంధీజీ ముఖతః వెలువడినప్పుడు స్వాగతం పలికాడు, సంతోషపడ్డాడు.

## 47

కాళిదాసుని మేఘంపు గౌరవంబు
తెచ్చుకొన్నదె నీదు సందేశ గాథ?
ఘనులు చేకొను భూభృదగ్రముల పూజ
అసమ చతురత్వమున్న బానిసకు రాదు!

ఇది తెలుగు పద్య శిఖరాయమాన దివ్యశోభ.

అంతవరకు కవితా పరంధాముడై భారత భాగ్య విధాతృ స్థానంలో వెలుగొందుతున్న జాషువా ఒక్కసారిగా మానవుడైపోయి ప్రదర్శించిన కారుణ్యం ఈ పద్యం.

గబ్బిలం కావ్యం వెలువడిన కొత్తలో దానిపై పలురకాల సమీక్షలూ, వ్యాఖ్యాలూ, అభిప్రాయాలూ వెలువడినై. నేను మొదట్లో చదివింది కూడా వాటినే.

అవన్నీ మొత్తంమీద ప్రశంసలే అయినా, కాళిదాసుని మేఘమే గబ్బిలానికి మార్గదర్శకం అనడం సహజమే కదా!

ఈ పద్యం ద్వారా జాషువా అట్టి అభిప్రాయానికి జవాబు చెప్పినట్టు కనిపిస్తుంది.

మనకు సందేశ కావ్యాలూ, కవితలూ, ఘటనలూ చాలా వున్నై. సందేశాలూ, రాయబారాలూ, దౌత్యాలూ, విజ్ఞాపనలూ, కబురంపడాలూ, తాఖీదులూ, నోటీసులూ, వారంట్లూ, మెమోరాండాలూ వంటివన్నీ ఇంచుమించు ఒకటే తరగతిలోకి వస్తై.

మంథర విజ్ఞాపనం, భరత ప్రాథేయం, హనుమత్సందేశం, అంగద రాయబారం, హంస సందేశం, నలవిజ్ఞాపనం, సంజయ రాయబారం, కృష్ణరాయబారం, రుక్మిణీ నివేదనం, కుంతీ ప్రాథేయం వంటి వన్నీ కావ్యకథాంతర ఘట్టాలే. రసప్రధానమైన స్వతంత్ర కావ్యాలు రెండే. మేఘసందేశం, గబ్బిల రాయబారం.

ప్రతి మనిషిలోనూ రసికుడు, వర్తకుడు, యోధుడు వుంటారు. నిష్పత్తులలో తేడాలుండవచ్చు.

జాషువా మనస్సు కావ్య బ్రహ్మస్థాయి నుంచి సామాన్య మానవ స్థితికి చేరి వున్నప్పుడు కలిగిన ప్రశ్న ఇది - "ఇంతకూ, తన కావ్యం ఏ స్థాయిలో వుందీ?" అని. "కవితా ప్రపంచంలో, కావ్య పంక్తిలో జాషువా గబ్బిలం కాళిదాసు మేఘంతో సాటి కాగలిగిందా?" అని.

కుల వ్యవస్థలో తాను నిమ్నకులంనుండి నన్న న్యూనతా భేదం జాషువాను వెన్నాడుతూనే వుంది. అందుకే, ఘనులకు జరిగే సమున్నత సన్మానాలు ఎంత ప్రతిభావంతుడైనా బానిసకు జరగవు కదా అంటూ ఖిన్నమనస్కుడయ్యాడు.

ఘనులు అంటే గొప్పవారూ, మేఘమూ అని రెండర్థాలు. పర్వత శిఖరోన్నతమైన పూజ లభించేది మేఘానికే కదా! గబ్బిలానికి ఎంత అర్హతవున్నా అది క్రింద క్రిందనే వుండిపోతుంది. రెండూ సహజోక్తులే. అయినా వాటిని మానవ స్వభావంలోని తరతమ భేదాలను సూచించడానికి జాషువావాడుకున్న పద్ధతి అద్భుతంగా వుంది. సమున్నత సన్మాన గౌరవాలు లభించేది మరి పైవాళ్ళకే, పైపైని తిరిగేవాళ్ళకే!

ఇదీ భారతీయ కవితాశక్తి. వాస్తవానికి నిష్పక్షపాత బుద్ధితో విశ్లేషిస్తే జాషువా ప్రతి పద్యంలోనూ ఈ శక్తి వుంది. శక్తికి ఆధారభూతుడైన శివుడు గబ్బిలానికి ఆనాడే జ్ఞానపీఠ గౌరవాన్నిచ్చి సన్మానించి పంపించవలసింది.

శివుడు మాత్రం ఏం చేస్తాడు? పెత్తనం చేస్తున్నవాళ్ళు పైవాళ్ళు కదా?

## 48

మేఘ సందేశం నిజంగా కవితా సందేశమే. అదొక యక్షుడి వ్యక్తిగత సమస్య. వ్యక్తిగత బాధ. ఆ బాధకు విశ్వజనీనతను కల్పించాడు కాళిదాసు. దానిని అక్షర చషకాలలో నింపి హృదయం గల ప్రతి మనిషికీ అందించాడు.

ఇక్కడొక విశేషం చెప్పాలి. ఆత్మాశ్రయ రసస్ఫూర్తి వుండేది ఒక్క భావ కవిత్వ ప్రక్రియలోనే కాదు. కాళిదాసు మేఘ సందేశం కూడా ఆత్మాశ్రయమే. కవి తానే యక్షుడై పాడుకొన్న ఆత్మ వేదనా, నివేదనా అది. దానిని చదివి స్పందించిన వాళ్ళ హృదయాలు అమృత కలశాలే అవుతై. లౌకిక చింతల వల్ల వచ్చే గుండెపోట్లు వంటి వ్యాధులు అట్టి కవితా రసామృత ప్లావితులైన సహృదయులకు రావు.

గబ్బిలం కూడా స్వభావంలో అలాంటిదే. గుణంలో అంత కంటే గొప్పది.

గబ్బిలం తీసుకు వెళ్ళింది వ్యక్తికి వ్యక్తి సందేశం కాదు. భగవంతుడికి బహిష్కృతుల మొర.

అరుంధతీ సుతుడొక్కడు కాదు. కోటానుకోట్ల దళితులకు ప్రతినిధి, అతడితో మమేకం చెందిన కవి యొక్క ఆత్మ వేదనా నివేదన అది.

మేఘానికి ఒక నిర్దిష్ట మార్గం వుంది. ఆ మార్గంలోని విశిష్ట స్థలాలను మాత్రమే వర్ణించి చెప్పాడు యక్షుడు. మేఘం లోక సంచారి. దానికి ప్రత్యేకంగా ఏమీ చెప్పనక్కరలేదు. దాని మార్గంలోనే వున్న యక్షకాంతకు తన యోగ క్షేమాలకు అందజేసి వెళ్ళమన్నాడు యక్షుడు, మేఘం అతడి ప్రత్యేకదూత కాదు. పోస్టుమన్ వంటిది.

గబ్బిలం విషయంలో అలా కాదు. అది అరుంధతీ సుతుని ప్రత్యేకదూత. దాని కంతా క్రొత్త, లోక జ్ఞానం లేనిది. వెళ్ళేది కైలాసానికి, చూచేది సర్వ కళా ప్రపూర్ణుడైన సుందరేశ్వరుడ్ని, చంద్రశేఖరుడ్ని, నటరాజుని, శివుడ్ని. అట్టి జగత్పితతో మాట్లాడాలంటే అందుకు తగిన కనీసార్హత అయినా వుండాలి కదా?

అట్టి అర్హత గబ్బిలానికి లభించే లక్ష్యంతోనే దాని ప్రయాణ మార్గాన్ని నిర్దేశించాడు కవి.

భారత దేశేందిర పాద పద్మాలయమైన కన్యాకుమారి ప్రాంతం నుంచి ప్రయాణమై, ప్రతీ కళాక్షేత్రాన్నీ, విద్యా కేంద్రాన్నీ దర్శిస్తూ, స్పృశిస్తూ, పూజిస్తూ ముందుకు సాగవలసిందిగా గబ్బిలం ఉపదేశించబడింది. చుట్టైనా మెట్ట మేలనే సామెతకు రూపకల్పన చేయబడింది.

కళకళ కోసమే అనే దానికి మేఘం ఉదాహరణం అయితే, కళ కొక ప్రయోజక స్థాయిని కలిగించినట్టిది గబ్బిలం. పల్లెటూరి శివాలయంలోని ఒక అమాయకపు తబిసి పిట్టకు కైలాసం చేరేటప్పటికి బ్రహ్మర్షిత్వాన్ని సిద్ధింపచేశాడు లోక సందర్శనద్వారా కవిబ్రహ్మ జాషువా.

వస్తు జీవగుణ క్షేత్రాలలో దేనిలోనైనా సరే - దేని వ్యక్తిత్వం దానిదే. ఒక వర్గం వ్యక్తితో వేరొక వర్గం వ్యక్తిని పోల్చకూడదు. పోల్చకుండా మాట్లాడలేని పండితులుంటే వాళ్ళకు నేను చెప్పేదేమిటంటే - "కాళిదాసుగారి మేఘసందేశం కంటే జాషువాగారి గబ్బిల విజ్ఞాపనం సర్వోత్తమ కావ్యం" అని, "ప్రపంచ సాహిత్యానికే మకుటాయమానం" అని.

## 49

చిక్కిన కాసుచే తనివి
  చెందు అమాయకు, డెల్ల కష్టముల్
బుక్కెడు బువ్వతో మరచి
  పోవు క్షుధానల దగ్ధ మూర్తి, న

ద్దిక్కులు గల్గు లోకమున

దిక్కరి యున్న అరుంధతీ సుతుం

డొక్కడు జన్మ మెత్తె భర

తోర్వరకున్ కడగొట్టు బిడ్డడై!

తన గుడిసెలోకి చొరబడ్డ గబ్బిలానికి తన దీనస్థితిని చెప్పుకొని, శివుడికి వినిపించవలసిందిగా వేడుకొన్న అరుంధతీ సుతుడు, అంటే మాలమాదిగవాడు, ఎలాంటివాడు?

రోజంతా శ్రమపడి తృణమో, పణమో దొరికితే, దానితోనే తృప్తి చెందే అమాయకుడు. గ్రుక్కెడు గంజితో ఆకలిమంటలు చల్లారగానే అన్ని కష్టాలనూ మరిచిపోయే అల్ప సంతోషి. నాలుగు (పది?) దిక్కులు గల లోకంలో తనకు మాత్రం ఏ దిక్కూలేని బహిష్కృతుడు.

నభూతోన భవిష్యతిగా జాషువా సృష్టించిన గబ్బిలం కావ్యనాయకుడు!

ఈ దేశంలో, ఈ జాతిలో కులవ్యవస్థ ఏర్పడి గడ్డ కట్టినప్పటి నుంచి, వేల సంవత్సరాలుగా ఎంతటి ఎంత మంది వచ్చిపోయినా, తాను మాత్రం చెక్కు చెదరకుండా, ఎక్కడివా డక్కడే స్థిరంగా వుండిపోయిన అజరామరసత్త్వుడు.

ఇదీ జాషువా కావ్య శిల్పం.

సమాజం దృష్టిలో జాషువా ఒక మాదిగ పేటలో మొలకెత్తిన ఒక మొక్క. అది ఎదిగే కొలదీ దాని ఆకులే పరిమళాలు వెదజల్లుతుంటే అదేదో దివ్య వృక్షంగా భావించకుండా, అలా భావించగల సంస్కారం వున్నప్పటికీ దాన్ని అహంకారంతో అణగద్రొక్కి, ఆ మొక్కపై రాళ్ళు రువ్వసాగింది పేటబయట వున్న సవర్ణ మర్కటత్వం.

కుల ఘాతుక సమాజంలో, అస్పృశ్యజన పాలెంలో, నర నరక బీభత్సంలో ఎదుగుతున్న మానవుడి బ్రతుకు ఆనాడు ఎలా వుండేదో ఇప్పటి వాళ్ళు ఊహించలేరు. పోనీ, సదరు కులఘాతుక దుష్ఠ వాతావరణం నుంచి పారిపోదామని క్రైస్తవ మతంలో చేరితే, అక్కడా ఇదే పీడ!

అసలే సవర్ణుల అగ్ర కులాహంకారం గోరుచుట్టులా సలుపుతూ వుంటే, నూలూ తోలూ అంతర్విభేదాలు రోకటి పోట్లై బాధించినై జాషువాను. సామాన్యులకే ఇవి ప్రాణాంతకాలవుతై. ఇక జాషువా లాంటి మృదు మధుర కవితా హృదయుడ్ని ఎంతగా హింసిస్తాయో ఊహకందని విషయం.

అట్టి తప్త హృదయం నుంచి పుట్టి, దివ్యకల్పకమై, ఆకాశాన్ని దూసుకుపోయేటంత ఎత్తుకు పెరిగిన మహాకావ్యం గబ్బిలం.

అంతటి మహాకవి గురించి ఇతర పండితులూ, పండిత కవులూ ఏమేమి చెప్పినా, కవి వృద్ధులు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు చెప్పినట్లుగా ప్రచారంలో వున్న ఒక పద్యం ఇక్కడ ఇస్తున్నాను.

*ఎంత దూరమో ఎందుకు? ఎవడు జాషు*
*వా యను కవి ప్రవరుడు? కవనము నందు*
*వాని బోలెడు వారె ఎవ్వార లేని*
*విప్ర కవులందు ఎవ్వడో వేత్త తప్ప?*

అయితే ఈ పద్యం ఎందుకు చెప్పినట్టో, దీని అర్థమేమిటో, ఉద్దేశమేమిటో నాకు మాత్రం అవగాహన కాలేదు.

'వాని బోలెడు వారె ఎవ్వారలేని' అంటే తెలుగు కవుల్లో ఎవరైనా జాషువా వంటి వాళ్ళే అనే అర్థం వస్తున్నది. జాషువా గొప్పేమిటీ అనే తేలిక భావం ధ్వనిస్తున్నది. పద్యం కూడా సరళత లేకుండా కష్టపడి కూర్చినట్టు కనిపిస్తున్నది.

## 50

కల దంబేద్కరు నా సహోదరుడు మా
        కై యష్ట కష్టాలకుం
బలియై సీమకు వోయి క్రమ్మరిన వి
        ద్వాంసుండు, వైస్రాయి మే
ల్కొలు వందుం గల దొడ్డవాడతడు, నీ

కున్ స్వాగతం బిచ్చి పూ
వుల పూజల్ వొనరించెనే. అతని మె
ప్పుల్ నీ జయారంభముల్!

తన సందేశాన్ని తీసుకువెళ్ళి తిరిగి వచ్చిన గబ్బిలాన్ని ఎన్నో విషయ వివరాలకోసం ప్రశ్నిస్తాడు అరుంధతీ సుతుడు. అందులో తమ నాయకుడైన అంబేద్కరు గారిని మరచిపోలేదు అతడు.

అంబేద్కరు మెచ్చుకుంటే చాలు, ఏ వ్యక్తికైనా విజయం లభించిందన్నమాటే. అప్పటికి అంబేద్కరు ఢిల్లీలో వైస్రాయి కౌన్సిల్లో కార్మిక శాఖా మంత్రిగా వుంటున్నాడు.

ఆనాటికి సాహిత్య రంగంలో జాషువా ఎన్ని బాధలు పడుతున్నాడో, మొత్తం దేశంలోని దళిత ప్రజలకోసం అన్నిరంగాలలోనూ అన్ని బాధలూ పడుతూ, రాజకీయమైన పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నవాడు దళిత జాతిపిత డాక్టర్ అంబేద్కర్. ఈ సత్యాన్ని హృదయ గతం చేసుకొన్నవాడు అరుంధతీ సుతుడు.

అరుంధతీ సుతుడు కోరినట్టు అంబేద్కరు మెప్పుకోసం గబ్బిలం ప్రయత్నించిందో, లేదో తెలియదు. ఒక వేళ ప్రయత్నించి ఆయన మెప్పుపొందినా, గబ్బిలానికి సమకూరే ప్రయోజనం కూడా ఏమీ లేదు.

అయితే, ఆ విధంగా ప్రయత్నించి, భక్తినటించి, జాతి సేవ కోసమని చెప్పి నమ్మించి, ఆయన మంచి లాభం పొందిన ఎన్నో రాబందులు మాత్రం నాకు తెలుసు.

అవి ఈనాటికీ రాజకీయ ఆకాశంలో రెక్కలు చాచి విహరిస్తూ, దళిత జన హృదయాలకు వెలుగు సోకకుండా భారతీయ విజ్ఞాన సూర్యరశ్మిని అడ్డగిస్తూ వున్నై.

అంబేద్కరునూ, గాంధీనీ సమానంగా గౌరవించిన జగత్కవి జాషువా.

ఆ ఇద్దరూ జాతీయ నాయకులు, సమకాలీనులు, ప్రతిస్పర్థులు, ఒకరిపై ఒకరు రాజకీయ ప్రయోజనాల కోసం నిందారోపణలు చేసుకొన్న వాళ్ళు. అయితే ఒకరి హృదయాన్ని మరొకరు అర్థం చేసుకొన్న వాళ్ళు.

ఈ వాస్తవం తెలియని సవర్ణులు అంబేద్కరును, దళితులు గాంధీని ఆనాడు విమర్శించారు. ఈనాటికీ విమర్శిస్తూనే వున్నారు.

అలా విమర్శించడం న్యాయం కాదని, హరిజనాభ్యుదయానికి, జాతి

సమైక్యానికి ఇద్దరూ స్థిత ప్రజ్ఞులై కృషి చేసిన మహనీయులే అని సమస్వరంతో గొంతెత్తి చాటిన కవి కోకిల జాషువా.

## 51

అలుక శమించెనా జలక
మాడిన యంతన. మాలదాని పి
ల్లల కడగండ్లు చూచి బహు
ళంబుగ తప్తమునందు నా మనో
జలజము మైలపడ్డ, దది
స్నానము చేసెనె? వెర్రిదాన! ఈ
వెలుపలి శుద్ధి జీవులకు
పెట్టునె? పోయునె?ముక్తి నిచ్చునే?

అంటాడు జాషువా, అస్పృశ్యతను అవహేళన చేస్తూ, తన అనాథ కావ్యంలో.

ఒక బ్రాహ్మణ యువకుడు ఒక మాల దానిని ప్రమాదం నుంచి రక్షించి ఆస్పత్రిలో చేరుస్తాడు. ఆ సంగతి విన్న భార్యస్నానం చెయ్యకుండా ఇంట్లోకి రావద్దంటుంది. అతడు స్నానం చేసి, ఇంట్లోకి వెళ్ళి ఆమెకు చేసిన ఉపదేశం ఈ పద్యం.

ఏ సవర్ణ హిందువులు ఈ బాహ్యమైన అంటరానితనాన్ని పాటిస్తున్నారో, ఆ సవర్ణ హిందువుల ప్రామాణిక శాస్త్రాలు ఇదే ఉపదేశం చేస్తున్నె చూడండి.

అపవిత్రః పవిత్రోవా
సర్వావస్థాంగితోపి వా
య స్మరేత్ పుండరీకాక్షం
స బాహ్యాభ్యంతర శ్శుచిః

మనిషి పవిత్రంగా వున్నా, అపవిత్రంగా వున్నా, అతడి అవయవాలు ఏ అవస్థలో వున్నా (ఏ పని చేస్తున్నా) అతడు పుండరీకాక్షుడ్ని స్మరిస్తే చాలు బైటా లోపలా కూడా శుచి గలవాడే అవుతాడు.

ఇంతటి గొప్ప ధర్మాన్ని ఈ సవర్ణ హిందువులు ఏం చేస్తున్నారు?

అనుసరిస్తున్నారా? మన పూర్వ ఋషులు చెప్పిన సహజ ధర్మాన్నే ఎందుకు అంటరానితనమంటూ నాశనం చేస్తున్నారు?

మానవుడే మాధవుడని,

మానవ సేవే మాధవ సేవ అని,

మానవుడ్ని వెలిపెట్టడం దేవుడ్ని వెలి పెట్టడమే అని,

అంటరానితనమో, హిందూ మతమో ఏదో ఒకటే ఈ దేశంలో బ్రతికి వుంటుందని.

అంటరానితనం బ్రతికి వుంటే హిందూ మతం చచ్చిపోక తప్పదని.

ఈ విధంగా తన జీవిత కాలమంతా బోధించిన గాంధీజీని ఈ సవర్ణ హిందువులు ఎందుకు మన్నించలేదు?

మహాత్ముడైన గాంధీజీ కంటే ఈ దుష్టాచార భ్రష్టులైన సవర్ణ ఛాందసులు ఎక్కువ తెలివిగలవాళ్ళా?

తరతరాలుగా తమ మత ధర్మాన్ని మరచి, ఉజ్వలమైన సొంత వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేసుకొని, అన్ని విధాలా భ్రష్టు పట్టిపోయిన సవర్ణ హిందూ జాతిని తట్టి లేపుతున్నాడు జాషువా ఈ పద్యంలో.

ఆత్మ శాశ్వతమైందనీ, శరీరం క్షణ భంగురమనీ, అందువల్ల ఆత్మనే పరిశుద్ధంగా వుంచుకోవాలనీ మన వేదాంత తత్వం చాటుతున్నది కదా! మరి ఈ హిందూ మతాధిపతులు దాన్ని ఎందుకు ఉల్టా చేసి స్వధర్మాన్నే నాశనం చేస్తున్నారు. ఆత్మను పెంట కుప్పలమీద వదిలేసి శరీరానికే అధిక ప్రాముఖ్యం ఎందుకు ఇస్తున్నారు.?

మనస్సు ఎన్ని చెడు తిరుగుళ్ళు తిరిగివచ్చినా, ఆత్మ ఎంతగా మట్టి కొట్టుకుపోయినా, శరీరం మాత్రం అసూర్యంపశ్యగా అంతఃపురంలో వుండి పోవడమే పవిత్రత అనుకుంటున్నారా?

ద్రాక్షా పాకంలో పద్య కలశాలలో స్వచ్ఛమైన తన కవితా సుధను ఒక దైవ ప్రవక్తలా అందించాడు జాషువా.

అయితే, ఆ అమృత కలశాలలోని మాధుర్యాన్ని ఆస్వాదించి, ఆహా, ఓహో అంటున్నారే తప్ప కవి ప్రవచనాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. జనం ఎప్పుడు ఏ ప్రవక్తను మాత్రం పట్టించుకొన్నారు?

ఏ కళ అయినా సహజ స్వభావ సృష్టే. కళాకారులు, కవులు తమ భావావేశాలకు రూపకల్పన చేస్తూనే వుంటారు. చేయకుండా వుండలేదు. కనుక కవులు చెపుతున్నారు, ప్రజలు వింటున్నారు. అది అంతే. ఆచరన మాత్రం మానవ రీతినికోరే విప్లవకారుల కర్తవ్యం.

## 52

*కల వారిచ్చిన పట్టు వస్త్రములతో*
*గన్పట్టు నన్ జూచి, శ్రీ*
*గల వాడీత డటంచు నల్వు రన నా*
*కర్ణించి, నా కన్న కొ*
*డ్కులు, జుట్టాలును దబ్బులే దనిన సం*
*కోచింతు రీనాటి; క*
*న్యుల మాటేల. ప్రచారమందు ఋతమున్*
*శుద్ధానృతం బయ్యెడున్!*

జాషువాగారు ఈ పద్యాన్ని తరచు వినిపించేవారు. సహజంగా పేద వాడైన కవికి సన్మానాలు జరిగేటప్పుడు కొందరు పట్టు వస్త్రాలు పెడితే, మరి కొందరు ఖరీదైన కాశ్మీరు శాలువాలు కప్పుతారు. కనకాభిషేకాలు చేస్తాడు. గండపెండేరాలు తొడుగుతారు.

వీటిని ఎప్పుడైనా సరదాకు ధరించి ఆ కవి బైటకు వస్తే, ఆయను చూచి మహా ధనవంతుడని ప్రజలు భావించడం సహజం. ఆయన ఆదాయం గురించిన వివరాలు తెలియని ఇంట్లో వాళ్ళు కూడా అలాగే భావిస్తారు. డబ్బుండి కూడా తమను ఇబ్బంది పెడుతున్నాడని కోపగించుకుంటారు.

సన్మానాల మూలంగా కవులు పడే ఈ బాధలు నేనూ పడుతున్నవాడ్నే కనుక, దానిని కవితా వస్తువు చేసిన జాషువాగారి ప్రతిభను మెచ్చుకుంటూ వినేవాళ్ళం. అందులోని హాస్యరసానికి ఆనందించే వాళ్ళం.

**జలముల్, వాయువు, నగ్నియున్ పరమ రా**
**జన్యుందు భూలోక వా**
**సులకుం బంచి యొసంగి పోయిన స్థిరా**
**స్తుల్; స్పృశ్య తాస్పృశ్యతల్**
**కుల గోత్రాలు ప్రపంచ సభ్యతకు సి**
**గ్గుం జేటు జు, మ్మమ్మహో**
**కలుషం బెల్ల మహా పదార్థములకున్**
**గల్పింతు రల్పాశయుల్!**

దాహంవేసి మంచినీళ్ళడిగిన ఏసుకు, బావి వద్ద నీళ్ళు తోడుకుంటున్న సమరయ మహిళ నీళ్ళివ్వడానికి భయపడగా, ఆయన చెప్పిన సమాధానం ఈ పద్యం.

ఏసు యూదు వంశంవాడు. సమరయ తెగవారిని యూదులు అస్పృశ్యులుగాపరిగణించే కాల మది. అందుకే ఆమె భయపడింది. ఆయన సర్వమానవ సమతా తత్వాన్ని బోధించాడామెకు.

ఇది నేను వ్రాసిన "చాండాలిక" నాటికలోని చాండాలిక ఆనందుడికి తన బావి నీళ్ళను ఇవ్వడానికి భయపడిన సన్నివేశం లాంటిది. అక్కడకూడా బౌద్ధ ప్రముఖుడైన ఆనందుడు ఆమెకు విశ్వజనీనతను బోధించి, ఆమెలోని న్యూనతాభావాన్ని పోగొట్టాడు.

క్రైస్తవ మతం ఏకేశ్వర మతమే అయినా ఈ దేశంలో అది రెండు మిషన్లుగా చీలి, లూథరన్ మిషన్ మాలలను, బాప్టిస్ట్ మిషన్ మాదిగలను ప్రోత్సహించడం సాగించారు. హిందువులలోని కులభేదాలను క్రైస్తవ మతం కూడా ప్రోత్సహించడం జాషువాగారికి ఎంత బాధ కలిగించిందో ఈ పద్యంలో చూడవచ్చు;

*మతములోన గలుగు మాట పొత్తే కాని*
*పొత్తులేదు, మాకు పొరుగు లేదు,*
*సిగ్గు విడిచి హెచ్చు తగ్గుల కోసమై*
*తన్ను కొనుట కూడ తప్పుకాదు!*

## 53

1971 జనవరిలో ఆంధ్ర యూనివర్సిటీ వారు నాకు కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేటును ఇచ్చారు.

దానిని పురస్కరించుకొని జరిగిన సన్మాన పరంపరలో వరుసగా పాల్గొంటూ. బహుశా ఏప్రిల్ నాటికి గుంటూరు చేరుకొన్నాను. అక్కడ నాకూ, కొండవీటి వెంకటకవి గారికీ సన్మానం ఏర్పాటు చేసిన మహోదయులు మన్నవ గిరిధరరావుగారు. ఆయన నాకు చిరకాల మిత్రులు.

"మీ 'ధర్మం కోసం పోరాటం' చదువుతున్నాను. మన సాంప్రదాయక భావాలను, ఆచారాలను పునః పరిశీలింప చేసే యదార్థాలు అందులో చాలావున్నై." అన్నారు గిరిధరరావు గారు.

ఒకస్థిత ప్రజ్ఞుడైన హిందూ సంప్రదాయవాది, ప్రాచీన ధర్మ పునః ప్రతిష్ఠ కోసం నడుం కట్టి కృషి చేస్తున్న ధీరోదాత్తుడు గిరిధరరావు గారు అలా అన్నారంటే, అంతకంటే నాకు పరమానందం కలిగించే ప్రశంస మరొకటి ఏముంటుంది?

నిజానికి నేను సాంఘిక సమస్యలను కావ్య వస్తువులుగా తీసుకొని రచనలు చేయడంలోని ఉద్దేశం దళితులను మేలు కొలుపడానికేకాదు, సవర్ణ హిందువులకు కనువిప్పు కలిగించడానికి కూడా.

దళితులకు తామెవరో తెలియదు. సవర్ణ హిందువులకు, ముఖ్యంగా బ్రాహ్మలకు తామెవరో తెలుసు. కాని, మరిచిపోయారు. కుల భేదాలలో శకలాలై శిథిలమై పోయారు. జడులై పోయిన అట్టి వాళ్ళను వెన్ను తట్టి మేల్కొలపడం నా ధర్మంగా భావించాను. ధర్మం కోసం పోరాటం వ్రాశాను.

ఇటువంటి నా గ్రంథాలను దళితులు చదువుతున్నా, ఆలోచించడం లేదు. అర్థం చేసుకోవడం లేదు. దళితేతర హిందువులైనా చదువుతున్నారా. మన భారతీయ ప్రాచీనత గురించి నేనే ఆవిష్కరిస్తున్న యదార్థాలను గుర్తిస్తున్నారా. అభినందిస్తున్నారా? లేక, కన్ను గప్పిన అహంకారంతో ఆగ్రహానికి లోనవుతున్నారా?

"నేను ఆశించేది కూడా అదే. నా గ్రంథాలను హరిజనులతో పాటు, హరిజనేతర సవర్ణ మేధావులు కూడా చదవాలి. సమానంగా ఉత్తేజితులు కావాలి.

అందరం ఒకే జాతి వారమన్న వాస్తవాన్ని ఉభయులు గుర్తించాలి. సంఘటిత వీర భారతం ఆవిర్భవించాలి. నా రచనా వ్యాసంగానికి పరమలక్ష్యం ఇదీ. లక్ష్యానికి మార్గంలో ఉషః కాంతులు ప్రసరిస్తున్నాయని ఇప్పుడు మీ నుంచి విన్నాను. అదే నేను కోరుకుంటున్నది" అన్నాను ఆనందంతో.

గిరిధర రావుగారింట్లో ఉదయం టిఫిను తీసుకొని మోదుకూరి జాన్సనుతో కలిసి జాషువాగారింటికి బయలుదేరాను.

## 54

జాషువాగారి చివరి రోజులు

అదొక దయనీయ దృశ్యం. విషాద మిహిరోచ్ఛన్నం. కరుణాతిరేక దుఃఖోల్లోలం.

వసంత గ్రీష్మ వర్ష తీవ్రతలన్నిటా సమోత్సాహంతో సుప్రభాతాలుపాడి, మానవ చైతన్యాన్ని మేల్కొలిపి, అజరామర విప్లవ భువన విజయాలు జరుపుకొంటున్న కోకిల, మృత్యుంజయ నిత్య జీవన్మూర్తిగా సహృదయలోకం ఊహించుకుంటున్న కోకిల, నిస్త్రాణ శిశిరశయ్యపై మూగవోయి పడి వుంది.

ఒక్క చూపు తప్ప మరే ఇంద్రియమూ పని చెయ్యని పక్షవాతం. అవసరాన్ని గుర్తించి, ఔషధ బిందువులతో గొంతు తడుపుతూ ప్రక్కనేనిలబడి వున్న అర్ధాంగి.

చూపు కూడా ఈ లోకంలో లేదు. ఎక్కడో శూన్యంలో నిలచిపోయివుంది.

జీవన్మరణ సరిహద్దు రేఖపై ఒక మహాజీవితయాత్రికుడి చివరి మజిలీ!

ఏదీ ఆ అనంతకోటి అభిమాన జనం? ఈ విశ్వనరుడి అంతిమ సేవకోసం ఏ దయాదేవి ఇలా ద్వితీయ కళత్రంగా వచ్చి పాదాలొత్తుతున్నదో!

నోరు తెరుచుకొని వుంది. కళ్ళు ఏకాగ్రంగా వున్నై!

"ఎవర్నీ గుర్తించడం లేదు. మీరు ముఖం మీదికి బాగా వంగి కళ్ళల్లో కళ్ళు గ్రుచ్చి చూడండి" అన్నదావిడ.

నేను అలాగే చేశాను. అలా చూస్తూ చాలా సేపు వున్నాను. ఇక వుండలేక పైకి కదిలాను. నాతో కలిసి ఆయన చూపులు కదిలాయి. నిరాశా కాలమేఘంలో ఒక చిన్న మెరుపు.

"గుర్తించినట్టున్నారు" అన్నదావిడ. ఏవో మందు చుక్కలు నోట్లో వేసింది. ఆయన చూపులు నా ముఖం మీదే వున్నై. అలా చూస్తూ చూస్తూ ఏదో మాట్లాడాలనే కదలిక. సాధ్యం కాలేదు. అప్పుడు చెమర్చినై ఆయన కళ్ళు. కన్నీరు ధార కట్టింది.

ఇప్పటికీ ఆ ధార అలా ప్రవహిస్తూనే వున్నదన్న భ్రాంతి నా చుట్టూ సుళ్ళు తిరుగుతూనే వుంటున్నది.

జాషువా లాంటి దృఢకాయుడు, ధృఢచిత్తుడు, దృఢ సంకల్పుడు అలా ఎందుకయ్యాడు? అలా కావడానికి ఎవరి బాధ్యత ఎంత వుంది?

*కులమనెడి ఊబిలో పడి కొట్టుకొనెడు*
*భరత గోమాత నుద్ధరింపగ, కలమ్ము*
*కల్పముగ చేసి పోరిన కవి సువీర!*
*జాషువా! నీవె ఋగ్ధర్మ జాతి పితవు!*

అనుకొంటూ నా మనసు అతలాకుతల మయ్యింది.

పుట్టుకనుంచీ జీవిత యాత్ర పొడుగునా కుల కక్షా భ్రష్ట సంఘ వ్యవస్థ వైరస్యంతో దొంగ దాడులు జరుపుతూ వచ్చినా, మహా శారద సారథ్యంతో వీర విహారం చేస్తూ విజృంభించి విజయుడైన ప్రజా కవికి చివరగా లభించిన పురస్కారమా ఇది?

*ప్రకృతి ధర్మం ఎంత నిర్దయా దుష్టం!*
*అవసానకాలం ఎంత బాధా దష్టం!*

ఆయన ముఖానికి ముఖం ఆన్చి, నుదురు ముద్దిడి, శిరస్సు దువ్వి, గుండె నిమిరి, కళ్ళు తుడుచుకొంటూ పక్కకు చూస్తే అక్కడ మోదుకూరి లేడు.

ప్రక్కన ఒక చెట్టు చాటున నిలబడి ఏడుస్తున్నాడు.

## 55

బరువెక్కిన హృదయంతో గుంటూరునుంచి హైదరాబాదుకు బయలు దేరారు. ప్లాట్‌ఫారం మీద జనం, రైల్లో ప్రయాణికులు, మార్గం పొడుగునా ఇరుప్రక్కలా అతివేగంతో వెనక్కిపోతున్న చరాచర జీవరాశులు సమస్తమూ నాకు జాషువా విశ్వరూపంగా కనిపించసాగింది.

రైలు, ఆత్మవలే ముందుకు దూసుకుపోతుంటే ఇరుప్రక్కలా గల చరాచర జీవరాశి ఎలా వెనక్కి పరుగిడుతున్నదో ఆలోచించే కొలదీ, సృష్టి రహస్యం అవగతమౌతున్నట్టే తోచసాగింది.

**కవిని వీడి ముందు కరుగుచున్నది రైలు,**
***కవిని గూడ వెనుక కరుగు బైలు;***
**కవియె సుమ్ము కేంద్ర మవనీ ప్రగతి కెల్ల**
**విశ్వభోగధామ వినుర భీమ!**

అంటూ ఒక పద్యం నా శతకంలోకి చేరింది.

నా కళ్ళముందే ఎంతమంది మహా మనీషులు కాలగర్భంలో కలిసి పోయారు కాదూ? గాంధీజీతో ప్రారంభించి జ్ఞప్తికి వస్తున్న పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం, లాల్ బహదూర్ శాస్త్రి, వీర సావర్కరు, కుసుమ ధర్మన్న, కళా వెంకట్రావు మొదలైన వారి జీవిత స్మృతులు కళ్ళకు కట్టసాగినై. అట్టి అర్ద్ర స్మృతిలోనే నా హృదయం జాషువాకు కవితా నివాళులర్పించసాగింది.

**అవని మతములెన్నొ అందరి దేవుళ్ళు**
**స్వర్గ నాథులుండ, శరణు కొరకు**
*కాటి బిచ్చగాడు కనిపించెనా నీకు?*
*జాషువా కవీంద్ర! భేషు భేషు!* 1

*చేత శంఖు బట్టి చిందాడి, దళితుల*
*గూడి బ్రతుకు మాష్టిటీడు తప్ప*
*దేవు డెవడు. దైవ దిక్సూచి వైతివి!*
*జాషువా కవీంద్ర! భేషు భేషు!* 2

*తిండి బట్టకొరకు తిరిపె మెత్తెడి వాడు*
*శివుడె కాదు, లోక ధవుడు కూడ;*
*ఫల మొసంగు నీ తపసి పిట్ట దౌత్యమ్ము*
*జాషువా కవీంద్ర! భేషు భేషు* 3

*తెలుగు వాని కిచ్చితివి ఫిరదౌసిని*

ఖండ కృతికి పూర్ణకావ్య హోద
గబ్బిలముకు దేశ గౌరవ పీఠమ్ము
జాషువా కవీంద్ర ! భేషు భేషు 4

కాల గమన మందు కవితా ప్రయోజన
మేమిటన్న ప్రశ్న కీవె ఋష్టి;
అవని జీవ తతికి నవరసమ్ముల వృష్టి,
జాషువా కవీంద్ర! భేషు భేషు 5

జాషువా గారి అవసానదశను చూచిన దుఃఖంలో, అకాల వృద్ధాప్య వైపరీత్యాన్ని నిందిస్తూ హైదరాబాదు చేరుకోగానే, నేను చేసిన మొదటి పని ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డిగారిని కలిసి జాషువా పరిస్థితిని వివరించడం.

"చాలా ఖరీదైన మందులు వాడుతున్నారు. ముందు ఆర్థిక ఇబ్బందిని తీర్చవలసి వుంది. డాక్టరు ఎవరైనా అందుబాటులో వుండాలి. రోజుకు ఒక సారైనా పరిస్థితిని పరిశీలిస్తూ వుండాలి. రెవెన్యూ అధికారులెవరైనా టచ్‌లో వుండాలి. నేను [illegible]నప్పుడు అక్కడ వున్నంత సేపూ సహాయకులెవరూ నాకు కనిపించలేదు. భార్య [illegible] ఏకాంత సేవ చేస్తూ వున్నది" అంటూ క్లుప్తంగా రెడ్డిగారికి వివరించాను. [illegible] ఒక ప్రజా కవికి అవసాన దశలో ప్రజాప్రభుత్వం చెయ్యగలిగిన మంతా చెయ్యమన్నాను.

"రాజకీయాలతో సంబంధం లేని కవికి, కళాస్రష్టకు, అతడెంత గొప్పవాడైనా సరే, అతడి అవసాన దశలో అతడ్ని అందరూ వదిలేస్తారు. నిజంగా ప్రేమించే కుటుంబ సభ్యులు, ఆత్మ మిత్రులు తప్ప మరెవరూ ఆ చుట్టుప్రక్కల కన్పించరు. అన్నివిధాలా ప్రభుత్వమే శ్రద్ధ తీసుకొని సహాయపడాలి" అన్నాను.

బ్రహ్మానంద రెడ్డిగారు విషాద మౌనంగా అంతా విన్నారు. నేనక్కడ వుండగానే జాషువా గారికి ఐదు వందల రూపాయలు వెంటనే పంపవలసిందిగా తమ సెక్రటరీకి చెప్పారు.

ఆ తరువాత రెండు మూడు నెలలలోనే జాషువా కవి మార్తాండుడు అస్తమించాడన్న విషాద వార్త సాహితీ లోకాన్ని చీకట్లో ముంచేసింది.

*జనన మరణాలు ప్రకృతి నైజాలు, వాని*
*వృద్ధి హానులు నాట్లు నూర్పిడులు, అందు*
*నవన వోజ్జీవి తానంద రవులు కవులు;*
*కవి గతించె నటం చేల కంట నీరు?*

## 56

పద్య రచన ఒక రసవ త్కళ. గొంతెత్తి శ్రావ్యంగా పాడదగిన కళ.

సంగీతంలోని అనంతకోటి రాగోపరాగాలలో ప్రతి ఒక్కదాని స్వరూప స్వభావాలను, వ్యక్తిత్వాన్ని స్పష్టంగా చూడగలిగింది పద్యం ఒక్కటే, ఏ పద్యంతోనైనా, ఏ రాగానికైనా సంపూర్ణ సౌందర్యాన్ని గానం ద్వారా సమకూర్చవచ్చు.

అంతటి మహోత్తమమైన పద్యకళ తెలుగు భాషకు లభించిన ప్రత్యేక వరప్రసాదం. ప్రపంచంలో మరే భాషలోనూ పద్యకళ లేదు.

నన్నయ మొదలు నా వరకూ గల వందల వేల తెలుగు కవులందరూ పద్య ప్రక్రియలో కవిత్వం చెప్పినవాళ్ళే. అందులో చాలామంది కవుల చాలా పద్యాలు సంగీత సాహిత్యాలలో మేళవింపుగా వుండి, ఆనంద సరస్వతీ సాక్షాత్కారం లభింపచేస్తై. అట్టి వారిలో అగ్రగణ్యులు బమ్మెర పోతరాజు, గుర్రం జాషువా.

జాషువాగారి వేలకొలదీ పద్యాలలో అన్నీ బాగుంటాయి. తెలుగు జాషువా పద్యం ఒక్కటైనా నోటికి రానివాడు ఒక్కడైనా వుండడంటే అది ముమ్మ నిజం. అందులో నాకు జ్ఞాపకం వున్న కొన్ని పద్యాలను మాత్రమే పేర్కొన్నాను. ఇక్కడ మరి కొన్నిటిని పేర్కొంటున్నాను.

*రాణి విడిచి పోయె రాజు నొంటరి జేసి,*
*రాజు విడిచి పోయె రాజ్య రమను,*
*రాజ్య రమయు విడిచె రాజుల పెక్కంద్ర*
*తాజి విడవలేదు రాజసంబు!* 1

*చక్కని కవితకు కులమే*
*ఎక్కువ తక్కువలు నిర్ణయించినచో, ఇం*

కెక్కడ ధర్మము తల్లీ?
దిక్కుంజర వేదికా ప్రతిష్ఠిత ప్రథ్వీ! 2

కుల మతాలు గీచుకొన్న గీతల జొచ్చి
పంజరాన కట్టు పడను నేను,
నిఖిల లోక మెట్లు నిర్ణయించిన గాని
తరుగులేదు, విశ్వనరుడ నేను! 3

ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నల్వురు కుమారులనుట విన్నాము కాని,
పసరముల కన్న హీనుడభాగ్యుడైన
ఐదవ కులస్థుడెవ్వడమ్మా. సవిత్రీ! 4
కర్మ సిద్ధాంతమున నోరు కట్టి వేసి
స్వార్థ లోలురు నా భుక్తి ననుభవింత్రు,
కర్మ యననేమొ? దానికీ కక్షయేమొ?
ఈశ్వరుని చేత ఋజువు చేయించవమ్మ! 5

నేనైన నుండవలయున్
తానైనను నుండవలయు తలమీద, నటుల్
కాని యెడ రెండు కులములు
ఖూనీ కావలయు, వట్టి గుండుండ వలెన్! 6

(పిలక అనే కవితలో పద్యం ఇది. ఒక యువకుడు ముందు క్రాఫింగూ, వెనక పిలకా పెట్టుకోగా, అవి రెండూ కొట్లాటకు దిగిన ఉదంతం, హాస్యరస ప్రధానం)

వసుధ శాసించగల సార్వభౌముడగును
ధీరుడగు, భిక్షుకుండగు, దీనుడగును,
దుఃఖితుండగు, నిత్య సంతోషి యగును
సత్కవి ధరింపరాని వేషములు కలవె? 7

(సామాన్యుడికి వర్తించే విధి నిషేధాలను కవికి వర్తింపజేయకూడదు. ప్రకృతిలో ఎన్ని జీవరాశులున్నాయో అన్నిటి స్వభావ స్వరూపాలనూ గుర్తించవలసి

వున్నది కనుక, అందుకు తగిన విధంగా కవి ప్రవర్తిస్తాడు. అదొక విశ్వజనీన ప్రయోజకమైన పరిశోధన చర్యగానే గ్రహించవలసి వుంది.)

**ధర్మ సంస్థాప నార్థంబు ధరణి మీద**
**అవతరించెద ననె అబ్జ భవుని తండ్రి!**
**మునుపు జన్మించి నెత్తికెత్తినది లేదు**
**నేడు జన్మించ కున్న మున్గినది లేదు!** 8

(విష్ణువు యొక్క దశావతారాలూ ధర్మ సంస్థాపనార్థమే వచ్చినట్టు భావిస్తున్నాం. అయితే, ఏ అవతారమూ అట్టి పనిచేసినట్టులేదు. ఏ అవతారమూ ప్రజల కోసం వచ్చినట్లు కనిపించదు. ఇంత నిక్కచ్చిగా మరొక మతానికి చెందిన దేవుడ్ని ప్రశ్నించగలమా? ఎంతో విశాలమైనట్టిది హైందవ మత చింతనలో మానవుడికి వున్న స్వేచ్ఛ!)

మత పిచ్చిగాని, వర్ణో
న్నతిగానీ, స్వార్థ చింతనము గానీ నా
కృతులందుండదు; శబ్దా
కృతి బ్రహ్మానంద లక్ష్మి నృత్య మొనర్చున్! **9**

ఆడిన మాట దప్పను, మ
హాత్ముని చెప్పుల జాడలోన గా
లాడ జరించెదం, బ్రజల
కన్నము వెట్టెద, వర్గ భేదపుం
జీద నడం చెదం, గటిక
చీకటి బాపెద, వెర్రి నమ్మకా
లుండని జాడ మస్తకమున
నూనెద శాంతి కళా కుఠారమున్! **10**

ఒకడు ప్రోత్సహింప, నొక్కడు నిరసింప
నొకడు చేర బిలువ, నొకడు తరుమ

మిట్ట పల్లములను మెట్టుచు నెట్టులో
పలుకులమ్మ సేవ సలిపినాడు! **11**

రాజ్యపీఠ మెక్కి రాజ దండము బట్టి
మూడు వత్సరాలు మునిగి పోయె,
దొరల రాచరికమె మెరుగయ్యె ననిపించె
మారు పల్కువేల మంతి రన్న! **12**

(మూడేళ్ళ స్వరాజ్య పాలన తీరు చూచి వ్రాసిన పద్యమిది. అప్పటి కంటే ఇప్పటి పరిస్థితి మరీ ఘోరంగా వుంది కదా!)

అందరము పుట్టు పాపుల మని అహేతు
కముగ భయ బీజములు నాటి కలతపెట్టి
బ్రతుకు మత బోధకుల అనుగ్రహము తప్పి
సంఘ బాహ్యుడ నైతి క్రైస్తవుల యందు! **13**

(జాషువా కవి బ్రహ్మ కనుక, పుట్టు పాపం అనే సిద్ధాంతం ఎంత హేతురహితమైనదో స్పష్టంగా చెప్పగలిగారు)

నరుని సృష్టిచేసి, నందనవనమిచ్చి
సీధు మధుర ఫలము చెంత నుంచి
తినుట నేర మనుట దేవత్వ మౌనటో?
విశ్వయోగ ధామ వినుర భీమ!

అన్నాను నేను నా భీమన శతకంలో.

కవిత చెప్పి నేను ఖర్చులు కోరుదు
తిథులు చెప్పి ద్విజుడు తిరిపె మడుగు
భిక్షు జాతి మాది, భిన్నాంత్యజుల మేము!
విశ్వయోగ ధామ వినుర భీమ!

నేను కవిని – కవిత్వం చెప్పి, దాని ముద్రణకు పైసలు లేక, ఎవరైనా అంకితం తీసుకుని ముద్రణ ఖర్చులు ప్రసాదిస్తారేమోనని వెతుకుతూ వుంటాను. అంటే నేనే కవిత్వం చెప్పి ఖర్చులు కోరతాను. బ్రాహ్మణుడైతే తిథి వారనక్షత్రాలు చెపుతూ అందుకు ప్రతిఫలంగా దినభత్యం అడుక్కుంటాడు.

నేను మాల మాదిగవాణ్ణి. అతడు బ్రాహ్మణుడు. మా ఇద్దరి వృత్తీ భిక్ష మెత్తడమే. ఈ నిమ్నోన్నత కులాల వక్రరేఖలో నేనొక చివరకు చెందితే, అతడు మరొక చివరకు చెందుతాడు.

అంటే, మేమిద్దరమూ అంత్యజులమే కదా? మా గురువూ, గోత్రీకుడూ ఆది భిక్షువు శివుడే కదా!ఇది మరొక పద్యం నా భీమన శతకంలో.

***రాజు మరణించె, నొక తార రాలిపోయె***
***కవియు మరణించె, నొక తార గగన మెక్కె***
***రాజు జడ మయ్యె రాతి విగ్రహములందు,***
***సుకవి జీవించె ప్రజల నాలుకల యందు!***

ప్రజల నాలుకల యందే కాదు, ఈనాడు ప్ర[illegible] తానై ప్రకాశిస్తున్న వాడు మహాకవి, మహాద్రష్ట గుర్రం జాషువా!

ఎల్లప్పుడూ మనతో వుంటూ, మనలను [illegible]మైథంలో ముదుకు నడిపించే ఈ మహాగురువుకు సహృదయ మానవులందరూ సదా కృతజ్ఞులు.

☆☆☆☆☆☆